ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 1, ఆగస్టు 2025

మార్కాపురంలో 'రంగమ్మత్త' సందడి

మార్కాపురంలోని కాలేజీ రోడ్డులో షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి గురువారం ఉదయం వచ్చిన సినీ తార, టీవీ యాంకర్ అనసూయను చూసేందుకు అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. రంగమ్మత్త అంటూ కేకలు వేశారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు యువకులు పోటీపడ్డారు.

- మార్కాపురం, ఆంధ్రజ్యోతి



నేటి నుంచి రేషన్ పంపిణీ

అన్ని ఏర్పాట్లను పూర్తిచేసిన పౌరసరఫరాల శాఖ



ఒంగోలు కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి రేషన్ షాపుల నుంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రభుత్వం జూన్ నుంచి కార్డుదారులకు రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తుంది. జిల్లాలో 1,392 దుకాణాల పరిధిలో 6.61లక్షల తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా వారందరికీ బియ్యం, చక్కెరను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించి ముందస్తుగా దివ్యాంగులు, 65ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఆయా రేషన్ షాపుల ద్వారా బియ్యం, చక్కెరను పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో అలాంటి వారి రేషన్‌కార్డులు 78,806 ఉండగా ఇప్పటివరకు సుమారు 60శాతానికి పైగా కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. ఇక శుక్రవారం ఆగస్టు నెలకు సంబంధించి రేషన్ పంపిణీ ప్రారంభం కానుండటంతో అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా ఈ నెలలో కూడా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం లేదు. గత ఆరేడు నెలల నుంచి జిల్లాలో రేషన్‌షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ నిలిచిపోగా ఆగస్టులో కూడా అందుబాటులో లేకపోవడంతో కార్డుదారులకు కేవలం బియ్యం, పంచదారను మాత్రమే ఇవ్వనున్నారు.

ఆగస్టులో బంపర్ బొనంజా

- విభిన్న వర్గాలకు పలు పథకాలు
- లక్షలాది కుటుంబాలకు మేలు
- నేడు 5,174 స్పౌజ్ పింఛన్ల పంపిణీ
- రేపు 2.65 లక్షల మందికి అన్నదాత సుఖీభవ
- 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- జిల్లాలో 74,911 బంగారు కుటుంబాల గుర్తింపు
- 25 నుంచి కొత్త రేషన్ కార్డులు..
- ఇప్పటికే 66 వేల కార్డులు గుర్తింపు

జిల్లా ప్రజలకు శుభవార్త. ఆగస్టు నెల సంక్షేమ పథకాల నెలగా మారుతోంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు పథకాలు ఈ నెలలో అమల్లోకి రానున్నాయి. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో ఇది ఒక కీలక పరిణామం. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన దిశగా చేపట్టిన పీ4 కార్యక్రమం కూడా ఈ నెలలో ప్రారంభం కానుంది. ఒక నెలలో ఇన్ని ప్రభుత్వ పథకాల అమలుకు నోచుకోవడం ఇదే ప్రథమం. ఆయా పథకాల ద్వారా జిల్లాలో సుమారు 5.70 లక్షల కుటుంబాలకు మేలు జరగనుంది. - ఒంగోలు, ఆంధ్రజ్యోతి



2.65 లక్షల మందికి అన్నదాత సుఖీభవ



అన్నదాత సుఖీభవ ద్వారానే జిల్లాలో 2,65,317 రైతు కుటుంబాలకు మేలు జరగనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ పథకంతో కలిపి ఏడాదికి ఒక్కొక్క రైతు కుటుంబానికి రూ.20వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. అందులో రూ.6వేలు కేంద్రం కాగా మిగిలిన రూ.14వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా జిల్లాలో ఈ పథకం లబ్ధిదారులకు ఏడాదికి రూ.371.45 కోట్ల మేర జమ చేయనుంది. ఇందుకోసం తొలి విడత నగదును ఆగస్టు 2న జమ చేయనుంది. ఆ కార్యక్రమాన్ని జిల్లాలోని దర్శి మండలం తూర్పు వీరాయపాలెం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తొలి విడత జిల్లాలోని రైతులకు రూ.185.72 కోట్లు అందనున్నాయి.

లక్ష మందికి ఉచిత బస్సు సౌకర్యం

మరో కొత్త హామీ అయిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా ఆగస్టులోనే అమలులోకి రానుంది. అందుకు సంబంధించి విధివిధానాలతో పాటు అమలుకు సంబంధించి కసరత్తును అధికారులు పూర్తి చేశారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రమంతా మహిళలు వ్యక్తిగత గుర్తింపు కార్డు చూపి ప్రయాణించేలా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ఆగస్టు 15 నుంచి అమలులోకి రానుంది. ఈ పథకం ద్వారా రోజుకు సుమరు లక్ష మంది మహిళలు జిల్లాలో ప్రయాణం సాగించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఐదు ఆర్టీసీ డిపోల పరిధిలో 484 బస్సులు రోజువారీ రెండు లక్షల కిలో మీటర్లు తిరుగుతున్నాయి. నిత్యం లక్షా 50వేల మంది ప్రయాణిస్తున్నారు. వారిలో 60వేల మంది మహిళలు ఉన్నట్టు అంచనా. ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు ద్వారా మహిళా ప్రయాణికులు రోజువారీ లక్షకు పెరగవచ్చని అంచనా వేసి తదనుగుణమైన ఏర్పాట్లను ఆర్టీసీ అధికారులు చేస్తున్నారు. దీనివల్ల ఏటా రూ.127.50 కోట్లుకుపైగా ప్రభుత్వంపై భారం పడుతుందని అంచనా.

స్పౌజ్ పింఛన్లకు రూ.124.9 కోట్లు

ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న సామాజిక పింఛన్లలో స్పౌజ్ విభాగానికి చెందిన కొత్త పింఛన్లు ఈ నెలలో ఇస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇతరత్రా పలు విభాగాలకు చెందిన 2,84,966 మందికి నెలనెలా రూ.124.93 కోట్లు మేర ఇస్తున్నారు. పింఛన్ పొందుతున్న వ్యక్తి మృతి చెందితే అతని భార్యకు ఆటోమేటిక్‌గా ఆ పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించింది. అలాంటి వారు జిల్లాలో 5,174 మంది ఉన్నట్లు గుర్తించి వారికి ఆగస్టు నుంచి నగదు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించింది. వారికి సగటున నెలకు రూ.2.07 కోట్లు వంతున ఏడాదికి సుమరు రూ.25 కోట్ల మేర

మిగతా 6లో...

సాగుకు భరోసా

- జిల్లాకు చేరిన సాగర్ జలాలు
- గతం కన్నా నెలన్నర ముందుగానే సరఫరా
- మాగాణికి రైతులు సన్నద్ధం
- ఇప్పటికే పలుచోట్ల నార్లు పోసిన వైనం
- కాలువల మరమ్మతు పనులు
- కొలిక్కిరాని చోట సరఫరాకు ఇక్కట్లు
- తాగు, సాగునీటికి ఒకేసారి సరఫరా


జిల్లా పరిధిలోని దూపాడు బ్రిడ్జి వద్ద సాగర్ ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహం

ఒంగోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి వనరైన సాగర్ కాలువ ఆయకట్టులో ఈ ఏడాది సాగుకు భరోసా కనిపిస్తోంది. ప్రత్యేకించి మాగాణి సాగుపై రైతులు నమ్మకంతో ఉన్నారు. జిల్లాలో తిండిగింజల ఉత్పత్తి, పశువుల మేతకు ఇబ్బంది కలుగకుండా ఉండాలంటే సాగర్ నీరు పుష్కలంగా సకాలంలో సరఫరా కావాలి. ఉమ్మడి జిల్లాలో 4.34లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల పరిధిలో ఉండగా ఏటా నీటి ఇక్కట్లతో 3 లక్షల ఎకరాలలోపుగానే సాగవుతోంది. అందులో కూడా లక్ష ఎకరాలలోపు మాగాణి మిగిలిన 2 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆరుతడి పంటలు వేస్తారు. సాధారణంగా సెప్టెంబరులో సాగుకు నీరు వస్తుంది. ఒక్కొక్కసారి కీలకమైన డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు నీటి సరఫరా సరిలేక వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడిన పరిస్థితులు ఉన్నాయి. అలాంటిది ఈ ఏడాది నెలన్నర ముందుగానే జిల్లాకు సాగర్‌జలాలు వచ్చాయి. ఎగువ ప్రాంతంలో భారీవర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ఈ ఏడాది జూలైలోనే

మిగతా 6లో...


సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి స్వామి

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- మంత్రి డీఎస్‌బీవీఎన్ స్వామి

దర్శి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామంలో ఆగస్టు 2న అన్నదాన సుఖీభవ పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు వస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. సభావేదిక ఏర్పాటుచేసే స్థలాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కొద్ది దూరంలో ఏర్పాట్లు చేస్తున్న హెలిపాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలన్నింటినీ తుచ తప్పకుండా అమలు చేస్తున్నదని తెలిపారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని దర్శిలో అమలుకు శ్రీకారం చుట్టడం ఆనందదాయకమన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేల చొప్పున మూడు దపాలుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 46.50లక్షల మంది రైతులకు ఈపథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పలువురు జిల్లా అధికారులు, స్థానిక అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పొగాకు మార్కెట్ తిరోగమనం

- నాలుగున్నర నెలలు గడిచినా సగం కూడా పూర్తి కాని కొనుగోళ్లు
- నిత్యం మూడొంతుల బేళ్లు తిరస్కరణ
- వ్యాపారుల ఇష్టానుసారం వేలం
- మేలు రకం బేళ్ల కోసం పోటీపడుతున్నా ధరలపై సీలింగ్
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఒంగోలులో ఆర్‌ఎం ఆఫీసు వద్ద ధర్నా
- పొదిలి వేలం కేంద్రంలో నిరసన
- ఉత్తరాది ధరల కన్నా ఇక్కడ దైన్యస్థితి
- పాలకపక్షంలో కనిపించని స్పందన

దక్షిణాది పొగాకు మార్కెట్ పూర్తి తిరోగమనంలో సాగుతోంది. వేలం ప్రక్రియ ప్రారంభమై నాలుగున్నర నెలలు గడిచినా ఇంతవరకు పండిన పంటలో సగం మించి కొనుగోలు జరగలేదు. నిత్యం అమ్మకాల కోసం వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లు భారీగా తిరస్కరణలు జరుగుతున్నాయి. మార్కెట్లో వ్యాపారుల ఇష్టారాజ్యం సాగుతోంది. మేలు రకం బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీపడుతున్నా గరిష్ఠ ధర మాత్రం కిలో రూ.280 లేదా రూ.281కు మించడం లేదు. అదే సమయంలో లోగ్రేడ్ బేళ్లను అధికారులు సూచించే ధరకు కొనేందుకు ఏ ఒక్క కంపెనీ ముందుకు రావడం లేదు. అలా వ్యాపారులు కూటమి కట్టి గరిష్ఠ ధరలపై సీలింగ్ పెట్టి లోగ్రేడ్ బేళ్లను కొనుగోలు చేయకుండా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

ఒంగోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు ఈ ఏడాది తిప్పలు తప్పడం లేదు. ఈ సీజన్‌లో దక్షిణాదిలో రైతులు పొగాకు పంటను భారీగా సాగు చేశారు. పొగాకు బోర్డు 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి

మిగతా 6లో...



లోగ్రేడ్ కొనుగోళ్లకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

7

బిడ్డ పరిపుష్టి కోసం అమృతం.!

- నేటి నుంచి ప్రపంచ 'తల్లిపాల వారోత్సవాలు'
- వారం రోజులపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు

7

ఎక్సైజ్‌లో కోల్డ్ వార్

- స్టేషన్ తనిఖీకి వెళ్లిన ఉన్నతాధికారి
- అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులు స్వాధీనానికి యత్నం
- కోపంతో ఊగిపోయిన స్టేషన్ నిర్వహణ అధికారి
- ఫోన్ నేలకేసి కొట్టిన వైనం
- సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్న ఉన్నతాధికారి

7

లాకౌట్ ప్రకటించిన సింథైట్ యాజమాన్యం

మేదరమెట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): కోరు అధికంగా వస్తుందని మేదరమెట్లలోని సింథైట్ కంపెనీ ఎదురు గ్రామస్థులు బుధవారం నిరసన చేపట్టి ఫ్యాక్టరీని ముయించారు. దీంతో గ్రామస్తుల ఆందోళన మేరకు గురువారం సింథైట్ యాజమాన్యం లాక్‌అవుట్ ప్రకటిస్తున్నట్లు నోటీసులను గేట్‌కు అంటించారు. కోరు రాకుండా ఉండడానికి కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, గ్రామస్థులు కోరుతో ఇబ్బంది పడుతున్నట్లు ఆందోళన చెందడంతో లాక్‌అవుట్ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. తదుపరి నిర్ణయాలు తీసుకునేవరకు లాక్ అవుట్ కొనసాగుతుందన్నారు. కోరు రాకుండా చర్యలు తీసుకుని ఫ్యాక్టరీ నడుపుకోవడానికి తమ కేమి అభ్యంతరం లేదని గతంలోనే గ్రామస్థులు అధికారులు తెలిపారు.

హాస్టల్ నిర్మాణానికి రూ.5.30 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో నిధులు మంజూరు

తీరనున్న గిరిజన విద్యార్థుల ఇక్కట్లు

పర్చూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వసతుల లేమితో చాలీచాలని భవనంలో ఇక్కట్లు పడుతున్న పర్చూరు గిరిజన బాలుర ఇక్కట్లు తొలగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మాణానికి రూ.5.30 కోట్లు నిధులు మంజూరు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన భవనంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ప్రభుత్వం విద్యార్థులకు అధునిక క్లాస్ రూమ్స్, హాస్టల్ బిల్డింగ్, మరుగుదొడ్లు తదితర వసతులతో కూడిన సొంత భవనం నిర్మాణం చేసుకునే విధంగా నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా నూతన తరగతి గదుల నిర్మాణం రూ.1.60 కోట్లు, నూతన హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.3.19 కోట్లు, ఫర్నీచర్ కొనుగోలుకు రూ.16 లక్షలు, అధునీకరణ పనులకు రూ.35 లక్షల చొప్పున విడుదల చేసింది. త్వరలో భవన నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఎన్నో ఏళ్ళుగా వసతుల లేమితో ఇరుకు అద్దె భవనంలో నానా అవస్థలు పడుతున్న గిరిజన బాలువకు ఇక్కట్లు తీరనుండడంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ

● టిప్పర్ ఆయిల్ ట్యాంక్ పగిలి డీజిల్ రోడ్డు పాలు

అద్దంకి, జూలై 31(ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను లారీ ఢీ కొట్టడంతో టిప్పర్ ఆయిల్ ట్యాంక్ పగిలి డీజిల్ రోడ్డు పాలయ్యింది. అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద గురువారం వేకువజామున గ్రావెల్ టిప్పర్ నామ్ రోడ్డులో నుంచి కలవకూరు రోడ్డులోకి మలుపు తిరుగుతుండగా నామ్ రోడ్డులో అద్దంకి పట్టణంలోకి వస్తున్న లారీ ఢీ కొట్టింది. టిప్పర్ ఆయిల్ ట్యాంక్‌ను లారీ ఢీ కొనడంతో పగిలి డీజిల్ మొత్తం నేలపాలయ్యింది. నామ్ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం హైవే పె ట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరించారు.

జిల్లాలోకి ప్రవేశించిన సాగర్‌జలాలు

2,500 క్యూసెక్కుల నీరు రాక

కాలువపై పర్యటించిన సీఈ శ్యాంప్రసాద్

సీఎం పర్యటన నేపథ్యంలో ఆరా తీసిన మంత్రి

అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు

త్రిపురాంతకం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజల తాగు సాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ కుడికాలువ ద్వారా విడుదలైన నీరు బుధవారం అర్ధరాత్రి జిల్లా సరిహద్దు పుల్లలచెరువు మండలం మానేపల్లి సమీపంలోని 85/3 మైలు వద్దకు చేరాయి. ప్రారంభంలో దాదాపు 1,900 క్యూసెక్కులు వచ్చిన నీరు క్రమేపి పెరిగి 2,500 క్యూసెక్కులు తగ్గకుండా వస్తున్నాయి. గురువారం ఉదయం త్రిపురాంతకం చేరిన సాగర్‌నీరు సాయంత్రానికి దూపాడు వద్దకు చేరాయి. ఈ నెల 2వ తేదీన జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. దూపాడు వద్ద ప్రధాన కాలువపై ఎన్నెస్పీ అధికారులు చీఫ్ ఇంజనీర్ బి.శ్యాంప్రసాద్‌తో కలిసి డీఈ విజయలక్ష్మి, ఏఈ శివన్నారాయణ పర్యటించారు. సీఈ శ్యాంప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న 2,500 క్యూసెక్కుల నీరు తగ్గకుండా చివరివరకు అందేలా చూడాలని సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా సాగరునీటి సరఫరాపై ఆరా తీసినట్టు ఆయన చెప్పారు. ప్రజలకు సాగునీటితో పాటు ఎక్కడెక్కడ తాగునీటి అవసరాలు ఉన్నాయో అన్నింటికీ సరిపడా నీటిని వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. కాగా గురువారం రాత్రికి కురిచేడు వరకు నీరు వెళ్లవచ్చని, శుక్రవారం ఉదయం 11 గంటలకు దర్శికి సాగరునీరు చేరుతుందని అధికారులు తెలిపారు.



కాలువలో ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా సరిహద్దు వద్ద గుంటూరు నుంచి వచ్చే నీటిలో 2500 క్యూసెక్కులు తగ్గకుండా ఉండేలా చూసుకోవాలని సీఈ అధికారులకు సూచనలు చేశారు. వారితో పాటు జేఈ భరత్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని చలమయ్య ఉన్నారు.

నాటి రన్నింగ్ కామెంటరీ మరిచారా..!

వైసీపీ కౌన్సిలర్ల ఆరోపణలను తిప్పి కొట్టిన టీడీపీ మహిళా కౌన్సిలర్లు

నాడు అభివృద్ధి గురించి మరిచి.. ప్రశ్నిస్తే రన్నింగ్ కామెంటరీ అన్నారు..

ప్రస్తుతం అభివృద్ధి జరుగుతుంటే ఆరోపణలా..

వైసీపీ కౌన్సిలర్లను నిలదీసిన టీడీపీ



వైసీపీ కౌన్సిలర్ కోటేశ్వరరావు విమర్శలను తిప్పికొడుతున్న టీడీపీ మహిళా కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి,జూలై31(ఆంధ్రజ్యోతి): 'అప్పట్లో సమస్యలపై ప్రశ్నిస్తే రన్నింగ్ కామెంటరీ చేసిన విషయాన్ని మరిచి పోయారా..?' అని పలువురు మహిళా టీడీపీ కౌన్సిలర్లు వైసీపీ కౌన్సిలర్లపై తిరగబడ్డారు. అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం గురువారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాడివేడి చర్చ నడిచింది. వైసీపీ కౌన్సిలర్లు గుంజి కోటేశ్వరరావు, బాలు తదితరులు ఎన్టీఆర్ కాలనీ, నాటి జగనన్న కాలనీలు(ప్రస్తుతం ఎన్టీఆర్ నగర్‌లు)లలో చిల్లచెట్లు తొలగించాలని, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదే సందర్భంగా అద్దంకి పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. దీంతో ఒక్కసారిగా కోపోద్రేకులైన టీడీపీ మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాము సమస్యలపై ప్రశ్నిస్తే ఫోటోల కోసం ఫోజులిస్తున్నారని విమర్శించారని గుర్తు చేశారు. ఇతర ఇబ్బందికర వ్యాఖ్యలతో చేసిన రన్నింగ్ కామెంటరీ అప్పుడే మరిచి పోయారా అని విమర్శించారు. దీంతో వైసీపీ కౌన్సిలర్ వెనుకడుగు వేసి మిన్నకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అద్దంకి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అజెండాలోని 20 అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్లు, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాడు నరకప్రాయం.. నేడు సుఖ ప్రయాణం

● రూపురేఖలు మారిన తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డు

● పునరుద్ధరించని ధేనువకొండ ఆర్టీసీ బస్ సర్వీస్



నిర్మాణం పూర్తయిన దోర్నపువాగు వంతెన

అద్దంకి,జూలై31(ఆంధ్రజ్యోతి): మూడు మండలాల ప్రజలు వినియోగించే తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డులో ఏడాది కిందటి వరకు ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేది. 10 కి.మీ దూరం వెళ్లాలన్నా గంట కంటే ఎక్కువ సమయం పట్టేది. అదే రోడ్డులో ఇప్పుడు ప్రయాణం సుఖ మయంగా మారింది. సుమారు 20 కి.మీ దూరం ఉండే రోడ్డుకు కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చిన తర్వాత మంత్రి రవి కుమార్ ప్రత్యేక దృష్టి సారించి సుమారు రూ.2.20 కోట్లు మంజూ రు చేయించారు. తిమ్మాయపాలెం నుంచి ఇలపావులూరు వరకు సుమారు 20 కి.మీ దూరం ఉండ గా తారు రోడ్డు పూర్తిగా శిథిలా వస్థకు చేరింది. దీంతో పునః నిర్మాణం చేయడంతో పాటు పేరాయపాలెం వద్ద పూర్తిగా కుంగిపోయి రాకపోకలు నిలిచిన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణం కూడా చేపట్టారు. దీంతో అద్దంకి మండలంలోని 10 గ్రామాలతో పాటు చీమకుర్తి, తాళ్లూరు మండలాలలోని పలు గ్రామా లకు రాకపోకలకు మరింత సులువుగా మారింది. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణించిన ఇతర ప్రాంతాల వాహనచోదకులు ప్రస్తుతం ప్రయాణిస్తూ 'ఈ మార్గంలోనే వెళుతున్నామా..? మరో మార్గంలోనికి వచ్చామా..?' అన్న అన్న సంశయం కలిగే విధంగా రోడ్డు రూపు రేఖలు పూర్తిగా మారి పోయాయి. అయితే పేరాయపాలెం వద్ద వంతెన కూలడంతో రద్దు చేసిన అద్దంకి -ధేనువకొండ బస్ సర్వీసు మాత్రం రోడ్డు బాగుపడ్డ తర్వాత కూడా బస్ పునరుద్ధరించకపోవడం తో పేరాయపాలెం, ధేనువకొండ, ఉమ్మనేనివారిపాలెం గ్రామాల ప్రజలు అద్దంకి రావడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ధేనువకొండ సర్వీస్‌ను వెల్లంపల్లి మీదుగా ఒంగోలుకు పొడిగించాలని, ఇలపావులూరు మీదుగా చీమకుర్తికి మరో సర్వీస్‌ను నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు

పోలేరమ్మ ఆలయంలో విశేష పూజలు

యద్దనపూడి,(మార్టూరు)జూలై31 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో గురువారం గ్రామదేవత పోలేరమ్మ, ఉపదేవత ఊర అంకమ్మతల్లి అనంత వార్షిక కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక అలంకరించారు. మహిళలు అమ్మవార్లుకు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పూసలు, మంగళ ద్రవ్య సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆలయ అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవార్ల మూలమూర్తుల విశేష కుంకుమ, పుష్ప అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ద్విచక్ర వాహనం చోరీ

ఈపూరుపాలెం(చీరాల), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సరదాగా సముద్ర తీరంలో గడిపేందుకు వచ్చిన పర్యాటకుని ద్విచక్ర వాహనంపై చోరీకి గురైంది. ఒంగోలు సమీపంలోని త్రోవగుంటకు చెందిన పాలపర్తి జయపాల్ గత బుధవారం వాడరేవు సముద్ర తీరానికి వచ్చాడు. ఒడ్డున వాహనం పార్కింగ్ చేసి సముద్రంలో మునిగి వచ్చిన తర్వాత చూస్తే వాహనం కనిపించ లేదు. ఈక్రమంలో ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీకెమెరాలు తప్పనిసరి

అద్దంకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లు, ఏటిఎంల వద్ద సీసీ కెమెరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని సీఐ సుబ్బరాజు అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అద్దంకి పట్టణంలోని బ్యాంకుల అధికారులతో సీఐ సుబ్బరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగలను గుర్తించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.



ధేనువకొండ సమీపంలో వరి నారు మడి చుట్టూ రక్షణ గా చుట్టిన చీరలు

నారుమడికి రక్షణగా రంగు రంగుల చీరలు

ఆకర్షిస్తున్న రంగుల ప్రపంచం

అద్దంకి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండ సమీపంలోని పొలాలలో వరినారుమడులు చేసే రైతులు రంగురంగులుగా ఉన్న చీరలను చుట్టూ ఏర్పాటు చేశారు. దీంతో జంతువులు నారుమడిలోకి వెళ్లకుండా ఉండడంతో పాటు పక్షులు కూడా దగ్గరలోకి రాకుండా ఉంటాయన్న ఉద్దేశ్యంతో రైతులు ఇలా చీరలతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో ఈ ఏర్పాటు పలువురిని ఆకర్షిస్తోంది.

సాగుకు భరోసా

అవీఇవీ

(5వపేజీ తరువాయి)



కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు

శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లు నిండాయి. ప్రస్తుతం కూడా ఆ రెండింటిలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈనేపథ్యంలో సాగర్ డ్యామ్ నుంచి 21 గేట్లను బుధవారం ఎత్తారు. అదే సమయంలో కుడికాలువకు 9వేల క్యూసెక్కుల నీటిని మూడు రోజులుగా ఇస్తున్నారు. ఆ నీరు ఎగువన ఉన్న బుగ్గవాగుకు అక్కడి నుంచి 7వ మైలు దిగువ ప్రధాన కాలువలో ప్రవహిస్తూ జిల్లా సరిహద్దులోని 85/3 మైలు వద్దకు గత రాత్రి 1 గంట ప్రాంతంలో జలాలు చేరాయి. ప్రస్తుతం అక్కడ 2,250 క్యూసెక్కుల నీరు వస్తుండగా శుక్రవారం సాయంత్రానికి దర్శి సమీపంలోని ఒంగోలు బ్రాంచి కాలువ (ఓబీసీ) హెడ్‌కు నీరు చేరుతుంది. ఆ మరుసటి రోజున రామతీర్థం ప్రాజెక్టుకు చేరుతాయని సమాచారం.

సాగుపై రైతుల్లో నమ్మకం

తాగు, సాగునీటికి ఏ ప్రాంతంలో ఎవరికి నీరు అవసరం అంటే వారికి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అద్దంకి బ్రాంచి కాలువ(ఏబీసీ)కు కూడా నీరు ఇస్తున్నారు. ఇలా దాదాపు నెలన్నర రోజులు ముందుగానే సాగర్ నీరు సరఫరా కావడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి కృష్ణానదిపై ఉన్న డ్యామ్‌లకు వరద నీరు వస్తుండటంతో ఈ ఏడాది ఆయకట్టులో పంటల సాగుపై రైతులు నమ్మకంతో కనిపిస్తున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో 85వేల ఎకరాల్లో మాగాణి, లక్షా 90వేల ఎకరాలలో ఆరుతడి పంటలు సాగు కాగా ఈ ఏడాది మరో 50వేల ఎకరాలలో అదనంగా సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాలువల మరమ్మతుల పనులు కొలిక్కి రాకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాలువలు దెబ్బతినగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు ఇచ్చిన ఇంచుమించు రెండు నెలలు ముందుగానే నీటి విడుదలతో చాలాచోట్ల ఆ పనులు పూర్తికాలేదు. ప్రధాన కాలువల్లో జరిగినా మేజర్, మైనర్ కాలువల్లో చేయలేదు. దీని వల్ల పొలాలకు నీటి సరఫరాపై రైతులలో ఒకింత ఆందోళన వ్యక్తం అవుతోంది.

బంపర్ బొనంజా

(5వపేజీ తరువాయి)

లబ్ధి చేకూరనుంది.

పీ4తో పేద కుటుంబాలు వృద్ధిలోకి..

ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంతో కొత్తగా చేపట్టిన పీ4 పథకం కూడా ప్రారంభిస్తున్నారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 74,911 కుటుంబాలను పేదరికం నుంచి అభివృద్ధి వైపు తీసుకురావాలని నిర్ణయించారు. అవి బంగారు కుటుంబాలుగా నామకరణం చేసి వారికి అసరాగా నిలిచే మార్గదర్శుల(దాతలు)ను చూస్తున్నారు. ఇప్పటికే సగం బంగారు కుటుంబాలకు అవసరమైన మార్గదర్శకులను ఎంపిక చేశారు.

● 66 వేల కుటుంబాలకు రేషన్ లబ్ధి

చాలా కాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల సమస్య కూడా పరిష్కారం కానుంది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల విభజన, వివాహాలతో ఏర్పడిన దంపతులకు కొత్త కార్డులు మంజూరు, పేర్ల నమోదులో మార్పులు, చేర్పులు ఇతరత్రా సమస్యల పరిష్కారం చేసింది. ఆయా విభాగాలకు సంబంధించి అధికారులకు జిల్లాలో సుమారు 88 వేల దరఖాస్తులు అందగా వాటిని పరిశీలించి 66వేలకు పైగా దరఖాస్తులను ఆమోదించారు. వారికి ఆగస్టు 25 నుంచి కొత్త రేషన్‌కార్డులు రానున్నాయి. ఇలా ఆగస్టు నెలలో జిల్లాలో లక్షలాది కుటుంబాలకు కోట్లాది రూపాయలు లబ్ధి చేకూర్చే పలు ప్రభుత్వ పథకాలు అమలులోకి రానున్నాయి.

పొగాకు మార్కెట్ తిరోగమనం

(5వపేజీ తరువాయి)

ఇవ్వగా రైతులు విస్తారంగా సాగు చేయడంతో ఏకంగా 162 మిలియన్ల పంట ఉత్పత్తి అయినట్లు అంచనా. ఒంగోలు కేంద్రంగా దక్షిణాదిలో ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ రిజయన్లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుత ప్రకాశం జిల్లాలో ఏడు, నెల్లూరు జిల్లాలో 4 వేలం కేంద్రాలు ఉన్నాయి. మార్చి 10న తొలిదశ, కొద్ది రోజులకు రెండవ దశ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280తో కొనుగోళ్లు మొదలయ్యాయి. అనంతరం ధరలు పెరుగుతాయని రైతులు భావించారు. నాణ్యత చెడకుండా ఉంటే మంచి ధరలు లభిస్తాయని మేలు రకం బేళ్లను అధికశాతం మంది రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు.

మార్కెట్ ఒడిదొడుకులు

తొలుత నెల రోజులు కాస్తంత జోరుగానే మార్కెట్ సాగినా అనంతరం ఒడిదుడుకులు ప్రారంభం కాగా ఇంత వరకు అది కుదుట పడలేదు. నెలన్నర క్రితం మార్కెట్ తీరుపై రైతుల్లో అలజడి నెలకొంది. విదేశీ ఆర్డర్లు త్వరలో వస్తాయని అనంతరం ధరలు పెరుగుతాయని మేలు రకం బేళ్లను వేలం కేంద్రాలకు తీసుకరావాలని వ్యాపారులు సూచించారు. వారి వాదనకు బోర్డు అధికారులు కూడా వంతపాడటంతోపాటు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి మార్కెట్‌లో సంక్షోభాన్ని తాత్కాలికంగా ఆపగలిగారు. అదే సమయంలో జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా వేలం కేంద్రాలు సందర్శించి హడాహుడి చేయడంతో కొద్ది రోజులు సజావుగా మార్కెట్ సాగినా తిరిగి నెల రోజులుగా దారుణంగా ఉంది.

● ఉత్తరాదిన పెంపు.. దక్షిణాదిన దారుణం

ఉత్తరాదిలోని గోదావరి జిల్లాల్లో ఉన్న వేలం కేంద్రాల్లో కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.390కి వెళ్లి ప్రస్తుతం రూ.370కి అటు ఇటుగా సాగుతోంది. దక్షిణాదిలో మాత్రం గరిష్ఠ ధర కిలో రూ.280గానే ఉంది. మేలు రకం బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు వేలం కేంద్రాల్లో పోటీపడుతున్నారే తప్ప ధర మాత్రం పెంచడం లేదు. గత ఏడాది ఇక్కడ కూడా గరిష్ఠ ధర కిలో రూ.360 వరకు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న మేలు రకం బేళ్లను అమ్మకాలకు తెస్తే ధర లభించక నష్టపోతామని భావిస్తున్న రైతులు ఇళ్ల వద్ద ఉన్న లోగ్రేడ్ బేళ్లను అధికంగా తెస్తున్నారు.

లోగ్రేడ్ బేళ్ల తిరస్కరణ

వ్యాపారులు మాత్రం లోగ్రేడ్‌ను కొనుగోలు చేయడం లేదు. లోగ్రేడ్‌లో మంచిదిగా భావించే బ్రౌన్ ఇతర రకాలను గతం కన్నా కిలోకు రూ.20 నుంచి రూ.50 వరకు తగ్గించి కొంటున్న బయ్యర్లు, పూర్తి లోగ్రేడ్‌గా భావించే మొద్దుపచ్చ, మాడు రకాల జోలికి వెళ్లడం లేదు. ఆ గ్రేడ్‌ల ధరలను బోర్డు అధికారులు తగ్గించి బిడ్ పెడుతున్నా బయ్యర్లు కోనేందుకు ముందుకు రావడం లేదు. చివరకు కిలో రూ.150కి కూడా కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆ బేళ్లను అధికారులే నోబిడ్ చేస్తున్నారు. నిత్యం ఆయా వేలం కేంద్రాల్లో ఇలాంటి నోబిడ్ బేళ్లు భారీగా ఉంటున్నాయి. ఈ వారంలో పరిస్థితి పరిశీలిస్తే సగటున దక్షిణాది వేలం కేంద్రాలలో 30 శాతానికిపైగా నోబిడ్‌లు ఉంటున్నాయి. కొన్ని వేలం కేంద్రాల్లో ఏకంగా 40శాతం కన్నాపైనే ఉంటుండగా ఈనెల 29న టంగుటూరు కేంద్రంలో ఏకంగా 50.36 శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. ఈనెల 28న దక్షిణాదిలో 35శాతానికి పైగా నోబిడ్‌లు ఉండగా 29న 32శాతం, 30వ తేదీన 26శాతంగా ఉన్నాయి. అంతకుముందు వారంలోనూ 31శాతానికి పైగానే నోబిడ్‌లు ఉన్నాయి. ఇంత తీవ్రంగా పరిస్థితి ఉండి వ్యాపారులను నియంత్రించడంలో బోర్డు అధికారులు విఫలం అవుతున్నారు.

ఆందోళన బాటలో రైతులు

మార్కెట్ తీరుపై తీవ్ర అవేదనతో పొదిలి వేలం కేంద్రంలో గురువారం రైతులు నిరసనకు దిగారు. ఒంగోలులోని ఆర్ఎం కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నెలన్నర క్రితం హడాహుడి చేసి వేలం కేంద్రాలకు వెళ్లి సమీక్షలు చేసిన అధికారపక్ష ప్రజాప్రతినిధులు మార్కెట్ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రస్తుత తరుణంలో పట్టీనట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం దృష్టికి తమ అవేదనను తీసుకెళ్లి బర్లీ రైతులకు అందించిన విధంగా తమకు కూడా ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఎస్‌సీవీ పొగాకు రైతులు కోరుతున్నారు.

బిడ్డ పరిపుష్టి కోసం అమృతం..!

నేటి నుంచి ప్రపంచ 'తల్లిపాల వారోత్సవాలు'

వారం రోజులపాటు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవగాహన కార్యక్రమాలు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు మాతృత్వం గొప్ప అనుభూతి.. అంతకు మించి ఓ వరం.. దానిని పొందాలని ప్రతి వివాహిత ఆశపడతారు. బిడ్డకు అమ్మపాలకు మించిన ఔషధం లేదని, పండంటి బిడ్డ కోసం తల్లిపాలే శ్రేయస్కరం. ఇటీవలకాలంలో కొందరు మహిళలు అందం, శరీర ఆకృతి తగ్గుతుందని పిల్లలకు పాలివ్వడం మానేసి బాటిల్ ఫీడింగ్ ద్వారా ఇవ్వడం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని వైద్య ఆరోగ్య శాఖ, అలాగే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగా ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యత, బిడ్డ ఆరోగ్య సంరక్షణ అవశ్యకత గురించి అవగాహన కల్పిస్తారు. ఆగస్టు 1న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సైతం నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే ఈ వారోత్సవాలు 1992 నుంచి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు జిల్లాలోని అన్నీ ప్రభుత్వ వైద్యశాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. అలాగే ఐడీసీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లలోనూ బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



తల్లిపాలు ఓ టీకా లాంటివి

బిడ్డ శారీకర, మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రొటీన్లు, విటమిన్లు వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమతూకంలో ఉంటాయి. కాన్పు తర్వాత మొదటి రెండు, మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమైనవని, భావి ఆరోగ్యానికి తొలి బీజం వేసేవి తల్లిపాలు అని వైద్యులు చెబుతున్నారు. ఇవి ఒకరకంగా తొలి టీకాలాంటివి. ఇందులో ఉండే ఇమ్యూనోగ్లోబులిన్లు బిడ్డ రోగ నిరోధకశక్తి పెంపొందిస్తాయి. శిశువు ఇన్‌ఫెక్షన్ల బారినపడకుండా కాపాడతాయి. కాన్పు తర్వాత ఐదారు రోజులకు పాలు కాస్త పలుచబడినప్పటికీ వాటిలో కొవ్వు, లాక్టోజ్ బాగా ఉండటం వలన అవి బిడ్డకు మరింత శక్తినిస్తాయి. రెండువారాల తర్వాత తల్లిపాలలో 90 శాతం నీరు, 8 శాతం పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రొటీన్లు, 2 శాతం ఖనిజాలు, విటమిన్లు ఉంటాయని, ఇలా బిడ్డ అవసరాలకు అనుగుణంగా మారిపోయే తల్లిపాలను మంచిన ఆహారం మరొకటి ఉండదని వైద్యులు చెబుతున్నారు.



తల్లిపాల వలన ప్రయోజనాలు

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారం అందిస్తాయి
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమేగా 3,6,9 బిడ్డ మెదడు వికాసానికి తోడ్పాటు అందిస్తాయి
- బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలు మరింత శ్రేష్ఠం
- వ్యాధులు రాకుండా ముర్రుపాలు బిడ్డను జీవితంతం కాపాడతాయి
- తల్లిపాటు శిశువు పేగులను శుభ్రం చేసి, సుఖ మల విసర్జనకు తోడ్పడతాయి.
- బిడ్డ పుట్టగానే పాలు తప్ప, మూడు నాలుగు రోజులవరకు తేనె నాకించడం, పంచదార కలిపి ఇవ్వడం, గ్లూకోస్ వంటివి చేయకూడదు
- పుట్టిన బిడ్డకు తల్లి ఆరు నెలల వరకు రోజూ 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి
- తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినపుడు, టీకాలు వేసినపుడు కూడా తల్లి పాలు ఇవ్వవచ్చు
- తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలను అందజేస్తాయి



రిమ్స్‌లో మదర్ కంగారూ సెంటర్

కలెక్టర్ చొరవతో 'కంగారూ మదర్ కేర్' సెంటర్

తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, నెలలు నిండకుండానే జన్మించిన చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, తల్లి స్పర్శతో మరింత ఎదుగుదల, పుట్టినప్పటి నుంచే తల్లితో అనుబంధాన్ని పెంచే వినూత్నమైన విధానానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టి సారించారు. ఒంగోలు జీజీహెచ్, కనిగిరిలో 'కంగారూ మదర్ కేర్ సెంటర్ల ఏర్పాటు చేయించారు. కంగారూ జంతువు తన బిడ్డను కడుపులోని ఒక సంచిలా ఉండే దానిలోనే భద్రపరిచి, బిడ్డలను సంరక్షించుకునే విధానమే ఆ కంగారు మదర్ కేర్ సెంటర్. తల్లి కూడా తన చాతికి హత్తుకునేలా చిన్నారిని పడుకోబెడతారు. ఈ మధ్య కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన కంగారు మదర్ కేర్ ద్వారా తల్లి, బిడ్డ చర్మ స్పర్శను పుట్టినప్పటి నుంచే తెలియజేయడంతోపాటు, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, నెలల నిండకుండానే జన్మించిన చిన్నారులను ఇంక్యుబేటర్‌లో పెడుతుంటారు. ఈ నూతన విధానంతో పిల్లల శరీరం వెచ్చగా ఉండటంతో పాటు, వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కంగారూ కేర్ వల్ల తల్లి పాలు కూడా పెరుగుతాయని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతిరైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం అమలుపై గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కింద రూ.3174.4కోట్లు రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతులకు అందిస్తామన్నారు. తొలివిడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2వేలను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని సీఎం తెలిపారు. జిల్లా, గ్రామ స్థాయిలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఇందులో ప్రజాప్రతినిధులను, రైతులను భాగస్వామ్యులను చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దర్శి తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ దర్శి మ ండలం తూర్పువీరయపాలెంలో జరగనున్న అన్నదాత సుఖీభవ రాష్ట్ర స్థాయి కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మీ, మెప్మా పీడీ శ్రీహరి, కమిషనర్ వెంకటేశ్వరరావు, డీపీవో వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.

జిల్లాకు కొత్తగా 5,174 పింఛన్లు మంజూరు

2,84,966కు చేరిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

వీటి పంపిణీకి రూ.124.982 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

నేడు లబ్ధిదారులకు సొమ్ము అందజేత

ఒంగోలు నగరం, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాకు 5,174 కొత్త పింఛన్లను మంజూరు చేసింది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్యకు వీటిని మంజూరు చేశారు. 2019 నుంచి భర్త చనిపోయిన వారి భర్తలకు స్పౌజ్ కేటగిరీ కింద ప్రజా ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. దీంతో జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సంఖ్య మొత్తం 2,84,900కి చేరాయి. గత వైసీపీ ప్రభుత్వం కుటుంబంలోని పెద్ద పింఛన్ పొందుతూ భర్త చనిపోతే ఆ కుటుంబంలోని వారికి పింఛన్ మంజూరు చేయలేదు. ఏళ్ళ తరబడి ఆ కుటుంబంలో అర్హులైనా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ కుటుంబంలో ఆ యన భార్యకు తదుపరి నెల నుంచే పింఛన్‌ను మంజూరు చేస్తూ వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇలా పింఛన్లు పొందుతూ భర్తలు చనిపోతే ఇప్పటి వరకు పింఛన్‌లు మంజూరు కాని వారి వివరాలను ప్రభుత్వం సేకరించింది. విచారణ జరిపించి ఈ నెల నుంచి వారి పింఛన్ సొమ్ము రూ.4 వేల వంతును ముట్టజెప్పనుంది. 5,174 మంది భర్తలు చనిపోయిన వితంతువులకు పింఛన్ ఈ నెల 1వ తేదీన అందజేయనుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శుక్రవారం శింగరాయకొండ, జరుగుమల్లి మండలంలోని గ్రామంలో పింఛన్లను అందజేయనున్నారు. స్పౌజ్ కేటగిరీ కింద జిల్లాకు కొత్తగా మంజూరు చేసిన 5,174 మందికి శుక్రవారమే సచివాలయం సిబ్బంది పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో కొత్తగా మంజూరైన పింఛన్లు నియోజకవర్గాల వారీగా

ఒంగోలు	523
దర్శి	600
గిద్దలూరు	736
కనిగిరి	710
కొండేపి	799
మార్కాపురం	587
సంతనూతలపాడు	669
ఎర్రగొండపాలెం	550



జిల్లాలో 2,84,966కి చేరిన పింఛన్లు.. రూ.124.982 కోట్లు విడుదల

ఈ నెలలో కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన 5,174 స్పౌజ్ పింఛన్లను కలుపుకుని జిల్లాలో మొత్తం పింఛన్లు 2,84,966కి చేరాయి. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,48,948, వితంతు పింఛన్లు 73,728, దివ్యాంగుల పింఛన్లు 32,875, ఒంటరి మహిళ పింఛన్లు 7,735, చర్మకారులు 5,265, డప్పు కళాకారులు4,550, మత్స్యకారపింఛన్లు 2,467, చేనేత కార్మికులు 1745,కల్లుగీత కార్మికులు 241, హిజ్రాలు92, కళాకారుల పింఛన్లు 57 అభయహస్తం పింఛన్లు 4,710, దీర్ఘకాలవ్యాధులతో బాడపడుతున్న వారి పింఛన్లు 2,004, మిగిలిన పింఛన్లు కలుపుకుని మొత్తం జిల్లాలో 2,84,966కి చేరాయి. ఈ పింఛన్లను జిల్లాలోని 5,673 సచివాలయ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం నుంచే పంపిణీ చేయనున్నారు.

ఎక్సైజ్‌లో కోల్డ్ వార్



స్టేషన్ తనిఖీకి వెళ్లిన ఉన్నతాధికారి

అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులు స్వాధీనానికి యత్నం

కోపంతో ఊగిపోయిన స్టేషన్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అధికారి

ఫోన్ నేలకేసి కొట్టిన వైనం

సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటున్న ఉన్నతాధికారి

ఒంగోలు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేయడానికి గురువారం వెళ్లిన ఉన్నతాధికారికి వింత అనుభవం ఎదురైంది. రెండు రోజుల క్రితం వివిధ కేసులలో దొరికిన మద్యాన్ని ధ్వంసం చేయడంతోపాటు స్టేషన్‌ను తనిఖీ కోసం ఉన్నతాధికారి వెళ్లారు. రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించిన ఉన్నతాధికారి కాస్త ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో రికార్డులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. అందుకు స్టేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి రికార్డులు ఇచ్చేందుకు నిరాకరించారు. అంతేకాకుండా జనరల్ డైరీ అసంపూర్తిగా ఉండటాన్ని ఉన్నతాధికారి ప్రశ్నించారు. దీంతో స్టేషన్ బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి కోపంతో ఊగిపోయి తన సెల్‌ఫోన్ విసిరి నేలకేసి కొట్టారు. ఇలా రాత్రి పొద్దుపోయేవరకు స్టేషన్‌ను పరిశీలించిన ఉన్నతాధికారి స్టేషన్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసారు. దీంతో రెండు రోజులుగా స్టేషన్‌లో విధులలో ఉన్న సిబ్బంది నుంచి అక్కడ జరిగిన పరిణామాలపై రాత పూర్వక వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారి ఆదేశించారు. అక్కడ ఉన్న సెంట్రీ కానిస్టేబుల్‌తో పాటు సిబ్బంది రాత పూర్వకంగా జరిగిన విషయం ఇచ్చారు. ఈమేరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు నివేదిక పంపించేందుకు జిల్లా ఉన్నతాధికారి సిద్ధమయ్యారు.

వీఆర్‌కు పెద్దారవీడు ఎస్సై

మార్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడు ఎస్సై పి.అనిల్‌కుమార్‌ను వీఆర్‌కు పంపుతూ గురువారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలిచ్చారు. మండల పరిధిలో జరిగిన పలు కేసుల్లో అవకతవకలకు పాల్పడటం, అవినీతి, అక్రమాల్లో మునిగి తేలడంలాంటి వాటిపై మండల ప్రజలు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో విచారించిన నిఘా విభాగం ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది. ఈ మేరకే ఎస్సై అనిల్ కుమార్‌ను ఎస్పీ వీఆర్‌కు పంపారు.



ఎన్ఐఎస్ఏఆర్ ఐఎస్ఆర్‌డీ ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

జయహో ఇస్రో

తర్లుపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిసార్ ప్రయోగం విజయవంతం కావటంతో శాస్త్రవేత్తలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఐఎస్ఆర్ డీఎన్ఏఎస్ఏ ఆకారంలో కూర్చొని జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

చైర్మన్ వచ్చినా ధర మార్పు లేదు

నత్తనడకన పొగాకు విక్రయాలు

నోబిడ్ బేళ్లతో దిగాలు

పట్టించుకోని పాలకులపై మండిపడుతున్న కర్షకులు



కొనుగోళ్లను ఆపిన రైతులు

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం అధిగమించి రేయింబవళ్లు శ్రమించి వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన పొగాకు రైతుల పాలిట పగాకుగా మారింది. ఒక వైపు బోర్డ్ అధికారులు, వ్యాపారుల మాయాజాలంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు తల్లడిల్లుతున్నారు. ఈ ఏడాది పొగాకు నాట్లు వేసే సమయం వస్తున్నప్పటికీ పొగాకు ఇంకా ఇళ్లలో కనిపిస్తుంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. ధరలు చూస్తుంటే కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి వేలం కేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు బేళ్లను వ్యాపారులు నోబిడ్ చేస్తుంటే ఇంటికి తిరిగి తెచ్చుకోవడం పరిపాటిగా మారిందని ఆక్రోశిస్తున్నారు. పొగాకు అమ్మకాలు సజావుగా జరిపించాల్సిన అధికారులు వ్యాపారులకు వంతుపాడుతున్నారని రైతులు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ముఖ్యంగా లోగ్రేడ్ పొగాకు కొనుగోలును పూర్తిగా విస్మరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం స్వయంగా పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్‌కుమార్ సందర్శించి కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని, ధరలు పెంచాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ వ్యాపారులు ఏమాత్రం మారలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వేలం ప్రారంభం నుంచి మందకోడిగా అమ్మకాలు జరుగుతున్నప్పటికీ పాలకులు కనీసం కూడా స్పందించడం లేదని ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా 11మిలియన్‌ల పొగాకు అమ్మకాలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 7.5 మిలియన కిలోల పొగాకు మాత్రమే కొనుగోళ్లు జరిగాయన్నారు. కొనుగోళ్లు సాగకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలంలో కొంతసేపు రైతుల నిరసనలు

బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ ఆదేశించినా లోగ్రేడ్‌కు గురువారం ధరల్లో వ్యత్యాసం కనిపించలేదు. అసహనానికి గురైన అన్నదాతలు కొతంసేపు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, బయ్యర్లతో చైర్మన్ మాట్లాడిన తర్వాత వేలాన్ని కొనసాగించారు.

6, 7 వేలకు ఇస్తే కొనుగోలు చేస్తారు

క్వింటా ఆరు లేదా ఏడువేలకు ఇస్తే బయ్యర్లు కొనుగోలు చేస్తారని రైతులు చెబుతున్నారు. పొగాకు రైతుల విషయంలో బోర్డులో ఏమి జరుగుతుందో అర్థంకాకుండా ఉందని, వ్యాపారులదే ఇష్టారాజ్యమైపోయిందని రైతులు కోటేశ్వరరావు, సుబ్బారావు తెలిపారు. పదిసార్లు వేలానికి తీసుకొచ్చినా నోబిడ్ కొట్టడంతో తిరిగితీసుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన పొదిలి వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాజుపాలెం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లబొగులు, మొద్దుపచ్చ తేవడంతో నోబిడ్ వస్తుంది

గిరిరాజ్‌కుమార్, వేలం నిర్వహణాధికారి

నల్లబొగులు, మొద్దుపచ్చ పొగాకు తేవడంతో నోబిడ్ వస్తుంది. అవికాకుండా లోగ్రేడ్ తెచ్చినా రూ.150 నుంచి రూ.190 వరకు ధర పలుకుతోంది. లోగ్రేడ్ సరాసరి రూ.165 నమోదవుతోంది. గతంలో రూ.220, రూ.230 పలికిన ఎఫ్1, ఎఫ్2, ఎఫ్3 కూడా రూ.270, రూ. 280 పలుకుతోంది. మొత్తం 11వేలం కేంద్రాల్లో పొదిలిలో మాత్రమే వెయ్యి బేళ్ళకు తగ్గకుండా తెప్పిస్తున్నాం.

లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లలో ప్రభుత్వమే జోక్యం చేసుకోవాలి

వెయ్యికోట్లు కేటాయించి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘ నేతలు



ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు, రైతులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతు సంఘ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పొగాకు బోర్డు ఆర్ఎం కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు అధ్యక్షత వహించారు. ధర్నాలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు వెయ్యికోట్లను కేటాయించి, క్వింటా రూ.20వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితి మరింతదారుణంగా మారిందని చెప్పారను. సరైన దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలులేక, వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వతీరు వల్ల ఒక్కొక్క బ్యారెన్‌కు రూ.5నుంచి ఆరు లక్షల వరకు రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడతారని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో మిర్చి, నల్లబర్లీ పొగాకు రైతులు 12 మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్ల అధ్యక్షుడు జయంతిబాబు మాట్లాడుతూ గత ఏడాది 140 మిలియన్ కిలోలు కొనుగోలు చేసిన యంత్రాంగం ఈ ఏడాది మరో 40 మిలియన్ కిలోలకు అనుమతి ఇచ్చినందునే సాగు చేశారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ పొగాకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం పొగాకు బోర్డుఆర్ఎం రామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, తూబాటి శ్రీకాంత్, బెజవాడ శ్రీనివాసరావు, కిలారి పెద్దబ్బాయి, కరిచేటి హనుమంతరావు, కే వెంకటేశ్వర్లు, చిలుకూరి వెంకట్రావు, పొలవరపు జనార్దన్‌రావు, దాసరి ఆంజనేయులు, నార్నే చెంచయ్య, ఎం. కోటేశ్వరరావు, గాదె నాగేశ్వరరావు ఉన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ మూర్తి, ప్రొఫెసర్లు

ఒంగోలువిద్య, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని పీజీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు గురువారం సాయంత్రం తన కార్యాలయంలో విడుదల చేశారు. పరీక్షలకు 1037 మంది విద్యార్థులు నమోదు కాగా వారిలో 929మంది హాజరయ్యారు. 770 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 82.8శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు రిజిస్ట్రార్ హరిబాబు తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ తదితర విభాగాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించగా యూనివర్శిటీ, ఆయా కళాశాలల స్థాయిలో ఉత్తమ ఫలితాలు పొందిన వారిని వీసీ మూర్తి అభినందించారు. కార్యక్రమంలో సీఈ జి.సోమశేఖర్, ఏసీఈ భారతీదేవి, పీజీ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, ఏసీఈ సహాయకులు ఎస్.సురేష్, పరీక్షల విభాగం పర్యవేక్షకులు నూడా శివరాం తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరి సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

ఒంగోలు కల్చరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అధ్యాపకురాలిగా, సమాజ సేవకురాలిగా కొంపల్లి రాజేశ్వరి అందించిన సేవలు అజరామరమని మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ అన్నారు. విశ్రాంత ప్రధాన అధ్యాపకురాలు కొంపల్లి రాజేశ్వరి ప్రథమ వర్ధంతి గురువారం స్థానిక హౌసింగ్ బోర్డు శక్తిసదన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ అధ్యాపకురాలిగా, ప్రధాన అధ్యాపకురాలిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందించిన రాజేశ్వరి శక్తిసదన్ మహిళలకు దశాబ్దకాలం చేసిన సేవలు మరచిపోలేనివని పేర్కొన్నారు. అదేవిధంగా సమితి కార్యక్రమాలలో సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. కార్యక్రమంలో కొంపల్లి సికిందర్, మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, రచయిత్రి మారేపల్లి సూర్యకుమారి, బీరం అరుణ పాల్గొన్నారు.

జీఎల్‌పురంలో పౌరహక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

చీమకుర్తి, జూలై31 (ఆంధ్రజ్యోతి): జీఎల్‌పురం గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య సమావేశంలో పాల్గొని పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రసాద్ సేవలు అభినందనీయం



ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శింగరాజు ప్రసాద్ విధి నిర్వహణలో నిబద్ధతతో అందించిన సేవలు అభినందనీయమని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ.రమణారెడ్డి, పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 40 సంవత్సరాలు ఆర్టీసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి, సంస్థ అభివృద్ధికి కృషి చేశారని పలువురు కొనియాడారు. అనంతరం ప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ గౌరవ అధ్యక్షులు బచ్చల శివ, డిపో అధ్యక్షులు కృష్ణ రెడ్డి, సెక్రటరీ ఎన్‌వీ.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకు సత్కారం



మహబూబ్‌బాషాను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, జూలై31 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో 41 ఏళ్ళు పనిచేసి ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేసిన ఎస్ కే.మహబూబ్ బాషాను ఎస్పీ ఏఆర్.దామోదర్ సత్కరించారు. గురువారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుదని తెలిపారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సీతా రామిరెడ్డి, ఏఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి పాల్గొన్నారు.

బస్సులో సీటు కోసం

ఇరువురి మధ్య గొడవ

- టీచర్‌పై దాడి చేసిన యువకులు
- పరస్పరం కేసుల నమోదు

ఒంగోలు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సీటు విషయంలో ఇరువురు గొడవపడ్డారు. దీంతో ఆటోడ్రైవర్ తన బంధువులను పిలిపించుకుని టీచర్‌పై దాడి చేయించాడు. వివరాలలోకి వెళితే.. ఒంగోలు నగరం బిలాల్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కరిముల్లా అద్దంకిలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అదే బస్సులో మద్దిపాడులో టీచర్‌గా పనిచేసే రమేష్‌బాబు ఎక్కాడు. అయితే ముగ్గురు కుర్చునే సీటులో కరిముల్లాతో పాటు మరో వ్యక్తి మాత్రమే కుర్చున్నారు. దీంతో రమేష్‌బాబు వెళ్ళి అక్కడ కూర్చునే ప్రయత్నం చేయగా కరిముల్లా అడ్డుకున్నాడు. కొంచం సర్దుకోండి అంటూ రమేష్‌బాబు అక్కడే కూర్చున్నాడు. దీంతో వారి మధ్య మద్దిపాడు నుంచి గొడవ ప్రారంభమైంది. కరిముల్లా మోచేతితో టీచర్ రమేష్ బాబును నెడుతూ ఉండగా అదే సమయంలో ఆయన చేయి కాస్త విసరడంతో కరిముల్లా ముక్కుకు తగిలి రక్తం కారింది. దీంతో కరిముల్లా వెంటనే బిలాల్ నగర్‌లో ఉన్న బంధువులకు ఫోన్ చేశాడు. పోతురాజుకాలువ వద్దకు బస్సు వచ్చిన తరువాత కరిముల్లా బంధువులు సుమారు 20మంది బస్సు ఎక్కి రమేష్‌బాబుపై పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశారు. అనంతరం కరిముల్లాను 108 వాహనంలో రిమ్స్‌కు వెళ్ళి అక్కడ పోలీస్ అవుట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. . తనపై ఓ ప్రయాణికుడు దాడి చేశాడని పేర్కొన్నారు. అలాగే టీచర్ రమేష్‌బాబు ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై కొంతమంది యువకులు దాడి చేశారని తెలిపారు. ఈమేరకు రెండు కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ విజయకృష్ణ తెలిపారు.

కొప్పోలురోడ్డు గుంతలమయం

- వాహనదారుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



గుంతలతో కంకర లేచిపోయిన ఉన్న రోడ్డు, రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత(ఇన్‌సెట్లో)

ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకే ఈ రోడ్డులో రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. దీంతో తారురోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారిలోని పెట్రోలు బంకు, హైవే ఫ్లైఓవర్ వంతెన వద్ద, అలాగే పలు ప్రాంతాల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు వేగంగా వస్తూ ఈ గుంతలను గుర్తించలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పడికే పలువురు గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. అయితే పెట్రోలు బంకు దగ్గర గల గుంత వద్ద కొంత మంది ముందు జాగ్రత్త చర్యగా ప్రమాదం జరగకుండా హెచ్చరికగా జెండాను ఏర్పాటు చేశారు. ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. నగరానికి చేరుకోవటానికి, ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

సర్పంచ్‌కు 3, వార్డులకు 10 నామినేషన్లు

- ఎన్నికల అధికారి రవిబాబు



3వ వార్డుకు నామినేషన్ వేస్తున్న రవికుమార్

కొండపి, జూలై31 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి మూడు, వార్డులకు పది నామినేషన్లు అభ్యర్థులు గురువారం వేశారని కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి జె. రవిబాబు తెలిపారు. సాయంత్రం వివరాలను ఆర్వో తెలిపారు. సర్పంచ్ పదవికి మనమద్ది పూజ, యనమద్ది అరుణ, అల్లడి సుశీల నామినేషన్లను వేశారు. 1వ వార్డుకు ముక్కు ప్రసాదు, 2వ వార్డుకు కడియం నాగరాజు, 3వ వార్డుకు నేతి రవి కుమార్, 5వ వార్డుకు దేవరాల బ్రహ్మయ్య, 9వ వార్డుకు కూనంనేని వాసంతి, 11వ వార్డుకు కొమ్ము బాలమ్మ, 12వ వార్డుకు తస్నీరు సుబ్బులు, 14వ వార్డుకు చింతల సుజాతలు నామినేషన్లు వేశారు. 8వ వార్డుకు కళ్లగుంట రత్తమ్మ, దేపూరి రోజా ఇద్దరు నామినేషన్లు వేశారు. అందరూ టీడీపీ మద్దతుదారులే నామినేషన్లు వేశారు.

రాజీ దిశగా..

టీడీపీ, వైసీపీ నాయకులు రాజీ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అధికార టీడీపీ సర్పంచ్ పదవి, ఉపసర్పంచ్ పదవితోపాటు 9 వార్డులు తీసుకునే విధంగా వైసీపీకి 5 వార్డులు ఇచ్చే విధంగా సయోధ్య జరుగుతున్నట్లు తెలిసింది. ఇరుపార్టీల నాయకులు పోటీలకు పోయి ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకులు ఇపుడు గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు డబ్బులు పెట్టే పరిస్థితులు లేవని అధినాయకత్వానికి చెప్పినట్లు తెలిసింది.

సీఎం సభకు భారీగా తరలిరావాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మి



సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సభకు భారీగా కార్యకర్తలు, రైతులు, ప్రజలు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని మండలంలోని తూర్పువీరాయపాలెంలో 2వ తేదిన ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్కడ ఏర్పాటుచేస్తున్న సభావేదిక, హెలిప్యాడ్‌ను ఆమె పరిశీలించారు నిర్వాహకులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలుకు శ్రీకారం చుట్టడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తుండటంతో అన్నీవర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీఎం సభ ఏర్పాట్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంతో సాగుతున్నాయి. దర్శి-తూ ర్పుగంగవరం రోడ్డులో తూర్పువీరాయపాలెం వద్ద సీఎం చంద్రబాబు సభావేదిక ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర మంత్రి బాలవీరాంజనేయస్వామి రెండు స్థలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పలుశాఖల అధికారులు ఉదయం నుంచి రాత్రి వరకు రోజంతా సీఎం సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తున్నారు. ఎన్నికల తర్వాత ప్రప్రథమంగా సీఎం చంద్రబాబు దర్శికి వస్తుండటంతో సభను విజయవంతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- పీడీ జోసఫ్‌కుమార్



వివరాలను వెల్లడిస్తున్న సిబ్బంది, వేదికపై పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు(రూరల్), జూలై31(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఒంగోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఒంగోలు మండలంలో జరిగిన ఉపాధి పనులపై ప్రజావేదిక సభ జరిగింది. ఈ సందర్భంగా సామాజక తనిఖీ పరిశీలకులు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఒకరు పనికి మరొకరు హాజరయ్యారని, జాబ్‌కార్డు ఉన్న కూలీలు పని చేయటం లేదని చెప్పారు. పనులు జరిగిన చోట బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్నారు. చేసిన పనులకు, కొలతలో పూర్తిగా తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. అవకతవకలు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని పరిశీలనకు బృందం పేర్కొంది. ఆయా అంశాలపై పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ అక్రమాలపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, డిప్యూటీ డైరెక్టర్ బి.రామారావు, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మల, ఎస్ఆర్పీ నాగరాజు, ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి

- టీడీపీ మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్



కరపత్రాలను అందిస్తున్న మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే అన్ని వర్గాలను అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ఉప్పుగుండూరులోని ఎస్సీ, బీసీకాలనీలు, గాంధీరోడ్డులో గురువారం రాత్రి సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. విజనరీ గల నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, ఐటీడీపీ మండలాధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్ మాగులూరి సత్యనారాయణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తెలగతోటి జాన్సన్, కనగాల కృష్ణ, గోగినేని శేషగిరి, గద్దల రమేష్, కొండా శ్రీను, నక్కల శ్రీకాంత్, గుమ్మడి చిన్నా, కందుల రాజేష్, మున్నంగి పున్నారెడ్డి, మెట్టు సుబ్బయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరిహారం చెల్లింపు

సీఎస్‌పురం(పామూరు), జూలై 31(ఆంధ్రజ్యోతి): లోకాయుక్తా చొరవతో భూమిని కోల్పోయిన బాధిత రైతు శివయ్యకు రూ.20,11,645 నష్టపరిహారం చెల్లించారు. మండలంలోని ముసునూరు గ్రామంలో బెంగుళూరు- కడప- విజయవాడ కారిడార్ (ఎన్‌హెచ్554జి) కోసం సేకరించిన భూ సర్వేలో శివయ్యకు చెందిన 1.72 ఎకరాల భూమి పోయింది. అందుకుగాను నష్టపరిహారం చెల్లించలేదని 2023లో లోకాయుక్తాలో ఫిర్యాదు చేశారు. ఉప లోకాయుక్తా అధికారి పి.రజిని ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ప్రత్యేక జిల్లా కలెక్టర్ (భూసేకరణ) సమగ్ర నివేదికలు సమర్పించారు. సదరు భూమి ప్రైవేట్‌దిగా గుర్తించి నిషేధిత జాబితా నుంచి తొలగించామని పేర్కొన్నారు. ఈక్రమంలో బాధితుడు శివయ్యకు హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా నష్టపరిహారంగా చెల్లించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఒంగోలు క్రైం, జూలై31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేయడమే కాకుండా తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని సుదర్శ హిమబిందు గురువారం ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది ఆగస్టులో పేర్నమిట్టకు చెందిన బండి నవీన్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ తనతో పాటు తన స్నేహితుల వద్ద సుమారు రూ.10 లక్షలు నగదు తీసుకున్నాడని హిమబిందు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ, ఐటీఐలలో అటెండర్‌పోస్టులు ఉన్నాయని చెప్పాడని, దీంతో అతనికి డబ్బులు ఇచ్చి ఏడాది నుంచి తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పేర్నమిట్టలో ఉన్న అతని ఇంటికి వెళ్ళి డబ్బులు అడగగా నవీన్, అతని భార్య భాగ్యలక్ష్మి కలిసి తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని హిమబిందు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్విస్, క్యూరేస్ మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పందపత్రాన్ని చూపుతున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు విద్య, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, కొత్త ఆవిష్కరణలు చేసి దాని తాలుకు రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం ఎమర్జింగ్ టెక్నాలజీ అయినటువంటి క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల కోసం న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ క్వాంటం రీసెర్చ్ సెంటర్, క్వాంటం రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో బుధవారం స్థానిక క్విజ్ ఇంజనీరింగ్ కళాశాలతో ఒప్పందం చేసుకుందని ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, రవాణా, రక్షణ, సైబర్ భద్రత తదితర రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ళను ఈ క్వాంటం పరిశోధనల ద్వారా పరిష్కారాలు కనుగొనవచ్చని ఆయన చెప్పారు. ఆధునాతన క్వాంటం పరికరాల తయారీ, విద్యార్థులకు క్వాంటప్ టెక్నాలజీలో ఇంటర్న్‌షిప్‌లు, పీహెచ్‌డీ స్కాలర్ల పరిశోధనకు మార్గం సులభం కానుంది. ఈ ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ జాఫర్, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్ర,శనివారాల్లో తన నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం ఉదయం పదిన్నర గంటలకు దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించే అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవానికి హాజరవుతారు. సాయంత్రం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి

కొండపి, జూలై31 (ఆంధ్రజ్యోతి): కొండపికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ నాయకుడు యనమద్ది లక్ష్మయ్య గురువారం మధ్యాహ్నం తన స్వగృహంలో మరణించారు. లక్ష్మయ్య గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్యసాయం పొందుతున్నాడు. లక్ష్మయ్య వాస్తు సిద్ధాంతిగా కూడా ఈ ప్రాంతంలో పేరుగాంచాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా కొండపిలో జరిగే ఆటల, పాటల, పోటీలకు వ్యాఖ్యాతగా, న్యాయ నిర్ణేతగా పనిచేస్తుండేవాడు. స్థానికంగా మంచి పేరు, గుర్తింపు పొందారు. లక్ష్మయ్య మరణవార్త తెలుసుకుని సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్, అనుబంధ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పశువులకు టీకాలను వేయించాలి

కొండపి, జూలై31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా పశుపోషకులు, జీవాల కాపరులు తమ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు చేయించుకోవాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవుల్లో ముద్ద చర్మవ్యాధి, జబ్బ వ్యాధి, గొంతువాపు వ్యాధి, గేదెల్లో గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకల్లో నీలినాలుక వ్యాధి వచ్చే అవకాశం అధికంగా ఉందని, పశుపోషకులు టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 షెడ్యూల్

ఒంగోలు(రూరల్), జూలై31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2లో జరిగే 14వరౌండ్ వేలానికి బ్యారన్‌కు 3 బేళ్ల మాత్రమే తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి జె.తులసి గురువారం కోరారు. ఆగస్టు 2న పోతవరం, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, యరజర్ల, చెరువుకొమ్ముపాలెం, 4న ఒంగోలు, గుత్తికొండవారిపాలెం, అనుమ్రోలువారిపాలెం, కేశినేనివారిపాలెం, ప్రాసంగులపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, కొప్పోలు, సూరారెడ్డిపాలెం గ్రామాలకు చెందన రైతులు పొగాకు బేళ్లను వేలానికి తీసుకురావాలన్నారు. బేలు 150కిలోలకు మించకూడదని, నిబంధనలు పాటించాలని కోరారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి సత్కారం



రంగారావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మద్దిపాడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కేవీ. రంగారావును ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఎంఈవోలు ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లును రంగారావు దంపతులు సన్మానించి ఆశీర్వచనం తీసుకున్నారు. రంగారావు ఉపాధ్యాయుడిగానే కాకుండా నాటక రచయితగా 12 బంగారు నంది అవార్డులు పొందారని అభినందించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శ్రీచైతన్య విద్యార్థుల ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు భారీ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రాఫిక్ డీఎస్పీ పాండురంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శేషయ్య మాట్లాడుతూ చిన్నతనం నుంచే మొక్కలపై అభిమానం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, సమన్వయకర్త శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపాల్ నాగమణి, డీన్ సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతిగృహ ఆక్రమణలపై విచారణ



స్థలాన్ని పరిశీలిస్తున్న దయాకర్

చీమకుర్తి, జూలై31(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని నెహ్రూనగర్ బీసీ బాలుర వసతిగృహంలో చోటుచేసుకుంటున్న ఆక్రమణలపై గురువారం బీసీ సహయ సంక్షేమ అధికారి దయాకర్ విచారణ జరిపారు. వసతి గృహాన్ని మూసివేయటం గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల మల్లిఖార్జునరావు ఈ సందర్భంగా దయాకర్‌ని కలిసి ఆక్రమణల వివరాలను తెలిపారు. వెంటనే అక్కడ చోటుచేసుకున్న ఆక్రమణలను తొలగించారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతిగృహన్ని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

అవీ..ఇవీ


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి సుజయ్‌కుమార్

పట్టు రైతులకు శిక్షణ

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టుపురుగుల సాగులో రైతులు మెళకువలు పాటించాలని జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి పి. సుజయ్‌కుమార్ అన్నారు. గురువారం సచివాలయం-2లో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దొనకొండ, తాళ్ళూరు మండలాల నుంచి వచ్చిన రైతులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టుపురుగులు సాగుచేసుకునే రైతులు ముందుగా అనుకూలమైన ప్రదేశాలను ఎంచుకోవాలన్నారు. సాగుచేయాలనుకున్న రైతులు సంబంధిత కార్యాలయానికి వచ్చి అధికారులు సూచించిన ప్రదేశాన్ని ఎంచుకోవాలన్నారు. పట్టుపురుగుకు అనుకూలమైన ప్రదేశంలో సాగుచేస్తేనే పంట దిగుబడి బాగుంటుందన్నారు.రైతులు అధికారుల సలహాల మేరకు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డీ ఝాన్సీ రాణి, బీ వజ్రమ్మ, టీఏలు సుజిత్‌బెన్‌హర్, వెంకటేశ్వరరెడ్డి, రఘు, ఎఫ్ ఏలు ప్రసాదరావు, అంజిరెడ్డి, ఐదు మండలాల రైతులు పాల్గొన్నారు.


ఇన్‌స్పైర్ అవార్డు-మానక్ 2025-26 గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

● జిల్లా సైన్స్ అధికారి రమేష్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ అన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, వారిని ప్రోత్సహించటం ద్వారా దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయగలమని అన్నారు. మార్కాపురం డివిజన్ స్థాయి సైన్సు టీచర్స్ ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇన్‌స్పైర్ అవార్డు-మానక్ 2025-26 లక్ష్యాలను, నామినేషన్ ప్రక్రియను ఉపాధ్యాయులకు వివరించటం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. జాతీయ స్థాయి సైన్సు అవార్డు గ్రహీత, ఎన్విరాన్‌మెంటల్ కోఆర్డినేటర్ తంగిరాల నాగ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది సైన్సు పట్ల తనకున్న మక్కువ, చిన్న చిన్న ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి కె.శర్వాణి, రిసోర్స్ పర్సన్స్ రవికాంత్, రాము, డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాలికలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంఈవో, ఎస్సై

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి

రాచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బాలికలు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి.గిరిధర శర్మ అన్నారు. రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు తమసొంత నిధులతో కస్తూర్బా పాఠశాల బాలికలకు క్రీడా సామగ్రి సమకూర్చగా గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో రాణించాలని, విద్యతోపాటు ఓర్పు, నేర్పు, పట్టుదల, క్రమశిక్షణ ముఖ్యం అని అన్నారు. ఇష్టంతో కష్టపడి చదవాలని అప్పుడే ఏదైనా సాధించగలరని అన్నారు. ఎస్సై కోటేశ్వరరావు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడాలంటే విద్యార్థి దశనుంచే పోటీతత్వం కలిగి ఉండాలన్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి మాలకొండమ్మ, ఏఎస్సై వై. ఆదిశేషయ్య, పోలీసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయం వద్ద దరఖాస్తులు ఇచ్చేందుకు వేచి ఉన్న అర్జీదారులు

2,827 దరఖాస్తులకు ఆమోదం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలం వ్యాప్తం గా గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రజలు రేషన్‌కార్డులు, మార్పులు, చేర్పుల కోసం 3,575 దరఖాస్తులు చేసుకున్నారు. వాటిలో 2,827 ఆమోదించగా 663 తిరస్కరించారు. 85 అర్జీలు ఇంకా తహసీల్దారు లాగిన్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులకు కొత్త రేషన్ కార్డులు, చిరునామా, లింగ మార్పు, ఆధార్, రేషన్ కార్డు అనుసంధానం, ఒకే కార్డులో రెండు కుటుంబాలు ఉంటే విభజించడం, కొత్తగా వివాహం అయిన వారికి, మృతి చెందిన వారిని తొలగించుట, వలస వెళ్లిన వారిని తొలగించే అవకాశం కల్పించారు. ఆయా సేవలన్నీ 21 రోజుల లోపు పూర్తి చేస్తారు. దరఖాస్తు చేసిన వారి వివరాలు వీఆర్వో లాగిన్‌లో నమోదు అవుతాయి. ఈకేవైసీ పూర్తి చేశాక తహసీల్దారు లాగిన్‌లోకి చేరుతాయి. ఇక్కడ ఆమోదం చేయగానే ప్రక్రియ పూర్తి అవుతుంది.

నిరంతర ప్రక్రియ

- తహసీల్దారు మంజునాథరెడ్డి

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ముగింపు తేదీ అంటూ ప్రభుత్వం ప్రకటించ లేదని, దరఖాస్తుల ప్రక్రియ నిరతరం ఉంటుందని ఎర్రగొండపాలెం తహసీల్దారు డి. మంజునాథరెడ్డి తెలిపారు. రిజెక్టు అయిన వారు కూడా వారి సమస్యను తెలుసుకొని మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

● ఖరీఫ్‌లో కురవని పదును వాన

● ఆందోళనలో రైతులు

పెద్ద దోర్నాల, జూలై 31(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్‌లో పదును వాన కురవక రైతులు ఆవేదన చెందుతున్నారు.ఈ ఏడాది మేలోనే ఓ మోస్తరు వర్షం కురిసి అన్నదాతల్లో ఆశలు రేకెత్తించింది. దీంతో సాగుకు వ్యవసాయ భూముల్ని సిద్ధం చేశారు. తీరా అదును కోసం ఎదురు చూసే సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు.జూన్, జూలై మాసాల్లో భారీగా కురవాలిసిన వానలు కురవక వారం పది రోజులు ముసురు పట్టి చిరుజల్లులకే పరిమితమయ్యాయి.దీంతో భూములన్నీ బీళ్లుగానే మిగిలిపోయాయి. పైగా సాగుకు సిద్ధం చేసిన భూముల్లో చిరుజల్లులకు కలుపు మొలుస్తూ తరచూ ఉత్తి సేద్యాలు చేయాల్సి వస్తోంది. దాంతో అదనపు భారం పడుతోంది. దాంతో రైతులు సరైన వాన కోసం ఎదురు చూస్తున్నారు.


దోర్నాల ప్రాంతంలో వర్షం లేక బెట్టకొచ్చిన పత్తి పైరు

బెట్టకొచ్చిన పత్తి, జొన్న

మండలంలో సుమారు 700 ఎకరాల్లో పత్తి విత్తారు. నానా అవస్థలు పడి సాగు చేసిన పత్తి పైరు పంట దశకు వచ్చింది. వర్షాభావంతో బోరు బావులు వట్టి పోయాయి. కీలకమైన దశలో నీటి తడులు లేక పత్తి బెట్టకొచ్చింది. దీంతో పూత పిందె రాలి పోతోంది.ఇప్పటికే ఎకరాకు 35నుంచి 40 వేల వరకు ఖర్చు చేశామని, తమ కష్టం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొందరు సాగు చేసిన జొన్న కూడా ఎండి పోతోంది.

నెర్రెలు బారిన చెరువులు

మండలంలోని పెద్ద బొమ్మలాపురం గండి చెరువు, చిన్నగుడిపాడు చెరువు, బలిజేపల్లి, కడపరాజుపల్లె, కటకానిపల్లె, చిన్నమంతనాల, ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె, తిమ్మాపురం, చిలకచెర్ల,చింతల అగ్రహారం వంటి పెద్ద పది చెరువులు, కుంటలు, కాలువలు నీటి వనరులుగా ఉన్నాయి. వీటి క్రింద పది వేల ఎకరాలు ఆయకట్టుగా వ్యవసాయ భూములున్నాయి. గతేడాది ఈ పాటికే చెరువులన్నీ నిండాయి. కానీ ఈ ఏడాది ఏ ఒక్క చెరువు, కుంటకు చుక్క నీరు చేరలేదు. దీంతో ఆయకట్టు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

- ఉద్దండం కోటేశ్వరరావు, తిమ్మాపురం గ్రామ రైతు



వానలు లేక పత్తి ఎండిపోతోంది. రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పటికే రూ.60వేలు ఖర్చు చేశా. పంట చేతి కొస్తుందో లేదో తెలియదు. పంటలు పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలి.

నష్ట పరిహారం అందించాలి

- పత్తి వెంకటేశ్వర్లు, తిమ్మాపురం గ్రామ రైతు



3ఎకరాల్లో పత్తివిత్తాను. రూ.75వేలు పెట్టుబడిగా పెట్టాను.పూత, కాయ దశలో ఉంది నీళ్లు రావడం లేదు. పంట రాదు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి.

బాలికల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

● టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, జూలై 31: బాలికల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని వైడీపాడులోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ వలసలు ఎక్కువగా ఉన్న పెద్దారవీడు మండలంలో తల్లిదండ్రులు పనులకు వెళుతున్నప్పుడు విద్యార్థినులు చదువు మానుకొనే పరిస్థితి గతంలో ఉండేదన్నారు. ఆ సమస్యను నివారించడానికి మండలంలో రెండో కస్తూరిబా పాఠశాలను మంజూరు చేయించామన్నారు. ఈ పాఠశాలలో 7 నుంచి 10 వతరగతి వరకూ విద్యార్థినులకు వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్లర్స్ చైల్డ్ డవలప్‌మెంట్ ఆఫీసర్ కె.హేమలత, డిప్యూటీ డీఈవో కె.శ్రీనివాసులు, ఎంఈవోలు పి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు షేక్ అహమ్మద్, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

రాష్ట్రంలో సుపరిపాలన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిగా సుపరిపాలన చేస్తున్నదని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలో వై.డి.పాడులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

వివాదరహితుడు శైలేంద్రకుమార్

రెవెన్యూశాఖలో తహసీల్దార్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న పులి శైలేంద్రకుమార్ వివాదరహితుడని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం తహసీల్దార్ శైలేంద్రకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా డీటీ రామకృష్ణ అధ్యక్షతన వీడ్కోలు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ సౌమ్యునిగా పేరుతెచ్చుకున్న శైలేంద్రకుమార్ అందరికీ మార్గదర్శకులయ్యారన్నారు. అనంతరం శైలేంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాథ్, కొత్తపట్నం తహసీల్దార్ శాంతి, దోర్నాల డిప్యూటీ తహసీల్దార్ శాలమ్మ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే

● బురదమయంగా రోడ్లు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

● పట్టించుకోని అధికారులు

కంభం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కంభం మండలంలో పలు ప్రాంతాలలో రోడ్లు నరక ప్రాయంగా మారాయి. చినుకుపడితే చాలు చిత్తడిగా మారి పాదాచారులు, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆయా రోడ్లలో నడవలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాలలో ఉన్న సిమెంటు రోడ్లు, తారురోడ్లు కూడా గుంతలమయమై వర్షం నీటితో నిండాయి.


బురదమయంగా మారిన కంభంలోని ప్రధానవీధి


అధ్వానంగా గుంతలతో ఉన్న రహదారి

ముఖ్యంగా కందులాపురం పంచాయతీ పరిధిలోని నెహ్రూ నగర్ 1, 2 వీధులు, పుల్లయ్య సార్ స్కూల్ వెళ్లే రహదారి, కంభం అర్బన్‌కాలనీకి వెళ్ళే ప్రధాన రోడ్డు, హెచ్‌గూడెం పరిధిలోని కృపామృత పాఠశాలకు వెళ్ళే రోడ్డు మట్టిరోడ్లు కావడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి బురదమయం అవుతున్నాయి. అలాగే కంభం స్టేట్ బ్యాంక్ సమీపంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచి బ్యాంక్‌కి వెళ్ళి వచ్చే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికితోడు కొన్ని రోడ్లకు సైడుకాలువలు లేకపోవడం, మరికొన్నింటికి మురుగు కాలువలు ఉన్నా వాటిలో చెత్తాచెదారం పేరుకుపోయి శుభ్రం చేయకపోవడంతో వర్షం కురిసిన ప్రతి సారి మురుగు నీరు రోడ్లపై పారుతున్నది. వర్షంపడినపుడు ఈరోడ్లపై పాదాచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నీరు నిలిచిపోవడంతో దోమల బెడదతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

చిన్నారుల పట్ల బాధ్యతగా వ్యవహరించండి

రాచర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల పట్ల కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో వి. గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని గౌతవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, పంపిణీ సక్రమంగా చేయాలని తెలిపారు. రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. చిన్నారులను ప్రేమతో అక్కున చేర్చుకుని ఆలనపాలన చూసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం రుచి చూచి సంతృప్తి వ్యక్తం చేశారు.. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

దళితులు తమ హక్కులను ఐక్యమత్యంతోనే సాధించుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హర్షగౌడ్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అనుములవీడు దళిత కాలనీలో గురువారం దళిత ప్రజలకు అవగాహన కల్పించారు. దళితవాడల్లో నివశించే వారికి ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా వాటిని తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నెలలో చివరి తేదీన దళితవాడల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బి. కిషోర్ కుమార్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పశురంగ అభివృద్ధిపై సర్వే

పశురంగ అభివృద్ధిపై మండలంలో బ్లాంకెట్ (పశురంగంలో రైతులకు అవసరమైన అంచనా) సర్వే నిర్వహిస్తున్నామని రాచర్ల పశువైద్యాధికారి దేవిరెడ్డి హరిబాబు గురువారం తెలిపారు. పాడి పశువుల ద్వారా వచ్చే నెలసరి ఆదాయం, వాటి రుణ వివరాలు (కేసీసీ)కిసాన్ క్రెడిట్ కార్డుల గురించి, (పీఎండీఎస్) ప్రీ మాన్సూన్ డ్రై సర్వే అనగా వర్షాకాలం ముందు పొలంలో పొడి విత్తనాలు వేయడం గురించి సర్వే చేస్తారన్నారు. రైతులు ఈ సర్వేకు సహకరించాలని కోరారు.

88 స్పౌజ్ పింఛన్ల మంజూరు

మండలానికి 88 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంజూరైన వారికి 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారన్నారు. రాచర్ల -1 9, అనంపల్లి 8, రాచర్ల-2 9, చిన్నగానిపల్లి -6, ఆకవీడు -1 10, చోళవీడు 11, ఆకవీడు-2 4, గుడిమెట్ట 9, జేపిచెరువు 2, అనుములవీడు 10, సత్యవోలు 3, సోమిదేవిపల్లి 4, యడవల్లి 3 మంజూరైనట్లు ఆయన తెలిపారు.


పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విద్యార్థులు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అనుములవీడు ప్రాథమిక వైద్యాధికారి కె. రమేష్ అన్నారు. మండలంలోని అనుములవీడు బీసీ బాలుర వసతి గృహంలో గురువారం ఆయన వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి జలుబు, దగ్గు లాంటి వ్యాధులు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒంట్లో ఎలాంటి నలత ఉన్నా వెంటనే వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో రంగనాయకులు హెచ్‌వో ప్రసాద్, ఏఎన్ఎం షమీం, వార్డెన్ మురళి, ఆశ విజయకుమారి పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కేంద్ర బృందం పర్యటన

త్రిపురాంతకం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. రాజుపాలెం, కంకణాలపల్లె గ్రామాల్లో పర్యటించిన సభ్యులు కె.భాస్కర్, కె.వెంకటేష్ పారిశుధ్య పరిస్థితులు, తడి, పొడి చెత్త నిర్వహణ పరిశీలించారు. గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు ఎంపీడీవో రాజ్‌కుమార్, మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఖాజావలి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

మార్కాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని వెంటనే నిలుపుదల చేయాలన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలపై అదనపు భారం మోపేందుకే ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టాలని చెప్పిన టీడీపీ ప్రభుత్వం నేడు వాటిని ఏర్పాటు చేసేందుకు నడుం బిగించడం మోసపూరితమన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.రూబెన్, ఎస్‌కే మహబూబ్ బాష, చెన్నకేశవులు, చిన్నగురవయ్య, జె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలి

గిద్దలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసుకున్న పంటను తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిం చారు. అతివృష్టి, అనావృష్టి సందర్భాలలో పంట నష్టపోతే ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు సిద్దయ్య, కిరణ్ పాల్గొన్నారు.

3 న సీపీఐ కౌన్సిల్ సమావేశం

ఎర్రగొండపాలెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 3న నియోజకవర్గ సీపీఐ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యవర్గసభ్యులు డి. శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి. రామయ్య, సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి మఠం పునర్నిర్మాణానికి సహకరించాలి

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జగన్మాత ఈశ్వరీదేవి మఠం పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈశ్వరీదేవి పీఠాధిపతి వీరశివకుమార్ అన్నారు. గురువారం స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సామంతపూడి నాగేశ్వరరావు తదితర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

గిద్దలూరు టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఆటో నడిపిన ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానాను విధించారు. ఆటోడ్రైవర్ మద్యం తాగి ఆటో నడుపుతుండగా పోలీసుల డ్రంకన్ డ్రైవ్ పరీక్షలో మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈకేసుకు సంబంధించి ఆటోడ్రైవర్‌కు 7 రోజుల జైలు శిక్షతోపాటు 10వేల రూపాయల జరిమానాను విధిస్తూ జడ్జి భరత్‌చంద్ర తీర్పు చెప్పారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు

తర్లుపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్(హైదరాబాద్) సంస్థ ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 576 మార్కులు సాధించిన మాదాల నాగసురేశ్, మోహన్‌లకు రూ.10వేలు నగదు బహుమతులను ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్ అందజేశారు. ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులు శివప్రసన్న, మనోజ్, చైతన్య, నిహారిక, పూజిత, ప్రణీత, దివ్య, మహేశ్వరిలకు నగదు బహుమతులను అందించారు.



అనిల్‌కు కేక్‌ను తినిపిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మనోవైకల్యం కలిగిన పిల్లలపై ఆదరణ చూపాలి

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మనోవైకల్యం కలిగిన పిల్లలపట్ల ప్రతి ఒక్కరు ఆదరాభిమానాలు చూపాలని టీఎన్‌ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్(పండు) అన్నారు. తన జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక భవిత కేంద్రంలో మనోవైకల్యం కలిగిన పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం మనసుకే గాని శరీరానికి కాదని, అటువంటి విధి వంచితుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈసందర్భంగా అనిల్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున నిర్వహించారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి వేడుకల్లో పాల్గొని జన్మదిన కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కంభం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అర్థవీడు మండలం ఎస్ఎస్ఆర్ఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గోగులదిన్నె వెంగల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో అర్థవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని, అర్థవీడు మండల ఎంఈవో సుజాత, కంభం మండల ఎంఈవో ఎస్.ఎ.సత్తార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది వెంగల్‌రెడ్డిని సన్మానించారు.

సరస్వతీమాతకు పూజలు

గిద్దలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీమాతకు అభిషేకం చేశారు. అర్చకులు భార్గవస్వామి ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యోగా గురూజీ బి.ఎ.నారాయణరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

710 స్పౌజ్ పింఛన్లు మంజూరు

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలో 710 మందికి భాగస్వామి (స్పౌజ్) పింఛన్లు మంజూరయ్యాయి. ఇంటిపెద్దను కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతులకు కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. కొంతకాలంగా ఊరిస్తున్న భాగస్వామి పింఛన్‌ను శుక్రవారం పంపిణీ చేయనున్నారు. కనిగిరి మండలంలో 151, పామూరులో 114, సీఎస్‌పురంలో 87, పీసీపల్లిలో 102, వెలిగండ్లలో 99, హెచ్‌ఎంపాడు మండలంలో 78 మందిని భాగస్వామి పింఛన్లకు అర్హులుగా అధికారులు గుర్తించారు. సామాజిక పింఛన్ తీసుకొనే భర్త మృతి చెందితే భార్యకు ఆ మరుసటి నెల నుంచే పింఛన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో సయ్యద్ గౌస్‌బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలని, ట్రూఅప్ ఇంధనపు సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలో పాల్గొని జయప్రదంచేయాలని కోరారు. సమావేశంలో షేక్ ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు కుర్చీల బహూకరణ

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అవసరాలకు టీడీపీ నేత పందిటి హరీష్ గురువారం 25 కుర్చీలను బహూకరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కటకం సజన దాతను అభినందించారు. కార్యక్రమంలో పెసల నరసింహారావు, సోమిశెట్టి శ్రీనివాసులు, ఎస్.లక్ష్మీనారాయణ, పానుగంటి చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో ఆదాయం పొందాలి

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపు సంఘాల్లోని మహిళలకు అదనపు ఆదాయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో 13 రకాలతో ఉన్న హైగ్రో కంపెనీకి చెందిన కూరగాయల విత్తనాల ప్యాకెట్లను మంజూరు చేసిందని ఏపీఎం గంటా విద్యాసాగర్ గురువారం తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలు ఇంటి పెరట్లో, తోటల్లో ఖాళీ స్థలాల్లో కూరగాయలు సాగు చేసి అదనపు ఆదాయం పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కూరగాయల విత్తనాలు ఎటువంటి రసాయనిక ఎరువుతో తయారుచేసినవి కాదన్నారు. మార్కెట్‌లో రూ.130కు లభించే ప్యాకెట్‌ను పొదుపు మహిళలకు రూ.65లకే అందజేస్తున్నట్టు చెప్పారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కులాలకు, మతాలకు అతీతంగా సేవలు అందించడమే మానవతా సంస్థ లక్ష్యమని సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టారు. సభ్యత్వాలు స్వీకరించిన వారిలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, వాయినేని మాల్యాద్రి, రాచూరి గణపతిరావు, ఎం.వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పామూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక అనాథ పిల్లల ఆశ్రమంలో గురువారం టీడీపీ నాయకులు విద్యార్థులు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, సుజాత దంపతుల కుమార్తె డాక్టర్ బాలసరస్వతి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, చిల్డ్రన్‌హోం నిర్వాహకులు నూనెవేణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

తాళ్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో ఎరువులు ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు హెచ్చరించారు. గురువారం మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతాంగానికి నష్టం కలిగేలా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషిచేయాలి

ముండ్లమూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్వయం సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఏపీఎం పి.హనుమంతరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఆగిపోయిన గ్రూపులను పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకాయమ్మ, సీసీలు కోటేశ్వరరావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిరావాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సభకు భారీగా కార్యకర్తలు, రైతులు, ప్రజలు తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని మండలంలోని తూర్పువీరాయపాలెంలో 2వ తేదిన ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్కడ ఏర్పాటుచేస్తున్న సభా వేదిక, హెలిప్యాడ్‌ను ఆమె పరిశీలించారు నిర్వాహకులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలుకు శ్రీకారం చుట్టడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తుండటంతో అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీఎం సభ ఏర్పాట్లలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అనీ శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

శరవేగంగా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు కార్యక్రమ ఏర్పాట్లు శరవేగంతో సాగుతున్నాయి. దర్శి- తూర్పుగంగవరం రోడ్డులో తూర్పువీరాయపాలెం వద్ద సీఎం చంద్రబాబు సభావేదిక ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర మంత్రి బాలవీరాంజనేయస్వామి రెండు స్థలాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పలుశాఖల అధికారులు ఉదయం నుంచి రాత్రి వరకు రోజంతా సీఎం సభా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తున్నారు. ఎన్నికల తర్వాత ప్రప్రథమంగా సీఎం చంద్రబాబు దర్శికి వస్తుండటంతో సభను విజయవంతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.



హెలిప్యాడ్ తయారుచేస్తున్న దృశ్యం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

దర్శి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతమయ్యేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బందోబస్తు ఏర్పాట్లు, సభాస్థలంలో బారికేడ్లు, వీఐపీ పార్కింగ్‌కు ప్రణాళికాబద్ధంగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం పర్యటనలో రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొంటున్నందున అవసరమైన అన్నీ ఏర్పాట్లుచేయాలన్నారు. సీఎం చంద్రబాబు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్నందున సంబంధిత అధికారులు తగజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ జెడీ రవికుమార్, వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పాల్గొన్న జేసీ గోపాలకృష్ణ

అధ్వానంగా రహదారి

» ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
» వాహనచోదకుల అవస్థలు
» పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లు నుంచి లక్ష్మీనగర్ గ్రామానికి వెళ్ళే పంచాయతీ రాజ్ రహదారి అధ్వానస్థితికి చేరింది. అడుగడుగునా గోతులమయమైంది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టి పోసిన పాపానపోలేదు. దీంతో మూడు కిలోమీటర్లు ఉన్న రహదారి ఛిద్రమైంది. పెద్దపెద్ద గోతులుపడి వాహనచోదకులు ఆ రహదారిపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. పాదచారులకూ ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం లక్ష్మీనగర్ గ్రామస్థులు, దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామస్థులు పెదఉల్లగల్లు రావాలంటే మరోమార్గం లేక ఈరహదారిపైనే ప్రయాణం సాగించాలి. ఉల్లగల్లు గ్రామస్థులకు ఎక్కువగా లక్ష్మీనగర్ వైపు పొలాలు ఉండటంతో ఈమార్గంలోనే వెళ్లక తప్పడంలేదు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం రహదారిపై పడిన గోతులనైనా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ లక్ష్మీనగర్ నుంచి పెద ఉల్లగల్లు వెళ్ళే రహదారి అధ్వానస్థితికి చేరిందన్నారు. ఇటీవల ఆ రహదారిని పరిశీలించినట్టు చెప్పారు. తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు నిధులు అవసరమని ఉన్నతాధికారులకు తెలిపి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



గోతులమయమైన పెదఉల్లగల్లు - లక్ష్మీనగర్ రహదారి

శిథిలమైన చప్టా

» పట్టించుకోని అధికారులు
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తాళ్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు సమీపంలో కొత్తపాలెం చెరువు వద్ద చప్టా శిథిలమైంది. చప్టాపై భాగంలో వేసిన డస్ట్ పూర్తిగా లేచి గుంతలు పడ్డాయి. దీంతో ద్విచక్రవాహనదారులు చప్టాపై గుంతల్లో వెళ్లే సమయంలో జారిపడుతూ గాయాల పాలవుతున్నారు. గుంతలు పెద్దవిగా ఉండటంతో బస్సులు, లారీలు, ఇతరత్రా పెద్దలోడ్‌తో వెళుతున్న భారీ వాహనాలు ఊయల ఊగినట్లుగా ఊగుతున్నాయి. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతాయోమోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ చప్టానిర్మాణానికి నిధులు మంజూరయినా మరమ్మతులు జరిపించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చప్టాకు తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తాళ్లూరు-తూర్పుగంగవరం మార్గంలో శిథిలమైన చప్టా

మందకృష్ణకు ఘనసన్మానం



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న జైభీం నాయకులు

కనిగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగను గురువారం కనిగిరిలో జైభీం నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అమరులైన కుటుంబాలను పరామర్శించేందుకు కనిగిరి మీదుగా కందుకూరు వెళ్తున్నారు. ఈక్రమంలో స్థానిక చర్చి సెంటరులో జైభీం నాయకులు సూరె రాజన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్సీ వర్గీకరణ సాధించేక్రమంలో మందకృష్ణ మాదిగ ఎదుర్కొన్న నేపథ్యాలను జైభీం నాయకులు సూరె రాజన్న ప్రజలకు వివరించారు.

కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, గిద్దలూరు ఇన్‌చార్జ్ చల్లగాలి విజయ్‌కుమార్, పానుగంటి మనోజ్‌కుమార్, రావినూతల కోటయ్య, పల్లెపోగు యోహాను, తాతపూడి శ్యాం, గోనా ప్రతాప్‌కుమార్, కత్తి తిరుపాలు, కుంచెం జక్రయ్య, దాసరి బాబ్జి, ముప్పవరపు ప్రేమ్‌కుమార్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

» జిల్లా సైన్స్ అధికారి రమేష్

మార్కాపురం వన్‌టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ అన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, వారిని ప్రోత్సహించటం ద్వారా దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయగలమని అన్నారు. మార్కాపురం డివిజన్ స్థాయి సైన్సు టీచర్స్ ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇన్‌స్పైర్ అవార్డు-మానక్ 2025-26 లక్ష్యాలను, నామినేషన్ ప్రక్రియను ఉపాధ్యాయులకు వివరించటం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. జాతీయ స్థాయి సైన్సు అవార్డు గ్రహీత, ఎన్విరాన్‌మెంటల్ కోఆర్డినేటర్ తంగిరాల నాగ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది సైన్సు పట్ల తన కున్న మక్కువ, చిన్న చిన్న ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి కె.శర్వాణి, రిసోర్స్ పర్సన్స్ రవికాంత్, రాము, డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇన్‌స్పైర్ అవార్డు-మానక్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సరస్వతీమాతకు పూజలు

గిద్దలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతీమాతకు అభిషేకం చేశారు. అర్చకులు భార్గవస్వామి ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, యోగా గురూజీ బి.ఎస్.నారాయణరెడ్డి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంఈవోలు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పామూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పచ్చని పుడమిని భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవోలు పి.కోటిరెడ్డి, కె.కరుణకుమారి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సయ్యద్ ఇసాక్, ఎం.రామాస్వామి, పేట తిరుపతిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరిహారం చెల్లింపు

సీఎస్‌పురం(పామూరు), జూలై 31(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త చొరవతో భూమిని కోల్పోయిన బాధిత రైతు శివయ్యకు రూ.20,11,645 నష్టపరిహారం చెల్లించడంలో ఏపీ లోకాయుక్త సంస్థ కీలక పాత్ర పోషించింది. మండలంలోని మునునూరు గ్రామంలో బెంగుళూరు- కడప- విజయవాడ కారిడార్ (ఎన్‌హెచ్554జి) కోసం సేకరించిన భూ సర్వేలో శివయ్య కు చెందిన 1.72 సెంట్ల భూమి భూసేకరణలో పోయింది. అందుకుగాను నష్టపరిహారం చెల్లించలేదని 2023లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఉప లోకాయుక్త పి.రజిని ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ప్రత్యేక జిల్లా కలెక్టరు(భూసేకరణ) సమగ్ర నివేదికలు సమర్పించారు. సదరు భూమి ప్రవేట్‌దిగా గుర్తించి నిషేధిత జాబితా నుంచి తొలగించామని పేర్కొన్నారు. ఈక్రమంలో బాధితుడు శివయ్య హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా రూ.20,11,645 నష్టపరిహారంగా చెల్లించారు.

కార్డుదారులకు మెరుగైన సేవలు అందించాలి



తహసీల్దార్ రమణారావును సన్మానిస్తున్న డీలర్లు

తాళ్లూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు కార్డుదారులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిచాలని తహసీల్దార్ బచ్చల వెంకట రమణారావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలను నిర్ణీత సమయంలో తెరచి సరుకులు అందజేయాలన్నారు. దుకాణంలో స్టాకు వివరాలను ఏరోజుకారోజు నమోదు చేయాలన్నారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బీవీ రమణారావును మండల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు, మండల డీలర్ల సంఘం నాయకులు పిన్నిక రమేష్, కూటాల ప్రసాద్, వంగపల్లి నాగేశ్వరరావు, నాదెండ్ల శ్రీను, పేరిరెడ్డి, సత్యం, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

ముండ్లమూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు, నాయకుల పై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే సహించమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ముండ్లమూరులో జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూడా రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాల పాలయ్యారన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, మన్నం శ్రీధర్‌బాబు, కుమ్మెత అంజిరెడ్డి, సూదిదేవర అంజయ్య, తాతపూడి రత్నరాజు, సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

కంటి ఆపరేషన్‌లకు తరలిన వృద్ధులు


కనిగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వృద్ధులు గురువారం కంటి ఆపరేషన్‌లకు తరలివెళ్ళారు. ఈనెల 19న నిర్వహించిన వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని మూడో విడత గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి అమరావతి గ్రౌండ్స్ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అని వసతులు కల్పించారు.

పట్టు రైతులకు శిక్షణ

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పట్టుపురుగుల సాగులో రైతులు మెళకువలు పాటించాలని జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి పి. సుజయ్‌కుమార్ అన్నారు. గురువారం సచివాలయం-2లో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దొనకొండ, తాళ్ళూరు మండలాల నుంచి వచ్చిన రైతులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టుపురుగులు సాగు చేసుకునే రైతులు ముందుగా అనుకూలమైన ప్రదేశాలను ఎంచుకోవాలన్నారు. సాగుచేయాలనుకున్న రైతులు సంబంధిత కార్యాలయానికి వచ్చి అధికారులు సూచించిన ప్రదేశాన్ని ఎంచుకోవాలన్నారు. పట్టుపురుగుకు అనుకూలమైన ప్రదేశంలో సాగుచేస్తేనే పంట దిగుబడి బాగుంటుందన్నారు.రైతులు అధికారుల సలహాల మేరకు సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఝాన్సీరాణి, వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం సభ్యుల పర్యటన

త్రిపురాంతకం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. రాజుపాలెం, కంకణాలపల్లె గ్రామాల్లో పర్యటించిన సభ్యులు కె.భాస్కర్, కె.వెంకటేష్ పారిశుధ్య పరిస్థితులు, తడి, పొడి చెత్త నిర్వహణ పరిశీలించారు. గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు ఎంపీడీవో రాజ్‌కుమార్, మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, ఖాజావలి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఈశ్వరీదేవి మఠం పునర్నిర్మాణానికి సహకరించాలి

పొదిలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జగన్మాత ఈశ్వరీదేవి మఠం పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈశ్వరీదేవి పీఠాధిపతి వీరశివకుమార్ అన్నారు. గురువారం స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అన్నదాత అర్హులు..

1,58,300 మంది

రేపు సుఖీభవ పథకం నిధుల విడుదల

త్రిశంకు స్వర్గంలో 4,300 మంది రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రభుత్వం వారికి తీపి కబురు చెప్పింది. అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతుల ఖాతాల్లో శనివారం జమ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 1,58,300 మంది రైతులు పథకానికి అర్హులుగా వ్యవసాయశాఖ తేల్చింది. పీఎంకిసాన్ కింద రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5,000 కలిపి మొత్తం రూ.7,000 సాయాన్ని తొలి విడతలో భాగంగా రైతులకు అందించనుంది. రెండు వారాల కిందటే లబ్ధిదారుల జాబితాను రైతు సేవా కేంద్రాలలో ప్రభుత్వం ప్రదర్శించింది. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వ్యవసాయశాఖ రైతులను కోరింది. ఆర్‌ఎస్‌కేల్లో ప్రాథమికంగా ఉంచిన జాబితా ప్రకారం లబ్ధిదారుల సంఖ్య 1,52,500 ఉండగా, తుది జాబితాకు వచ్చేసరికి ఆ సంఖ్య 1,58,300కు చేరింది. ఈకేవైసీ పెండింగ్‌తో పాటు వేలిముద్రలు పడకపోవడం, భూ యజమాని మరణించిన మ్యుటేషన్ జరగకపోవడం వంటి కారణాలతో పథకానికి అర్హత ఉన్నప్పటికీ 4,300 మంది లబ్ధికి దూరంగా ఉన్నట్లు సమాచారం. వేళ్లపై రేఖలు చెరిగిపోవడం వంటి సాంకేతికకారణాలకు విరుగుడుగా ఫేస్, ఐరిస్ రికగ్నైజేషన్‌కు ప్రభుత్వం వీలుకల్పించినా రైతులకు అవగాహన కల్పించడంలో అధికారుల ఉదాసీనతతో పలువురు లబ్ధికి దూరమయ్యారు.

కౌలురైతుల ఎదురుచూపులు

అన్నదాత సుఖీభవ పథకం విషయంలో కౌలు రైతులు ఎదురుచూపులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజా ఆదేశాలలో కూడా ప్రభుత్వం వారికి లబ్ధిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో తమ సంగతి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో దాదాపు రెండు లక్షల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. సీసీఆర్‌సీ కార్డు ప్రామాణికంగా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత నిర్ణయిస్తారని కౌలు రైతులు గంపెడాశలతో ఉన్నారు.

వితంతువులకు ప్రభుత్వం అండ

నేడు 4,233 మందికి స్పౌజ్ పింఛన్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇంటి పెద్దను కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిన వితంతువులకు అండగా ప్రభుత్వం నిలవనుంది. 2024 నుంచి ఇప్పటి వరకు కూడా వచ్చిన స్పౌజ్ దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన 4,300 మంది వితంతువులకు నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందించనుంది. వీరందరికి శుక్రవారం ఉదయమే సిబ్బంది వెళ్లి పింఛన్ అందించేలా డీఆర్‌డీఏ విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కొత్తగా స్పౌజ్ పింఛన్ల మంజూరు విషయంలో నిబంధనల్లో సైతం ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిం చింది. యాప్‌లో వివరాలు నమోదుతో పాటు నిర్దిష్ట కాలపరిమితి లోపులోనే పింఛన్లకు ఆమో దం తెలపాల్సి ఉంది. కానీ ఈ నిబంధనలను సైతం పక్కనపెట్టి యాప్‌లో నమోదు ప్రామాణికంగా తీసుకోకుండా సిబ్బంది చేత దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి వాటి ద్వారానే అర్హులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందిన దరఖాస్తుల్లో దాదాపు 75 శాతం అర్హత సాధించినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా పర్చూరు నియోజకవర్గంలో 836 మంది స్పౌజ్ పింఛన్ అందుకోనున్నారు. అద్దంకి 835, రేపల్లె 756, వేమూరు 720, బాపట్ల 547, చీరాల నియోజకవర్గంలో 539 మంది వితంతువులు పింఛన్ ఫలాలు అందుకోనున్నారు

అమృత్.. మళ్లీ వాయిదా

అమృత్ అమల్లో తీవ్ర జాప్యం

ఏడాదిగా టెండర్ ప్రక్రియలోనే పనులు

అమృత్ 2.0 పనుల అంచనాల్లో మార్పులు

రూ.1092.60 కోట్ల నుంచి రూ.1,136 కోట్లకు పెరుగుదల

మున్సిపల్ పట్టణాల్లో అమృత్ అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందని ద్రాక్ష చందాన మారాయి. గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన అమృత్ 2.0ను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిం చేందుకు ప్రయత్నిస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. అభివృద్ధి పనులు టెండర్ల దశ దాటనంటు న్నాయి. వాయిదాలకే టెండర్లు పరిమితమవుతున్నాయి. ఏడాదిగా పనులు టెండర్ ప్రక్రియలోనే ఉన్నాయి. గుంటూరు నగర పాలక సంస్థ సహా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అమృత్ 2.0 పథకం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. పీపీపీ తరహాలో పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా టెండర్ నిర్వహణ మళ్లీ వాయిదా పడింది. జూలై 24 నుంచి ఆగస్టు 7కు వాయిదా పడిన టెండర్లు మళ్లీ వాయిదా పడ్డాయి.



అమృత్ పథకంలో రూ.5.60 కోట్లతో అభివృద్ధి చేయనున్న నరసరావుపేట కత్తవ చెరువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర పాలక సంస్థ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో పీపీపీ తరహా విధానంలో అమృత్ 2.0 ప్రగతి పనుల టెండర్‌ను ఇటీవల ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ పిలిచింది. నీటి పథకాల విస్తరణ, చెరువుల ఆధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులకు రూ.1092.40 కోట్ల అంచనా వేసి ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ టెండర్లు ఆహ్వానించింది. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జూలై 24న ముగియాల్సిన టెండర్‌ను ఆగస్టు 7 వరకు పొడిగించారు. సిమెంటు, స్టీలు, కార్మికుల కూలి మెటీరియల్ ప్రామాణిక రేట్లు(ఎస్‌ఓఆర్)ను (మిగతా 6లో)



రైతులతో సమావేశం నిర్వహించిన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు(ఫైల్‌ఫొటో)

సోలార్ హబ్‌కు.. వడివడిగా అడుగులు

18 వందల ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

భూసేకరణకు యజమానులతో సమావేశాలు

బల్లికురవ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ పరిధిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో సోలార్ హబ్ ఏర్పాటుకు ఒడిఒడిగా అడుగులు పడుతున్నాయి. సోలార్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదంతో భూసేకరణపై మండల, జిల్లా స్థాయిలో అధికారులు దృష్టి సారించారు. బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, సంతమాగులూరు మండలం కుందుర్తి, మామిళ్లపల్లి గ్రామాల పరిధిలో సోలార్ హబ్ పరిశ్రమ ఏర్పాటకు భూములు అనువుగా ఉన్నాయని అధికారులు నివేదికలు పంపారు. 18 వందల ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు. రెండు మండలాల పరిధిలో ప్రభుత్వ భూమి 216 ఎకరాలు ఉంది. కాగా మరో 1584 ఎకరాలను సేకరించేందుకు అధికారులు రైతులతో పలు మార్లు సమావేశాలు కూడా నిర్వహించారు. ఆగస్టు 10న కలెక్టర్ రైతులతో సమావేశం కానున్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగి పరిశ్రమ ఏర్పాటైతే ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందనున్నాయి.

గ్రానైట్ ఆదాయం.. మరో రూ.30 లక్షలు

1 లారీల సీజ్.. రవాణాదారుల నుంచి వసూలు

1 అధికారులపై దౌర్జన్యం చేసిన వ్యక్తి అరెస్టు.. ఐదుగురి కోసం గాలింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ అక్రమ రవాణాపై వాణిజ్య పనుల శాఖ చర్యలు చేపట్టింది. వివిధ ప్రాంతాల్లో ఇటీవల అధికారుల తనిఖీల్లో పట్టుబడిన గ్రానైట్ లారీలను సీజ్ చేసి వారి నుంచి పెద్దమొత్తంలో జరిమానా వసూలు చేస్తున్నారు. తాజాగా 14 లారీల నుంచి సుమారు రూ.30 లక్షలు జరిమానా వసూలు చేసినట్లు గురువారం అధికారులు తెలిపారు. బిల్లులు లేకుండా గ్రానైట్‌ను తరలి స్తున్న లారీలను ఈ నెల 19న తంగెడ చెక్‌పోస్టు వద్ద అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. లారీలను ఆపితే తొక్కిస్తామని బెదిరించిన ఆరుగురిపై అధికారులు ఫిర్యాదు చేయగా దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతా ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రూ.84 లక్షల ఆదాయం

గ్రానైట్ అక్రమ రవాణాపై వాణిజ్య పన్నుల శాఖ దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వానికి నెల రోజుల వ్యవధిలోనే 38 లారీల నుంచి రూ.84 లక్షల ఆదాయం లభించింది. జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాను అరికడితే ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం లభించడం ఖాయం.

కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిని కలిసిన ఎంపీ తెన్నేటి

బాపట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : లోకసభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్‌జైరాంగడ్కరీతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి బాపట్ల పార్లమెంట్ ప్రధాన కేంద్రం బాపట్ల పట్టణం వరకు ఉన్న రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని, ఎన్‌హెచ్ 2016 నాలుగు లైన్‌లు, గుంటూరు- నిజాంపట్నం పోర్ట్ గ్రీన్‌ఫిల్డ్ హైవే పనులు వేగవంతం అయ్యేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలన్ని పరిశీలిస్తానని హామీనివ్వటం జరిగిందని ఎంపీ తెలిపారు.

12వ పీఆర్సీని ప్రకటించాలి : ఫ్యాప్టో

బాపట్ల జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 12వ పీఆర్సీని ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బాపట్లలో జరిగిన ఫ్యాప్టో సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించిన ఛైర్మన్ ఎ.శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తీవ్ర ఆలసత్వాన్ని, నిర్లక్ష్య ధోరణిని అవలంబించటం సరికాదన్నారు. ఆగస్టు 2న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

వరద సహాయక చర్యలకు సిద్ధం కావాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వరదలు వస్తే సహాయక చర్యలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. విపత్తు నిర్వహణ, నిర్మూలన, ముందస్తు ప్రణాళిక అంశాలపై ఆర్డీవోలతో గురువారం కలెక్టరేట్‌లో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల నిర్వహణపై సూక్ష్మస్థాయిలో సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. వరద వస్తే మునిగే ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాలు, జనాభా వివరాలను సేకరించి ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో గుర్తించాలన్నారు. దెబ్బతినే గృహాలు, ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలతో జలాశ యాల నుంచి దిగువకు భారీగా నీరు విడుదల అవుతున్నందున లంకగ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. 14 నివాస ప్రాంతాలు మునిగే అవకాశం ఉందన్నారు. కరకట్టలు బలహీనంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ఇసుకబస్తాలతో బలోపేతం చేయాలన్నారు. మరబోట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల గుర్తింపు, మూడునెలలకు సరిపడ నిత్యావసరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి,సీపీవో షాలెంరాజు పాల్గొన్నారు.

తనిఖీలు తాయిలాలు



1 బీఈడీ కళాశాలల అఫిలియేషన్‌లో అక్రమాలు

1 అధ్యాపకులు, విద్యార్థులు లేకుండానే అనుమతి

1 అడిగినవన్నీ సమకూరిస్తేనే తనిఖీలని వేధింపులు

1 ఏఎన్‌యూ అధికారుల తీరుపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదులు

గుంటూరు(విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి): భవనాలు లేవు..విద్యార్థులు ఉండరు.. బోధన చేసే అధ్యాపకులు ఉండరు.. అయినా ఆచార్య నాగార్జున వర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. కళాశాలల అనుమతులు, గుర్తింపునకు సంబంధించి ఏటా జరిగే తనిఖీలు కేవలం తూతూమంత్రంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ నుంచి తనిఖీలకు వచ్చే అధికారులు, ఆచార్యులను సంతృప్తి పరిస్తే నిబంధనలు అమలు చేయకున్నా ఆ రెండేళ్లకు అనుమతులు వచ్చేస్తాయి. ఇలా వచ్చే అనుమతులతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పలు బీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. బీఈడీ కళాశాలకు సంబంధించి 2025-27 విద్యా సంవత్సరానికి జూలై 30 లోపు గుర్తింపు కోసం(అఫిలియేషన్) తనిఖీలు జరపాలి. అయితే తనిఖీలు అస్తవ్యస్తంగా జరిగాయని (మిగతా 6లో)



కృష్ణమ్మ పరవళ్లు

2,43,829 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి గురువారం 2,82,609 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,96,742 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,273, కుడి కాల్వ ద్వారా 8604, ఎడమ కాల్వ ద్వారా 7110, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కుల చొప్పున ఔట్‌ఫ్లోగా 2,43,829 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంలో ప్రస్తుతం 585.10 అడుగుల్లో నీరు ఉంది.

1 సత్రశాలలోని టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 14 క్రస్ట్ గేట్ల ద్వారా 2 లక్షల 32 వేల క్యూసెక్కుల నీ టిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.28(6.280 టీఎంసీలు) మీటర్లు అంటే 244 అడుగల నీరు ఉంది. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు.

1 పులిచింతలకు ఎగువ నుంచి 2,24,403 క్యూసెక్కులు వస్తుండగా 2,04,904 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



కొల్లూరు : అరవింద వారధి వద్ద వరద ప్రవాహం

1 నదిలో గట్లను ఆనుకుని ప్రవాహం

1 జలాశయాలకు కొనసాగుతున్న వరద

1 సాగర్‌లో 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

1 ప్రకాశం బ్యారేజి నుంచి 2.51 లక్షల క్యూసెక్కులు..

1 పెసర్లంక గండి నుంచి కరకట్ట వైపు వరద ప్రవాహం

కొల్లూరు, తాడేపల్లిటౌన్, దుగ్గిరాల, విజయపురిసౌత్, రెంటచింతల, అచ్చంపేట, దాచేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉరకలెత్తుతూ వస్తోన్న కృష్ణమ్మతో జలాశయాలు నిండిపోతున్నాయి. దీంతో వచ్చిన వరదను వచ్చినట్లుగానే దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణమ్మ పరవళ్ల తొక్కుతోంది. నాగార్జునసాగర్ దిగువ నుంచి రేపల్లెలోని తీర ప్రాంతం వరకు నదిలో నీరు గట్లను తాకుతూ ప్రవహిస్తోంది. నదితీర గ్రామాలైన పొందుగల, రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, తంగెడ రేవుల వద్ద ఉన్న పుష్కర ఘాట్లు నీటితో నిండిపోయాయి. ప్రమాదకర సంఘటనలకు తావు లేకుండా ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళ గస్తీని ఏర్పాటు చేశారు. ప్రవాహం పెరిగినా ఒడ్డున జీవనం సాగించే వారికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా హెచ్చరికలు చేస్తున్నారు. పల్లెకార్లు నదిలో (మిగతా 6లో)

ఏబీసీ కెనాల్‌కు అందని సాగర్ నీరు

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులతో ఆటంకం

నీటి విడుదల వాయిదా.. ఆయకట్టు రైతుల్లో ఆందోళన

అద్దంకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నుంచి సాగునీటి విడుదలతో కుడి కాల్వ పరిధిలో సాగు సందడి మొదలైంది. అయితే అద్దంకి బ్రాంచ్ కెనాల్(ఏబీసీ) ఆయకట్టు రైతులు మాత్రం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఏబీసీపై 33వ మైలు వద్ద అద్దంకి- బల్లికురవ- సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కారణంగా ఏబీసీకి సాగునీటి పారుదలకు ఆటంకంగా మారింది. శిథిలమైన బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ2 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పది రోజుల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయినా ఏబీసీకి నీటి విడుదల సాధ్యం కావడంలేదు. సాగర్ నుంచి బుగ్గవాగు ద్వారా ఒంగోలు వెళ్లే మెయిన్ కెనాల్‌లో నీరు ప్రవహిస్తోంది. అయితే ఎగువన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు మాత్రం నీటి విడుదల జరగలేదు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభ దశలో ఉండటంతో నీటి విడుదలను తాత్కాలికంగా వాయిదా వేశారు. దీంతో ఏబీసీ ఆయకట్టులోని పల్నాడు, బాపట్ల జిల్లాల రైతులు సాగు నీటి కోసం కనీసం మరో పక్షం రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే అప్పటికి పనులు పూర్తి అవుతాయని అధికారులు చెప్తున్నా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు నమ్ముకుని మెట్ట పంటలను, బోరు బావుల కింద వరి నారుమళ్ల పలువురు సాగు చేశారు. వర్షాలు సరిపడా పడకపోవడం.. ఇప్పట్లో సాగర్ నీరు అందదని తెలిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో కూడా నీరు సరిపడా లేదని, అధికారులు స్పందించి వేగవంతంగా పనులు పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం అయ్యే పరిస్థితుల్లో 31వ మైలు వరకు నీటి విడుదల చేసి అదనంగా వచ్చే నీటిని భవనాసి ఎస్కేప్ ఛానల్‌కు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఎస్‌పీ ఈఈ సతీష్‌ను వివరణ కోరగా ఏబీసీ పరిధిలో ప్రస్తుతం నీటి అవసరం అంతగా లేదని, 15 రోజుల్లో పనులు పూర్తి చేసి నీరు విడుదల చేస్తామన్నారు.



అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో జరుగుతున్న పనులు

లాకౌట్ ప్రకటించిన సింథైట్ యాజమాన్యం

మేదరమెట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): కోరు అధికంగా వస్తుందని మేదరమెట్లలోని సింథైట్ కంపెనీ ఎదురు గ్రామస్థులు బుధవారం నిరసన చేపట్టి ఫ్యాక్టరీని ముూయించారు. దీంతో గ్రామస్తుల ఆందోళన మేరకు గురువారం సింథైట్ యాజమాన్యం లాక్‌అవుట్ ప్రకటిస్తున్నట్లు నోటీసులను గేట్‌కు అంటించారు. కోరు రాకుండా ఉండడానికి కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, గ్రామస్థులు కోరుతో ఇబ్బంది పడుతున్నట్లు ఆందోళన చెందడంతో లాక్‌అవుట్ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. తదుపరి నిర్ణయాలు తీసుకునేవరకు లాక్ అవుట్ కొనసాగుతుందన్నారు. కోరు రాకుండా చర్యలు తీసుకుని ఫ్యాక్టరీ నడుపుకోవడానికి తమ కేమి అభ్యంతరం లేదని గతంలోనే గ్రామస్థులు అధికారులు తెలిపారు.

హాస్టల్ నిర్మాణానికి రూ.5.30 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో నిధులు మంజూరు

తీరనున్న గిరిజన విద్యార్థుల ఇక్కట్లు

పర్చూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వసతుల లేమితో చాలీచాలని భవనంలో ఇక్కట్లు పడుతున్న పర్చూరు గిరిజన బాలుర ఇక్కట్లు తొలగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మాణానికి రూ.5.30 కోట్లు నిధులు మంజూరు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన భవనంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ప్రభుత్వం విద్యార్థులకు అధునిక క్లాస్ రూమ్స్, హాస్టల్ బిల్డింగ్, మరుగుదొడ్లు తదితర వసతులతో కూడిన సొంత భవనం నిర్మాణం చేసుకునే విధంగా నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా నూతన తరగతి గదుల నిర్మాణం రూ.1.60 కోట్లు, నూతన హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.3.19 కోట్లు, ఫర్నీచర్ కొనుగోలుకు రూ.16 లక్షలు, అధునీకరణ పనులకు రూ.35 లక్షల చొప్పున విడుదల చేసింది. త్వరలో భవన నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. ఎన్నో ఏళ్ళుగా వసతుల లేమితో ఇరుకు అద్దె భవనంలో నానా అవస్థలు పడుతున్న గిరిజన బాలువకు ఇక్కట్లు తీరనుండడంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఒంగోలు క్రైం, జూలై31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేయడమే కాకుండా తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని సుదర్శ హిమబిందు గురువారం ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యా దు చేశారు. గత ఏడాది ఆగస్టులో పేర్నమిట్టకు చెందిన బండి నవీన్ ఉద్యో గాలు ఇప్పిస్తానంటూ తనతో పాటు తన స్నేహితుల వద్ద సుమారు రూ.10 లక్షలు నగదు తీసుకున్నాడని హిమబిందు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ, ఐటీఐలలో అటెండర్‌పోస్టులు ఉన్నాయని చెప్పాడని, దీంతో అతనికి డబ్బులు ఇచ్చి ఏడాది నుంచి తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పేర్నమిట్టలో ఉన్న అతని ఇంటికి వెళ్ళి డబ్బులు అడగగా నవీన్, అతని భార్య భాగ్యలక్ష్మి కలిసి తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని హిమబిందు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు మార్కెట్ తిరోగమనం

- నాలుగున్నర నెలలు గడిచినా సగం కూడా పూర్తి కాని కొనుగోళ్లు
- నిత్యం మూడొంతుల బేళ్లు తిరస్కరణ
- వ్యాపారుల ఇష్టానుసారం వేలం
- మేలు రకం బేళ్ల కోసం పోటీపడుతున్నా ధరలపై సీలింగ్
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఒంగోలు ఆర్‌ఎం ఆఫీస్ వద్ద ధర్నా

దక్షిణాది పొగాకు మార్కెట్ పూర్తి తిరోగమనంలో సాగుతోంది. వేలం ప్రక్రియ ప్రారంభమై నాలుగున్నర నెలలు గడిచినా ఇంతవరకు పండిన పంటలో సగం మించి కొనుగోలు జరగలేదు. నిత్యం అమ్మకాల కోసం వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లు భారీగా తిరస్కరణలు జరుగుతున్నాయి. మార్కెట్లో వ్యాపారుల ఇష్టారాజ్యం సాగుతోంది. మేలు రకం బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీపడుతున్నా గరిష్ఠ ధర మాత్రం కిలో రూ.280 లేదా రూ.281కు మించడం లేదు. అదే సమయంలో లోగ్రేడ్ బేళ్లను అధికారులు సూచించే ధరకు కొనేందుకు ఏ ఒక్క కంపెనీ ముందుకు రావడం లేదు. అలా వ్యాపారులు కూటమి కట్టి గరిష్ఠ ధరలపై సీలింగ్ పెట్టి లోగ్రేడ్ బేళ్లను కొనుగోలు చేయకుండా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

ఒంగోలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు ఈ ఏడాది తిప్పలు తప్పడం లేదు. ఈ సీజన్‌లో దక్షిణాదిలో రైతులు పొగాకు పంటను భారీగా సాగు చేశారు. పొగాకు బోర్డు 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా రైతులు విస్తారంగా సాగు చేయడంతో ఏకంగా 162 మిలియన్ల పంట ఉత్పత్తి అయినట్లు అంచనా. ఒంగోలు కేంద్రంగా దక్షిణాదిలో ఎస్‌ఎల్‌ఎస్, ఎస్‌బీఎస్ రిజయన్లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుత ప్రకాశం జిల్లాలో ఏడు, నెల్లూరు జిల్లాలో 4 వేలం కేంద్రాలు ఉన్నాయి. మార్చి 10న తొలిదశ, కొద్ది రోజులకు రెండవ దశ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280తో కొనుగోళ్లు మొదలయ్యాయి. అనంతరం ధరలు పెరుగుతాయని రైతులు భావించారు. నాణ్యత చెడకుండా ఉంటే మంచి ధరలు లభిస్తాయని మేలు రకం బేళ్లను అధికశాతం మంది రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు.

మార్కెట్ ఒడిదొడుకులు

తొలుత నెల రోజులు కాస్తంత జోరుగానే మార్కెట్ సాగినా అనంతరం ఒడిదుడుకులు ప్రారంభం కాగా ఇంత వరకు అది కుదుట పడలేదు. నెలన్నర క్రితం మార్కెట్ తీరుపై రైతుల్లో అలజడి నెలకొంది. విదేశీ ఆర్డర్లు త్వరలో వస్తాయని అనంతరం ధరలు పెరుగుతాయని మేలు రకం బేళ్లను వేలం కేంద్రాలకు తీసుకరావాలని వ్యాపారులు సూచించారు. వారి వాదనకు బోర్డు అధికారులు కూడా వంతపాడటంతోపాటు రైతులకు నచ్చజె ప్పే ప్రయత్నం చేసి మార్కెట్‌లో సంక్షోభాన్ని తాత్కాలికంగా ఆపగలిగారు. అదే సమయంలో జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా వేలం కేంద్రాలు సందర్శించి హడావుడి చేయడంతో కొద్ది రోజులు సజావుగా మార్కెట్ సాగినా తిరిగి నెల రోజులుగా దారుణంగా ఉంది.

● ఉత్తరాదిన పెంపు.. దక్షిణాదిన దారుణం

ఉత్తరాదిలోని గోదావరి జిల్లాల్లో ఉన్న వేలం కేంద్రాల్లో కిలో గరిష్ఠ ధర ఏకంగా రూ.390కి వెళ్లి ప్రస్తుతం రూ.370కి అటు ఇటుగా సాగుతోంది. దక్షిణాదిలో మాత్రం గరిష్ఠ ధర కిలో రూ.280గానే ఉంది. మేలు రకం బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు వేలం కేంద్రాల్లో పోటీపడుతున్నారే తప్ప ధర మాత్రం పెంచడం లేదు. గత ఏడాది ఇక్కడ కూడా గరిష్ఠ ధర కిలో రూ.360 వరకు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న మేలు రకం బేళ్లను అమ్మకాలకు తెస్తే ధర లభించక నష్టపోతామని భావిస్తున్న రైతులు ఇళ్ల వద్ద ఉన్న లోగ్రేడ్ బేళ్లను అధికంగా తెస్తున్నారు.

లోగ్రేడ్ బేళ్ల తిరస్కరణ

వ్యాపారులు మాత్రం లోగ్రేడ్‌ను కొనుగోలు చేయడం లేదు. లోగ్రేడ్‌లో మంచిదిగా భావించే బ్రౌన్ ఇతర రకాలను గతం కన్నా కిలోకు రూ.20 నుంచి రూ.50 వరకు తగ్గించి కొంటున్న బయ్యర్లు, పూర్తి లోగ్రేడ్‌గా భావించే మొద్దుపచ్చ, మాడు రకాల జోలికి వెళ్లడం లేదు. ఆ గ్రేడ్‌ల ధరలను బోర్డు అధికారులు తగ్గించి బిడ్ పెడుతున్నా బయ్యర్లు కొనేందుకు ముందుకు రావడం లేదు. చివరకు కిలో రూ.150కి కూడా కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆ బేళ్లను అధికారులే నోబిడ్ చేస్తున్నారు. నిత్యం ఆయా వేలం కేంద్రాల్లో ఇలాంటి నోబిడ్ బేళ్లు భారీగా ఉంటున్నాయి. ఈ వారంలో పరిస్థితి పరిశీలిస్తే సగటున దక్షిణాది వేలం కేంద్రాలలో 30 శాతానికిపైగా నోబిడ్‌లు ఉంటున్నాయి. కొన్ని వేలం కేంద్రాల్లో ఏకంగా 40శాతం కన్నాపైనే ఉంటుండగా ఈనెల 29న టంగుటూరు కేంద్రంలో ఏకంగా 50.36 శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. ఈనెల 28న దక్షిణాదిలో 35శాతానికి పైగా నోబిడ్‌లు ఉండగా 29న 32శాతం, 30వ తేదీన 26శాతంగా ఉన్నాయి. అంతకుముందు వారంలోనూ 31శాతానికి పైగానే నోబిడ్‌లు ఉన్నాయి. ఇంత తీవ్రంగా పరిస్థితి ఉండి వ్యాపారులను నియంత్రించడంలో బోర్డు అధికారులు విఫలం అవుతున్నారు.

ఆందోళన బాటలో రైతులు

మార్కెట్ తీరుపై తీవ్ర ఆవేదనతో పొదిలి వేలం



కేంద్రంలో గురువారం రైతులు నిరసనకు దిగారు. ఒంగోలులోని ఆర్‌ఎం కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నెలన్నర క్రితం హడావుడి చేసి వేలం కేంద్రాలకు వెళ్లి సమీక్షలు చేసిన అధికారపక్ష ప్రజా ప్రతినిధులు మార్కెట్ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రస్తుత తరుణంలో పట్టీనట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం దృష్టికి తమ ఆవేదనను తీసుకెళ్లి బర్లీ రైతులకు అందించిన విధంగా తమకు కూడా ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని ఎస్‌సీవీ పొగాకు రైతులు కోరుతున్నారు.

జిల్లాలోకి ప్రవేశించిన సాగర్‌జలాలు

2,500 క్యూసెక్కుల నీరు రాక

కాలువపై పర్యటించిన సీఈ శ్యాంప్రసాద్

సీఎం పర్యటన నేపథ్యంలో ఆరా తీసిన మంత్రి

అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు

త్రిపురాంతకం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజల తాగు సాగునీటి అవసరాలు తీర్చేందుకు సాగర్ కుడికాలువ ద్వారా విడుదలైన నీరు బుధవారం అర్ధరాత్రి జిల్లా సరిహద్దు పుల్లలచెరువు మండలం మానేపల్లి సమీపంలోని 85/3 మైలు వద్దకు చేరాయి. ప్రారంభంలో దాదాపు 1,900 క్యూసెక్కులు వచ్చిన నీరు క్రమేపి పెరిగి 2,500 క్యూసెక్కులు తగ్గకుండా వస్తున్నాయి. గురువారం ఉదయం త్రిపురాంతకం చేరిన సాగర్‌నీరు సాయంత్రానికి దూపాడు వద్దకు చేరాయి. ఈ నెల 2వ తేదీన జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. దూపాడు వద్ద ప్రధాన కాలువపై ఎన్నెస్పీ అధికారులు చీఫ్ ఇంజనీర్ బి.శ్యాంప్రసాద్‌తో కలిసి డీఈ విజయలక్ష్మి, ఏఈ శివన్నారాయణ పర్యటించారు. సీఈ శ్యాంప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న 2,500 క్యూసెక్కుల నీరు తగ్గకుండా చివరివరకు అందేలా చూడాలని సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా సాగరునీటి సరఫరాపై ఆరా తీసినట్టు ఆయన చెప్పారు. ప్రజలకు సాగునీటితో పాటు ఎక్కడెక్కడ తాగునీటి అవసరాలు ఉన్నాయో అన్నింటికీ సరిపడా నీటిని వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. కాగా గురువారం రాత్రికి కురిచేడు వరకు నీరు వెళ్లవచ్చని, శుక్రవారం ఉదయం 11 గంటలకు దర్శికి సాగరునీరు చేరుతుందని అధికారులు తెలిపారు.



కాలువలో ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా సరిహద్దు వద్ద గుంటూరు నుంచి వచ్చే నీటిలో 2500 క్యూసెక్కులు తగ్గకుండా ఉండేలా చూసుకోవాలని సీఈ అధికారులకు సూచనలు చేశారు. వారితో పాటు జేఈ భరత్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని చలమయ్య ఉన్నారు.

టెండర్.. మళ్లీ వాయిదా

ఏటా ప్రభుత్వం జూలైలో పెంచుతుంది. అయితే అమృత్ టెండర్ సమయంలో పెంచిన ఎస్‌ఓఆర్ రేట్లు అందుబాటులోకి రాలేదు. పాత రేట్ల ప్రకారం టెండర్ పిలవగా కాంట్రాక్టర్లు కొత్త రేట్లు కోరుతుండటంతో 7న ముగియాల్సిన టెండర్‌ను వాయిదా వేశారు. సుమారు 4 నుంచి 5 శాతం వరకు ఎస్‌ఓఆర్ రేట్లను పెంచుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. పెరిగిన రేట్ల ప్రకారం 4 శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటే పనుల వ్యయం దాదాపు రూ.43.70 కోట్లు పెరగనున్నది. ఈ ప్రకారం రూ.1092.40 కోట్ల నుంచి రూ.1,136 కోట్లకు పెరగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇక కాంట్రాక్టర్లదే నిర్వహణ బాధ్యత

మూడు జిల్లాల్లో అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద పీపీపీ తరహాలో టెండర్ నిర్వహిస్తున్నారు. పనుల సమయంలో మొత్తం వ్యయంలో ప్రభుత్వం 50 శాతం సొమ్ము కాంట్రాక్టరుకు చెల్లిస్తుంది. పీపీపీ విధానంలో పదేళ్ల పాటు ఆయా పనుల నిర్వహణ బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దే. నిర్ణీత గడువులోపు పనులు దెబ్బతిన్నా కాంట్రాక్టరే నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల పనులు పూర్తి నాణ్యతతో జరుగుతాయని ఇంజనీర్లు చెబుతున్నారు. నిర్వహణ ఖర్చు కాంట్రాక్టరే భరించాల్సి ఉండటంతో పనుల్లో లోపాలు ఉండవంటున్నారు. ఇలా పూర్తి చేసిన పనికి పదేళ్లలో కాంట్రాక్టర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి మిగిలిన 50 శాతం నగదుకు వడ్డీతో కలిపి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా 40 వాయిదాల్లో కాంట్రాక్టర్ ఖర్చు చేసిన మొత్తాన్ని చెల్లిస్తుంది. అయితే ఈ నూతన విధానంలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపుతారా లేదా అన్న సందేహాలు నెలకున్నాయి.

తనిఖీలు.. తాయిలాలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. వర్సిటీలోని ఓ అధికారి అండతో యథేచ్ఛగా అక్రమాలు సాగుతున్నాయని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. తాను తనిఖీలకు రావాలంటే నాటుకోడి కూర, రాగి సంగటి ఉండాలనని ఓ అధికారి పట్టుపడుతున్నట్లు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఆయన తనిఖీలకు వస్తే అడిగినవన్నీ సమకూర్చాల్సి వస్తుందని తెలిపారు. మార్కాపురంలో ఓ కళాశాల నిర్వాహకులను వేధించిన ఓ ఆచార్యుడి విషయం ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ పేషీకి చేరినట్లు సమాచారం. వర్సిటీలో అనేక ఆరోపణలు ఉన్న ఓ అధికారి తనిఖీల పేరుతో లక్షల వసూలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు కళాశాలల యాజమాన్యాలు ఫిర్యాదు చేశాయని తెలిసింది.

- తెనాలిలో వైసీపీ నేతగా చలామణి అయ్యే వ్యక్తికి బాపట్ల డిగ్రీ కళాశాలలో విధులు అప్పగించారు. ఇదే వైసీపీ నేతకు నరసరావుపేటలో మరో వైసీపీ నేతకు చెందిన బీఈడీ కళాశాలలో అధ్యాపకుడిగా అప్రూవల్ ఇచ్చారు. ఇలా ఒకేసారి డిగ్రీ, బీఈడీ కళాశాలల్లో లెక్చరర్‌గా ఎలా అప్రూవ్ చేస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు.
- ఒరిజినల్ సర్టిఫికెట్లు లేకపోయినా కేవలం జిరాక్స్ కాపీలతో తెలంగాణకు చెందిన అధ్యాపకులకు ఇక్కడి కళాశాలల్లో అప్రూవల్ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి.
- ఓ వైసీపీ నేతకు చెందిన డిగ్రీ, బీఈడీ కళాశాలలో రెండింటికి ఒకేసారి అప్రూవల్ చేయడమే కాకుండా అరవై ఏళ్ల దాటిన వారిని అధ్యాపకులుగా నియమించినట్లు సమాచారం.

నాటి రన్నింగ్ కామెంటరీ మరిచారా..!

వైసీపీ కౌన్సిలర్ల ఆరోపణలను తిప్పి కొట్టిన టీడీపీ మహిళా కౌన్సిలర్లు

నాడు అభివృద్ధి గురించి మరిచి.. ప్రశ్నిస్తే రన్నింగ్ కామెంటరీ అన్నారు..

ప్రస్తుతం అభివృద్ధి జరుగుతుంటే ఆరోపణలా..

వైసీపీ కౌన్సిలర్లను నిలదీసిన టీడీపీ

అద్దంకి,జూలై31(ఆంధ్రజ్యోతి): 'అప్పట్లో సమస్యలపై ప్రశ్నిస్తే రన్నింగ్ కామెంటరీ చేసిన విషయాన్ని మరిచి పోయారా..?' అని పలువురు మహిళా టీడీపీ కౌన్సిలర్లు వైసీపీ కౌన్సిలర్లపై తిరగబడ్డారు. అద్దంకి మున్సిపల్ అత్యవసర సమావేశం గురువారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాడివేడి చర్చ నడిచింది. వైసీపీ కౌన్సిలర్లు గుంజి కోటేశ్వరరావు, బాలు తదితరులు ఎన్టీఆర్ కాలనీ, నాటి జగనన్న కాలనీలు(ప్రస్తుతం ఎన్టీఆర్ నగర్‌లు)లలో చిల్లచెట్లు తొలగించాలని, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదే సందర్భంగా అద్దంకి పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. దీంతో ఒక్కసారిగా కోపోద్రేకులైన టీడీపీ మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాము సమస్యలపై ప్రశ్నిస్తే ఫోటోల కోసం ఫోజులిస్తున్నారని విమర్శించారని గుర్తు చేశారు. ఇతర ఇబ్బందికర వ్యాఖ్యలతో చేసిన రన్నింగ్ కామెంటరీ అప్పుడే మరిచి పోయారా అని విమర్శించారు. దీంతో వైసీపీ కౌన్సిలర్ వెనుకడుగు వేసి మిన్నకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అద్దంకి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. అజెండాలోని 20 అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్లు, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ కౌన్సిలర్ కోటేశ్వరరావు విమర్శలను తిప్పికొడుతున్న టీడీపీ మహిళా కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

కృష్ణమ్మ పరవళ్లు

(5వ పేజీ తరువాయి)

చేపల షికారుకు వెళ్లకుండా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సాగర్ జలాశయం నుంచి 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల చేస్తుండడంతో గురువారం పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జలశోయగాలను వీక్షించి తరించారు. సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తూ సందడి చేశారు. ఎగువ నుంచి గురువారం 2 లక్షల 54 వేల 128 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 6 అడుగులు, 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 2లక్షల 49వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు పశ్చిమ డెల్టా కాల్వలకు 16వేల 909 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బ్యారేజి దిగువన నదీ పరివాహక ప్రాంత లంకల్లో నివాసితులు మత్స్యకారులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిలకడగా ప్రవాహం..

కొల్లూరు మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద గంట గంటకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతూ వచ్చింది. సాయంత్రం గండిలో నుంచి వరద ప్రవాహం కొల్లూరు నక్కపాయ వరకు గోతులను ముంచుతూ ప్రవహించింది. నదీ ప్రవాహాన్ని కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ అమర్‌వర్ధన్, ఆర్సీ ఏఈ విజయరాజులు పర్యవేక్షించారు. భట్టిప్రోలు మండల పరిధిలో విస్తరించి ఉన్న కృష్ణానదిలో కూడా వరద ప్రవాహం ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుంది

బస్సులో సీటు కోసం ఘర్షణ

- ఉపాధ్యాయుడిపై యువకుల దాడి
- పరస్పరం కేసుల నమోదు

ఒంగోలు క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సీటు విషయంలో ఇరువురు గొడవపడ్డారు. దీంతో ఆటోడ్రైవర్ తన బంధువులను పిలిపించుకుని టీచర్‌పై దాడి చేయించాడు. వివరాలలోకి వెళితే.. ఒంగోలు నగరం బిలాల్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ కరిముల్లా అద్దంకిలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అదే బస్సులో మద్దిపాడులో టీచర్‌గా పనిచేసే రమేష్‌బాబు ఎక్కాడు. అయితే ముగ్గురు కుర్చునే సీటులో కరిముల్లాతో పాటు మరో వ్యక్తి మాత్రమే కుర్చున్నారు. దీంతో రమేష్‌బాబు వెళ్ళి అక్కడ కూర్చునే ప్రయత్నం చేయగా కరిముల్లా అడ్డుకున్నాడు. కొంచం సర్దుకొండి అంటూ రమేష్‌బాబు అక్కడే కూర్చున్నాడు. దీంతో వారి మధ్య మద్దిపాడు నుంచి గొడవ ప్రారంభమైంది. కరిముల్లా మోచేతితో టీచర్ రమేష్ బాబును నెడుతూ ఉండగా అదే సమయంలో ఆ యన చేయి కాస్త విసరడంతో కరిముల్లా ముక్కుకు తగిలి రక్తం కారింది. దీంతో కరిముల్లా వెంటనే బిలాల్ నగర్‌లో ఉన్న బంధువులకు ఫోన్ చేశాడు. పోతురాజుకాలువ వద్దకు బస్సు వచ్చిన తరువాత కరిముల్లా బంధువులు సుమారు 20మంది బస్సు ఎక్కి రమేష్‌బాబుపై పిడిగుద్దులు గుద్దుతూ దాడి చేశారు. అనంతరం కరిముల్లాను 108 వాహనంలో రిమ్స్‌కు వెళ్ళి అక్కడ పోలీస్ అవుట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. . తనపై ఓ ప్రయాణికుడు దాడి చేశాడని పేర్కొన్నారు. అలాగే టీచర్ రమేష్‌బాబు ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై కొంతమంది యువకులు దాడి చేశారని తెలిపారు. ఈమేరకు రెండు కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ విజయకృష్ణ తెలిపారు.



ధేనువకొండ సమీపంలో వరి నారు మడి చుట్టూ రక్షణ గా చుట్టిన చీరలు

నారుమడికి రక్షణగా రంగు రంగుల చీరలు

ఆకర్షిస్తున్న రంగుల ప్రపంచం

అద్దంకి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండ సమీపంలోని పొలాలలో వరినారుమడులు చేసే రైతులు రంగురంగులుగా ఉన్న చీరలను చుట్టూ ఏర్పాటు చేశారు. దీంతో జంతువులు నారుమడిలోకి వెళ్లకుండా ఉండడంతో పాటు పక్షులు కూడా దగ్గరలోకి రాకుండా ఉంటాయన్న ఉద్దేశ్యంతో రైతులు ఇలా చీరలతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో ఈ ఏర్పాటు పలువురిని ఆకర్షిస్తోంది.

బాధిత రైతుకు పరిహారం చెల్లింపు

సీఎస్‌పురం(పామూరు), జూలై 31(ఆంధ్రజ్యోతి): లోకాయుక్తా చొరవతో భూమిని కోల్పోయిన బాధిత రైతు శివయ్యకు రూ.20,11,645 నష్టపరిహారం చెల్లించారు. మండలంలోని ముసునూరు గ్రామంలో బెంగుళూరు- కడప- విజయవాడ కారిడార్ (ఎన్‌హెచ్554జి) కోసం సేకరించిన భూసర్వేలో శివయ్యకు చెందిన 1.72 ఎకరాల భూమి పోయింది. అందుకుగాను నష్టపరిహారం చెల్లించలేదని 2023లో లోకాయుక్తాలో ఫిర్యాదు చేశారు. ఉప లోకాయుక్తా అధికారి పి.రజిని ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ప్రత్యేక జిల్లా కలెక్టర్ (భూ సేకరణ) సమగ్ర నివేదికలు సమర్పించారు. సదరు భూమి ప్రైవేట్‌దిగా గుర్తించి నిషేధిత జాబితా నుంచి తొలగించామని పేర్కొన్నారు. ఈక్రమంలో బాధితుడు శివయ్యకు హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా నష్టపరిహారంగా చెల్లించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మి

దర్శి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్ర బాబు సభకు భారీగా కార్యకర్తలు, రైతులు, ప్రజలు తరలి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని మండలంలోని తూర్పువీరాయపాలెంలో 2వ తేదిన ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్కడ ఏర్పాటుచేస్తున్న సభా వేదిక, హెలిప్యాడ్‌ను ఆమె పరిశీలించారు నిర్వాహకులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేయా లని సూచించారు. ఈసందర్భంగా ఆమె మా ట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమ లుకు శ్రీకారం చుట్టడంతో అన్నదాతల్లో ఆనం దం వ్యక్తమవుతుందన్నారు. సీఎం చంద్రబా బు ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అ మలు చేస్తుండటంతో అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీ ఎం సభ ఏర్పాట్లలో ప్రజలకు ఎలాంటి ఇ బ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్ సమస్య లేకుం డా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ని యోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, గుర్రం బాలకృష్ణ తది తరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు కార్యక్రమ ఏర్పాట్లు శర వేగంతో సాగుతున్నాయి. దర్శి-తూ ర్పుగంగవరం రోడ్డులో తూర్పువీరాయపాలెం వద్ద సీ ఎం చంద్రబాబు సభావేదిక ఏర్పాటు చేస్తు న్నారు. కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ నిర్మి స్తున్నారు. రాష్ట్ర మంత్రి బాలవీరాంజనేయ స్వామి రెండు స్థలాలను పరిశీలించి అధికారు లకు సూచనలు చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పలుశాఖల అధికారులు ఉదయం నుంచి రా త్రి వరకు రోజంతా సీఎం సభా ఏర్పాట్లలో ని మగ్నమయ్యారు. సీఎం సభను విజయవం తం చేసేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సా గర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకు లు, కార్యకర్తలతో చర్చిస్తున్నారు. ఎన్నికల తర్వాత ప్రప్రథమంగా సీఎం చంద్రబాబు దర్శి కి వస్తుండటంతో సభను విజయవంతం చే సేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ లక్ష్మి

అవీ..ఇవీ..

ఆలయాల అభివృద్ధికి కృషి

● నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



భూమిపూజ చేస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

కఠారిపాలెం(చీరాల), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని వివిధ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయనున్నట్లు టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం వేటపాలెం మండల పరిధిలోని కఠారిపాలెం గ్రామంలో శ్రీసీతా రామాలయం పునఃనిర్మాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య నిర్విరామంగా శ్రమిస్తున్నట్లు చెప్పారు. వివిధ వృత్తుల్లో ఉన్న ప్రజలకు ఆధ్యాత్మికతత్వం మనశ్శాంతిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలకు పుస్తకాలు మంజూరు



గ్రాంటు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు పాఠ్య పుస్తకాల కోసం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కంపెనీ రూ.2 లక్షలు మంజూరు చేసింది. అందుకు సంబంధించిన పత్రాన్ని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావుకు అందజేశారు. అందుకు సంబంధించి ఆధునిక టెక్నాలజీ జావా, ఒరాకిల్ డేటా స్ట్రక్చర్స్, డేటా బేస్ మేనేజ్‌మెంట్ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, డా.హరిణి, డా.సుబ్బారావు, ఆర్‌వి రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయానికి ఇన్వర్టర్ బహూకరణ



సచివాలయ సిబ్బందికి ఇన్వర్టర్ బహూకరిస్తున్న సుబ్బారావు

వేటపాలెం (చీరాల), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ సేవలకు ఇబ్బందులు లేకుండా ప్రజలకు అధికారులు సహకరించాలని పత్తి సుబ్బారావు కోరారు. వేటపాలెం సచివా లయానికి గురువారం ఆయన ఇన్వర్టర్ బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది నిరుపేదలు ఉన్నట్లు చెప్పారు. ఈక్రమంలో ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడం ఆన్‌లైన్ ప్రక్రియతో ముడిపడి ఉందన్నారు. దీంతో సచివాలయంలో విద్యుత్ అంతరాయం తలెత్తినపప్పుడు ఇన్వర్టర్ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలిగ సురేంద్ర, పోతురాజు, బాలకృష్ణ, షమ్మీ, రాజేష్, శరత్‌కుమార్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి

● చేనేత జనసమాఖ్య ప్రతినిధుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

దేశాయిపేట(చీరాల), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చేనేతల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని పలువురు చేనేత నాయకులు కోరారు. గురువారం రాష్ట్ర చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వేటపాలెం మండలం దేశాయిపేట నుండి జాండ్రపేట వరకు జరిగిన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత రంగం సంక్షభంలో ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలో చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల మోహనరావు, బీరక సురేంద్ర, దామర్ల శ్రీకృష్ణ, ఊటుకూరి వెంకటేశ్వర్లు, చుండూరు వాసు తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాలు

అద్దంకిటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు గడ్డిని పెంచుకోవడానికి కావాల్సిన గడ్డి విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని అద్దంకి పశువైద్యాశాల సహాయ సంచాలకులు డాక్టర్ కేవీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం సీఎస్‌హెచ్- 24 రకం విత్తనాలు రాయితీపై ఇస్తుందన్నారు. ఒక ఎకరాకు 20 కిలోలు మాత్రమే అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలన్నారు. పశుగ్రాస విత్తనాలు ఏరియా పశువైద్యాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏ క వార్షిక పంటగా ఉండి మూడు కోతల వరకు వస్తూ అధిక దిగుబడి ఇస్తుందన్నారు. ఈ గడ్డిరకం మేత పశువులకు రుచిగా ఉండి, అధికపాల దిగుబడికి ఉపయోగపడుతుందన్నారు. అద్దంకి, బొమ్మనంపాడు పశువైద్యాశాలల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన తెలిపారు.

ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు అందజేయాలి

చీరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో సాగు చేసుకునేందుకు రైతులకు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతు సంఘం నాయకులు రామారావు, కొండయ్యలు డిమాండ్ చేశారు. ఒకవైపు సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతుండగా, ఎరువులు కొరత పెద్దఎత్తున ఉందని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి రైతుల సమస్యలు పట్టించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

నాడు నరకప్రాయం.. నేడు సాఫీగా

● రూపురేఖలు మారిన తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డు ● పునరుద్ధరించని ధేనువకొండ ఆర్టీసీ బస్ సర్వీస్

అద్దంకి,జూలై31(ఆంధ్రజ్యోతి): మూడు మండలాల ప్రజలు వినియోగించే తిమ్మాయపాలెం-ఇలపావులూరు రోడ్డులో ఏడాది కిందటి వరకు ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేది. 10 కి.మీ దూరం వెళ్లాలన్నా గంట కంటే ఎక్కువ సమయం పట్టేది. అదే రోడ్డులో ఇప్పుడు ప్రయాణం సుఖమయంగా మారింది. సుమారు 20 కి.మీ దూరం ఉండే రోడ్డుకు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి సుమారు రూ.2.20 కోట్లు మంజూరు చేయించారు. తిమ్మాయపాలెం నుంచి ఇలపావులూరు వరకు సుమారు 20 కి.మీ దూరం ఉండగా తారు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో పునః నిర్మాణం చేయడంతో పాటు పేరాయపాలెం వద్ద పూర్తిగా కుంగిపోయి రాకపోకలు నిలిచిన వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణం కూడా చేపట్టారు. దీంతో అద్దంకి మండలంలోని 10 గ్రామాలతో పాటు చీమకుర్తి, తాళ్లూరు మండలాలలోని పలు గ్రామాలకు రాకపోకలకు మరింత సులువుగా మారింది. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణించిన ఇతర ప్రాంతాల వాహనచోదకులు ప్రస్తుతం ప్రయాణిస్తూ ' ఈ మార్గంలోనే వెళుతున్నామా..? మరో మార్గంలోనికి వచ్చామా..?' అన్న అన్న సంశయం కలిగే విధంగా రోడ్డు రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. అయితే పేరాయపాలెం వద్ద వంతెన కూలడంతో రద్దు చేసిన అద్దంకి -ధేనువకొండ బస్ సర్వీసు మాత్రం రోడ్డు బాగుపడ్డ తర్వాత కూడా బస్ పునరుద్ధరించకపోవడంతో పేరాయపాలెం, ధేనువకొండ, ఉమ్మనేనివారిపాలెం గ్రామాల ప్రజలు అద్దంకి రావడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ధేనువకొండ సర్వీస్‌ను వెల్లంపల్లి మీదుగా ఒంగోలుకు పొడిగించాలని, ఇలపావులూరు మీదుగా చీమకుర్తికి మరో సర్వీస్‌ను నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణం పూర్తయిన దోర్నపువాగు వంతెన



తిమ్మాయపాలెం-ఇలపావులూరు ఆర్అండ్‌బీ రోడ్డు

పీఏసీఎస్‌ల ద్వారా రైతాంగానికి ఉత్తమ సేవలు

కొండమంజులూరు పీఏసీఎస్ చైర్మన్ బత్తుల వెంకట్రావు

పంగులూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కొండమంజులూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతాంగానికి ఉత్తమ సేవలు అందిస్తానని చైర్మన్ బత్తుల వెంకట్రావు అన్నారు. కొండమంజులూరు పీఏసీఎస్ చైర్మన్‌గా బత్తుల వెంకట్రావు, పాలకవర్గ సభ్యులుగా చింతలచెరువు రూబెన్, బత్తుల వెంకట్రావు గురువారం ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం టీడీపీ నేత చింతల సహదేవుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, సీనియర్ నాయకులు కేవీ.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్క పల్లి ఏడుకొండలు, నార్నె సుబ్బారావు, పీఏసీఎస్‌లు అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, రావుల సింగరకొండ, డీసీ అధ్యక్షులు కుక్కపల్లి ఆంజనేయులు, గుర్రం ఆదిశేఖర్, వరపర్ల సుబ్బారావు, పూనాటి రామంజనేయులు, మస్తాన్‌వలి, ఓబుల్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీకాంత్ అచ్చిరాజు, అశోక్, ఆదిరెడ్డి, శ్రీరామ్మూర్తి, సత్యవర్ధన్, జగన్, శ్రీనివాసరెడ్డి, సీఈవో ఏల్చూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని వల్లాపల్లి గ్రామ సొసైటీ అధ్యక్షునిగా మాలపాటి సుబ్బయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం వల్లాపల్లి సొసైటీకి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా మాలపాటి సుబ్బయ్య సభ్యులుగా మందా యాకోబు, షేక్ ఖాజావలిని నియమించింది. దీంతో నూతన కమిటీ బాధ్యతలను స్వీకరించింది. అనంతరం వారు మాట్లాడుతూ తమ నియమకానికి సిఫార్సు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రామ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు చింతల రామారావు, అల్లాఉద్దీన్, యేబు, అబ్దుల్ రహీం, హరిబాబు పాల్గొన్నారు.



బాధ్యతలను స్వీకరిస్తున్న బత్తుల వెంకట్రావు



చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుబ్బయ్య

వేగంగా బోర్ల మరమ్మతులు

మార్టూరు, జూలై31 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలలో నిరాదరణకు గురైన చేతిపంపులు మరమ్మత్తులను కూటమి ప్రభుత్వం చేపట్టింది. రెండు నెలలులోనే మండలంలో దాదాపుగా 130 చేతి పంపులకు మరమ్మత్తులు చేశారు. వాటికి అవసరమైన హెడ్‌లు, వాటర్ ట్యాంక్, ఇనుపచైన్, హ్యాండిల్‌ను కొత్తవి ఏర్పాటు చేశారు. వైసీపీ హయాంలో ఈ బోర్లు మరమ్మతులకు గురైనా నాటి పాలకులు పట్టించుకోలేదు. దీంతో మండలంలోని పలు గ్రామాలలో చాలా బోర్లు వట్టిపోయాయి. దానికి తోడు గ్రామాలలో సిమెంటు రోడ్లు నిర్మాణం జరగడంతో, రోడ్డు ఎత్తు పెరగడంతో,రోడ్డు ప్రక్కన ఉన్న చేతిపంపులు భూమిలోకి కుంగిపోయాయి. దీంతో ఈ ఇబ్బందులను గమనించిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మండలంలో తొలుత మరమ్మత్తులకు గురైన బోర్లును వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మండలానికి మంజూరయిన రూ.10 లక్షల విలువైన బోర్లు సామానులతో వేగంగా గ్రామాలలో బోర్లు మరమ్మతులు చేపట్టారు. మండలంలోని బోర్లు బాగు చేసే సిబ్బంది నాగేశ్వరరావు, రఫీలు నిత్యం ఏదో ఒ క గ్రామంలో మరమ్మతులు చేపడుతున్నారు. వాస్తవంగా మండలంలో 160కు పైగా బోర్లు మరమ్మతులకు గురయినట్లు అధికారుల రికార్డులో ఉంది .ఇప్పటికే 130 బోర్లును మరమ్మత్తులు చేశారు.దాదాపుగా ప్రతి గ్రామంలో సరాసరి 10 కు పైగా బోర్లును రిపేరు చేశారు. మార్టూరు గ్రామంలో అత్యధికంగా 40 బోర్లు మరమ్మత్తులకు గురికాగా, వాటిలో 15 బోర్లు బాగు చేశారు. పూర్తిస్థాయిలో బోర్లను మరమ్మతు చేయడానికి ఇంకా 10 లక్షల విలువైన సామాన్లు అవసరమవుతాయని దీని కోసం ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీడీవో వై.శ్రీనివాసరావు తెలిపారు.



నేతాజీనగర్‌లో బోరుకు బిగించిన కొత్త హెడ్ సామానులు

స్వామిత్వ సర్వేపై ప్రజలకు అవగాహన పెంచాలి

ఇంకొల్లు, జూలై 31, (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ అన్నారు. మండలంలోని గ్రామాలో నిర్వహించే సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు, సర్వేయర్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి సర్వేపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

పర్చూరులో....

పర్చూరు మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వామిత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో సత్య నారాయణ మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయితీల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి సర్వే నిర్వహించ నున్నట్లు తెలిపారు. గ్రామ కంఠాలలో గృహాలు నిర్మించు కున్న యజమానులు సర్వే సమయంలో అందుబాటులో ఉండాలని కోరారు. గృహ యజమానుల ఆస్తి ధ్రువీకరణపత్రాలు అందజేయడానికి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.



పర్చూరులో శిక్షణ ఇస్తున్న అధికారులు

పీటర్ కుటుంబ సభ్యులకు పరామర్శ



పీటర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

చీరాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇండస్ట్రియల్ రిటైర్డ్ డిప్యూటీ డైరక్టర్ తాళ్లూరి పీటర్ కుటుంబ సభ్యులను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పరా మర్శించారు. పీటర్ ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కొత్తపేటలోని ఆయన నివాసంలో కుటుంబసభ్యులను కృష్ణ మాదిగ పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీటర్ కుటుంబ సభ్యులతో సుదీర్ఘ అవినాభావ సంబంధం ఉన్నట్లు చెప్పారు. ఆయన మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. మందకృష్ణతో బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, వందనం, రమేష్, నాగేశ్వరరావు, తేళ్ల రాంబాబు, శరత్ తదితరులు ఉన్నారు.

టిప్పర్‌ను ఢీ కొన్న లారీ

అద్దంకి, జూలై 31(ఆంధ్రజ్యోతి): టిప్పర్‌ను లారీ ఢీ కొట్టడంతో టిప్పర్ ఆయిల్ ట్యాంక్ పగిలి డీజిల్ రోడ్డు పాలయ్యింది. అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం వద్ద గురువారం వేకువజామున గ్రావెల్ టిప్పర్ నామ్ రోడ్డులో నుంచి కలవకూరు రోడ్డులోకి మలుపు తిరుగుతుండగా నామ్ రోడ్డులో అద్దంకి పట్టణంలోకి వస్తున్న లారీ ఢీ కొట్టింది. టిప్పర్ ఆయిల్ ట్యాంక్‌ను లారీ ఢీ కొనడంతో పగిలి డీజిల్ మొత్తం నేలపాలయ్యింది. నామ్ రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం హైవే పె ట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరించారు.

నూతన పెన్షన్‌లు మంజూరు

చినగంజాం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 129 మంది జీవిత భాగస్వాములకు ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పెన్షన్ మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీహెచ్.పూర్ణచంద్రరావు గురువారం తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటూ మృతిచెందిన వారి భార్యలకు పెన్షన్ మంజూరైనట్లు తెలిపారు. చినగంజాం గ్రామ సచివాలయం-1 పరిధిలో 11 మందికి, చినగంజాం-2 గ్రామ సచివాలయం పరిధిలో ఐదుగురు, గొనసపూడిలో 15 మందికి, కడవకుదురు-1లో ఐదుగురు, కడవకుదురు-2లో 8 మందికి, కొత్తపాలెంలో 14 మందికి, మోటుపల్లిలో 10 మందికి, మున్నంవారిపాలెంలో 9 మందికి పల్లెపాలెంలో 4, పెదగంజాం-1లో 16 మందికి, పెదగంజాం-2లో 13 మంది, రాజుబంగారుపాలెంలో 8 మందికి, సంతరావూరులో 11 మంది మహిళలకు పెన్షన్ మంజూరైనట్లు తెలిపారు. శుక్రవారం వీరందరకీ పెన్షన్ అందజేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

విద్యాశాఖ అధికారుల ఏకపక్షధోరణి సరికాదు

ఇంకొల్లు,జూలై 31,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 97 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను కాదని మూడు శాతం కూడా లేని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారుల పోస్టులు కట్టబెట్టడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం బాపట్ల జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు దేవరకొండ ప్రసాదరావు, పిడపర్తి పేరిరెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవ న్యాయస్థానాలు యథాస్థితిని కొనసాగించాలని చెప్పినప్పటికీ, ఏకపక్షంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రధానోపాధ్యాయులకు మాత్రమే కాకుండా ఆ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లుతో భర్తీ చేయడానికి పూనుకోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

పోలేరమ్మ ఆలయంలో విశేషపూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

యద్దనపూడి,(మార్టూరు)జూలై31 (ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో గురువారం గ్రామదేవత పోలేరమ్మ, ఉపదేవత ఊర అంకమ్మతల్లి అనంత వార్షిక కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక అలంకరించారు. మహిళలు అమ్మవార్లుకు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పూసలు, మంగళ ద్రవ్య సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఆలయ అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవార్ల మూలమూర్తుల విశేష కుంకుమ, పుష్ప అర్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

మార్టూరు, జూలై31(ఆంధ్రజ్యోతి):మార్టూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం టీబీ వ్యాధి గ్రస్తులకు 11 రకాల పౌష్టికాహారకిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టరు శ్రీహర్ష, జిల్లా క్షయ పీపీఎం సమన్వయకర్త డి.కార్తీక్, డాక్టరు సీహెచ్ అశోక్‌రెడ్డి, కె రాంబాబు,వెంకటరత్నం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుని ద్విచక్ర వాహనం చోరీ

● ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సరదాగా సముద్ర తీరంలో గడిపేందుకు వచ్చిన పర్యాటకుని ద్విచక్ర వాహనంపై చోరీకి గురైంది. ఒంగోలు సమీపంలోని త్రోవగుంటకు చెందిన పాలపర్తి జయపాల్ గత బుధవారం వాడరేవు సముద్ర తీరానికి వచ్చాడు. ఒడ్డున వాహనం పార్కింగ్ చేసి సముద్రంలో మునిగి వచ్చిన తర్వాత చూస్తే వాహనం కనిపించ లేదు. ఈక్రమంలో ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీకెమెరాలు తప్పనిసరి



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లు, ఏటిఎంల వద్ద సీసీ కెమెరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని సీఐ సుబ్బరాజు అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అద్దంకి పట్టణంలోని బ్యాంకుల అధికారులతో సీఐ సుబ్బరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంక్‌ల వద్ద చోరీలు జరగకుండా, ఒకవేళ చోరీ జరిగితే వెంటనే దొంగలను గుర్తించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనుమానిత వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు.

మహిళల రక్షణకే శక్తి యాప్



రావినూతల హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మేదరమెట్ల, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా శక్తియాప్‌ను ఏర్పాటు చేసినట్లు కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని రావినూతల, పమిడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు శక్తియాప్ గురించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు 7993485111 నంబరుకు పోన్ చేసినా, వాటప్ మెసేజ్ చేసినా, వెంటనే శక్తిబృందాలు స్పందించి ఆదుకుంటాయన్నారు. ఈ నెంబరు 24 గంటలు అందుబాటులో ఉంటుందని చెప్పారు. విద్యార్థినుల అ వగాహన కోసం ఏది మంచి స్పర్శ ఏది చెడు అనేది వివరించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై 5న నిరసన




సమావేశమైన ప్రజా సంఘాల నాయకులు

అద్దంకిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు నిలువు దోపిడిని పెంచే ప్రమాదకర స్మార్ట్ మీటర్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందర్ కోరారు. గురువారం అద్దంకిలోని అంబేద్కర్ భవనంలో ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజుందర్ మాట్లాడుతు విద్యుత్ స్మార్ట్ మీటర్లు రానున్న రోజుల్లో ప్రజలను లూటీ చేసే దోపిడి సాధనాలుగా మారతాయన్నారు. ప్రజలను చైతన్య పరిచి ఉద్యమించే కార్యక్రమంలో భాగంగానే 5న జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరు పాల్గొన్నాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు జ్యోతి రమేష్, పి.రవి, ఆర్ కోటేశ్వరరావు, ఈ.నాగేశ్వరరావు, నాగసూరి శ్రీనివాసరావు, కె.రఘుచంద్, తంగిరాల వెంకటేశ్వర్లు, పెద్దవలి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 1 ఆగస్టు 2025

అడుగడుగునా ఉల్లంఘనలు





మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఇంటి వద్ద బారికేడ్లను తోసేసి, విధుల్లో ఉన్న పోలీసులను నెట్టేసి దూసుకెళుతున్న వైసీపీ శ్రేణులు

- పోలీసు ఆంక్షలను లెక్కచేయని వైసీపీ
- వచ్చిన కొద్దిమందితోనే ఆర్భాటం
- రోడ్లపై గుమికూడి నానా యాగీ
- జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు

వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో వైసీపీ శ్రేణులు అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడ్డాయి. పోలీస్ ఆంక్షలను కూడా లెక్కచేయకుండా రోడ్లపై హల్‌చల్ చేశాయి. నగరంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిసి కూడా రోడ్లపై బైఠాయించి నానా యాగీ చేశారు. పరామర్శల కోసం అనుమతులు పొంది, దానిని ఒక బలప్రదర్శన ప్రయోగంగా మార్చాలని చూశారు. జిల్లావ్యాప్తంగా 70 వేల నుంచి లక్ష మందిని జగన్ పర్యటనకు తరలించాలని వైసీపీ నేతలు భావించినా ఆశించిన స్థాయిలో సమీకరణ చేయలేకపోయారు. ఆరంభం నుంచి ఆఖరు వరకు కొంత మంది జగన్ కాన్వాయ్ ముందు పరుగెడితూ హంగామా చేశారు తప్ప ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు.

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం, పల్నాడు జిల్లాల పర్యటనలో తలెత్తిన శాంతి భద్రతల సమస్యల దృష్ట్యా నెల్లూరులో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొన్ని ఆంక్షలు విధించారు. ఎక్కువ మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు గుమికూడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దంటూ పోలీసులు ముందే నోటీసులు ఇచ్చారు. అయినా పెద్ద సంఖ్యలోనే వైసీపీ శ్రేణులు జగన్ పర్యటనకు తరలిరావడంతో కొన్ని చోట్ల తోపులాట జరిగింది. అయితే పోలీసులు ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జగన్ పర్యటన ముగిసేలా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు జగన్ నెల్లూరు సెంట్రల్ జైలు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి సెంట్రల్ జైలుకు వెళ్లి రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. జగన్ వెంట మిలాఖత్‌కు కాకాణి కుమార్తె పూజిత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కూడా వెళ్లారు. హెలిప్యాడ్ వద్దకు జగన్ కాన్వాయ్‌తోపాటు మరో మూడు వాహనాలకు మాత్రమే పోలీసులు అనుమతిచ్చారు. అయితే పదుల సంఖ్యలో వాహనాలు హెలిప్యాడ్ వద్దకు వెళ్లాయి. లెక్కకు మించి వైసీపీ నాయకులు, కార్యకర్తలు హెలిప్యాడ్ ప్రాంగణం వద్ద గుమికూడారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా పోలీసులు అడుగుతున్నా తన కారు ఆపకుండా హెలిప్యాడ్ వద్దకు వెళ్లడం గమనార్హం. వచ్చింది కొద్దిమందే అయినా వీరంతా జైలు రోడ్డు వద్ద జాతీయరహదారిపై గుమికూడటంతో చాలాసేపు ట్రాఫిక్ ఆగిపోయింది. దీంతో వాహనదారులే కాదు.. సామాన్య ప్రజానీకానికీ చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. జైలు నుంచి రోడ్డు మార్గాన నెల్లూరులోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ మార్గంలో కొన్ని చోట్ల వైసీపీ శ్రేణులు గుమికూడటంతో కాన్వాయ్ ఆలస్యంగా నడిచింది. షెడ్యూల్ ప్రకారం అర్ధగంటలో ప్రసన్న ఇంటికి చేరుకోవాల్సి ఉండగా, రెండు గంటల సమయం పట్టింది.

• పోలీసులు చెప్పినా..

నగరంలో పోలీసు యాక్ట్ అమల్లో ఉంది. ఎక్కువ మంది ఒకచోట గుమికూడదని పోలీసులు ప్రకటించారు. ఆ క్రమంలోనే జగన్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు జగన్ వచ్చే సందర్భంగా వంద మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. ఇతరులెవరూ అక్కడకు రాకుండా వీధుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ శ్రేణులు అంబేడ్కర్ భవన్ ప్రాంతానికి భారీగా చేరుకున్నారు. వీరిని పదే పదే అక్కడ నుంచి పోలీసులు పంపేస్తున్నా మళ్లీ వచ్చి చేరిపోయారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈలోపు ప్రసన అక్కడకు చేరుకున్నారు. తమ నాయకుడికి అంబేడ్కర్ భవన్ నుంచే స్వాగతం పలుకుతామంటూ ప్రకటించారు. అందుకు అనుమతి లేదని పోలీసులు నచ్చచెప్పినా వినిపించుకోలేదు. ఒక్కసారిగా వైసీపీ శ్రేణులు అక్కడ గుమికూడటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ శ్రేణులను పోలీసులు పక్కకు లాగేశారు. దీంతో ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. ఇంతలో జగన్ కాన్వాయ్ అక్కడకు చేరుకోవడంతోనే ప్రసన్న కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు. అదే సమయంలో కార్యకర్తలు భారీ సంఖ్యలో బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. జగన్ కారు కంటే ముందు పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో కలిసి ప్రసన్న నడుచుకుంటూ వచ్చి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుంటూ ముందుకు సాగారు. దీంతో అక్కడే ఉన్న ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య కిందపడటంతో ఆయన కుడి చేయి విరిగిపోయింది. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే ఆయన్ను కిమ్స్ వైద్యశాలకు తరలించారు. కొందరు గోడలు దూకుకుంటూ వచ్చారు. అయితే ఎక్కడా పరిస్థితులు చేజారకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రసన్న ఇంటికెళ్లాక వారి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. ఇంటిపై జరిగిన దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరిగి సెంట్రల్ జైలు సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకొని బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు.

కేసుల నమోదు

నెల్లూరు(క్రైం) : జగన్ పర్యటనలో వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించడంపై గురువారం రాత్రి దర్గామిట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి జరిగిన తోపులాటలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ప్రసన్నతోపాటు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, మరికొందరిపై కేసు నమోదు చేశారు. అలాగే రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టిన ప్రసన్నపై మరో కేసు నమోదు చేశారు.



అన్నదాత సుఖీభవ
నిధులు రేపు జమ

• 1,86,368 మంది రైతులకు లబ్ధి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకం కింద 1,86,368 మంది రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2వ తేదీన పెట్టుబడి సాయం నిధులు జమ చేయనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రైతు కుటుంబానికి ఏడాదికి కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి రూ.20వేలు మూడు విడతల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. కౌలు రైతు ధృవీకరణ పత్రం కలిగిన భూమి లేని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10వేలు చొప్పున రెండు విడతలుగా రూ.20వేలు వారి ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. ఈనెల 2వ తేదీన మొదటి విడత పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ నిధుల విడుతలకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకుని, ఎన్‌పీసీఐ లింకు కలిగి ఉన్న 1,86,368 రైతు కుటుంబాలకు మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం తరఫున 20వ విడతగా 1,68,000 మందికి రూ.2వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. మొదటి విడతలో అర్హత పొందని అర్హులైన రైతులు వాటికి సంబంధించిన కారణాలను సరిచేసుకుంటే రెండో విడతలో నగదు జమ అవుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

నేడు, రేపు మెగా జాబ్‌మేళా

• ఆత్మకూరులో విస్తృత ఏర్పాట్లు

ఆత్మకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మెట్టప్రాంత యువత ఉజ్వల భవిష్యత్ కోసం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళాను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, పలువురు ప్రముకులు, అధికారులు పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో తొలిరోజు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, రెండవ రోజు అభ్యర్థుల అర్హతల మేరకు నియామకపత్రాలను ఆయా కంపెనీలు అందజేస్తాయి. సుమారు 100 వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి కంపెనీలు ఈ మేళాలో పాల్గొననున్నాయి. ఇప్పటికే ఆత్మకూరు ఆర్డీవో బి పావని, అధికారులు ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యను పూర్తి చేసుకున్న అభ్యర్థుల జాబితాను తయారు చేసి వారందరూ జాబ్‌మేళాకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. జాబ్‌మేళా ఏర్పాట్లపై పలుమార్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో సమీక్షలు నిర్వహిం దిశనిర్ధేశం చేశారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి రవాణా సౌకర్యాలతోపాటు అన్ని సదుపాయాలు సమకూర్చారు. ఒక్క ఆత్మకూరు నుంచే కాకుండా జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ, ఉపాధి అంకాశాలను పొందాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు.



ఆగస్టు కోటాలోనూ లేనట్లే...

నెలల తరబడి కార్డుదారుల ఎదురుచూపులు

నెలల తరబడి
కందిపోతున్నాం!

ఉదయగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డుదారులకు ఆగస్టునెల కోటాలోనూ కందిపప్పు అందలేదు. ప్రభుత్వం జూన్‌లో ఎండీయూ వాహనాలను రద్దు చేయగా, 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా ప్రతినెలా 26 నుంచి 30తేదీ లోపు వారి ఇంటివద్దకే డీలర్లు వెళ్లి సరుకులు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈనెలాఖరులో ఇచ్చిన సరుకుల్లో కందిపప్పులేదు. మిగిలిన కార్డుదారులకు చౌకదుకాణాల ద్వారా శుక్రవారం (రేపటి) నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయను న్నారు. వారికి బియ్యం, పంచదార మాత్రమే అందించ నున్నారు. ప్రభుత్వం ప్రారంభంలో కార్డుదారులకు అన్నీసరుకులను పంపిణీ చేసింది. అనంతరం కొన్ని నెలలపాటు 50శాతం మంది కార్డుదారులకే కందిపప్పు పంపిణీ చేసింది. ఆ తరువాత ఆరు నెలలుగా కంది పప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు.

• బయట కొనలేక...

జిల్లాలో సుమారు 1,894 చౌక దుకాణాలు ఉండగా, అందులో 8.65 లక్షలమంది కార్డుదారులు ఉన్నారు. వారికి నెలల తరబడి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో వారు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు నాణ్యతను బట్టి రూ.110ల నుంచి రూ.130ల వరకు ఉంది. చౌక దుకాణాల ద్వారా కేవలం రూ.67లకే అందిస్తున్నారు. ఇది కార్డుదారులకు ఎంతో ఉపశమనం కలిగించనుంది. కందిపప్పు కోసం కొంతమంది కార్డుదారులు డీలర్లతో వాదనకు దిగుతుండడంతో వారు సమాధానం చెప్పలేకున్నారు.

బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలి

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ గురువారం కలిగిరిలో అన్నదాత లు రోడ్డెక్కారు. తహసీల్దారు కార్యాలయ కూడలిలో బొప్పాయి కాయలను రోడ్డుపై పోసి తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్థానిక దళారులు కిలో రూ.15 వంతున కాయలను కొనుగోలు చేస్తామని తమకు చెప్పి తీరా పంట చేతికొచ్చాక రూ.5 మాత్రమే ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ధరకు కాయలను అమ్మితే పెట్టుబడులు కూడా రావని అప్పులపాలవుతామని వాపోయారు. దళారుల జోక్యాన్ని నివారించి ప్రభుత్వమే బొప్పాయి పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రైతులు కాకూరు విష్ణువర్ధన్ రెడ్డి, సంగన గోపాల్‌రెడ్డి, ఆరికల శ్రీను, సోము రాజారెడ్డి, శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రోడ్డుపై బొప్పాయి కాయలు పోసి తగలబెడుతున్న రైతులు

ఇద్దరు ఎంఈవోల వ్యవస్థతో ఇక్కట్లు

విద్యారంగంలో పేరుకుంటున్న సమస్యలు



ఆధిపత్య పోరు

నెల్లూరు(విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇద్దరు ఎంఈవోల నియామకం ఆధిపత్యపోరుకు దారితీస్తోంది ఎవరికివారు తమ ప్రతిష్టను కాపాడుకునేం దుకు, విద్యాశాఖలో తమ అధికారాన్ని చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో విద్యారంగంలో సమస్యలు పేరుకు పోతున్నాయని ఉపాధ్యా యులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల సామర్థ్యాలను ముదింపు తదితర కార్యకలాపాలకు ఉద్దేశించిన ఎంఈవో-1, 2 వ్యవస్థలు ప్రస్తుతం అవస్థలతో నడుస్తున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒకే పనికి ఇద్దరు సమానహోదా కలిగిన అధికారులతో క్షేత్రస్థాయిలో ఎదురవుతన్న ఇబ్బందులను టీచర్లు ఏకరువు పెడుతున్నారు.

• నిరుత్సాహం, అసంతృప్తిలో ఎంఈవో-2లు

విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, పరిష్కరించేందుకు గత ప్రభుత్వంలో ఎంఈవో-1, 2ల వ్యవస్థ ఏర్పాటైంది. ప్రస్తుతం ఎంఈవో-2లు తీవ్ర నిరుత్సాహం, అసంతృప్తితో విధులు నిర్వహిస్తున్నారు. ఎంఈవో-1 మాత్రం మండలాల్లో తామే సర్వస్వం అని, ఏదైనా తమ అనుమతి లేనిదే చేసేందుకు వీలులేదన్న వాదనలు వినిపిస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. జిల్లాలోని 38 మండలాల్లో కీలకమైన ఎంఈవో-1లు 18 మండలాల్లో రెగ్యులర్‌గా ఉండగా, మిగిలిన 20 మండలాల్లో మాత్రం ఇన్‌చార్జులు పనిచేస్తున్నారు. వీరిలో కూడా రెగ్యులర్ ఎంఈవో-1లు ఇతర ప్రాంతాల్లో కూడా ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఎంఈవో-2కు సంబంధించి అన్ని మండలాల్లో రెగ్యులర్ అధికారులు ఉండగా ఒక్క సీతారామపురంలో మాత్రం ఎవరినీ నియమిం చలేదు. పక్క మండలం ఎంఈవోనే ఇక్కడ పర్యవేక్షిస్తున్నారు. అయితే ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ కారణంగా అసమానతలు ఏర్పడుతున్నాయని, ఇద్దరినీ ఏకీకృతం చేసే ఫార్ములా ద్వారా ఒక్కరినే నియమించడం

- మిగతా 7లో

నేటినుంచి
'స్పౌజ్' పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొత్త స్పౌజ్ (భర్త మరణిస్తే భార్యకు ఇచ్చే పింఛను) పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శుక్రవారం నుంచి ఈ పెన్షన్ సొమ్ము పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. కొన్ని నెలలుగా కొందరు ఎమ్మెల్యేలు, కొందరు నాయకులు అడ్డుపుల్ల వేయటంతో పంపిణీకి బ్రేకులు పడ్డాయి. వాస్తవంగా జూన్ 12వ తేదీనే స్పౌజ్ పెన్షన్ల పంపిణీకి జిల్లాలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఆ తర్వాత ఎందుకనో వాయిదా పడింది. ఆ తరువాత జూలై 1న పాత వితంతు పెన్షన్లతో కలిపి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రెండవ సారి కూడా వాయిదా పడింది. గత ప్రభుత్వంలో చనిపోయిన వారికి పెన్షన్లు ఎలా ఇస్తారని కొందరు టీడీపీ నాయకులు అడ్డుపుల్ల వేసినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేలు కూడా బాధితులెవరూ తమ వద్దకు వచ్చి పెన్షన్లు మంజూరుచేయించమని అడగలేదని, పెన్షన్లు పంపిణీ చేయవద్దని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. స్పౌజ్ పెన్షన్లన్నీ అర్హమైనవని ఒక కొత్త అంశాన్ని లేవనెత్తినట్లు సమాచారం. మళ్లీ వాటిని తనిఖీ చేయించాలని కోరినట్లు సమాచారం. దీంతో ఆ పెన్షన్ల పంపిణీ ఆగిపోయింది. అన్ని అంశాలు పరిశీలించాక స్పౌజ్ పెన్షన్లను ఆగస్టు 1 నుంచి పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కొత్తగా 5489 మంది అర్హులైన స్పౌజ్ పెన్షనర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ఇప్పటి వరకు 80,235 మంది వితంతు పింఛనుదారులు ఉన్నారు. ఇప్పుడు మొత్తం కలిపి పింఛనుదారుల సంఖ్య 85724లకు చేరుకుంది.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న సెంట్రల్ మెరైన్ అధికారులు, సిబ్బంది

రామాయపట్నం పోర్టు సమీపంలో రాడార్ కేంద్రం

• స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కలిసిన సెంట్రల్ మెరైన్ సిబ్బంది

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు సమీపంలో రాడార్ కేంద్రం ఏర్పాటు కానుంది. ఇక్కడ మంజూరైన రాడార్‌కేంద్రానికి రామాయపట్నం పరిసరాల్లో అనువైన స్థలాన్ని కేటాయించాలని సెంట్రల్ మెరైన్ సిబ్బంది శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేశారు. రాడార్ కేంద్రం ఏర్పాటు వల్ల నౌకల రాకపోకలు, సముద్రంలోని పరిస్థితులను సులువుగా అంచనా వేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకి వివరించారు. అంతేగాక నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మత్స్యకారులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లిన సమయాల్లో వారి స్థితిగతులను అంచనా వేయటం, ఏ ప్రదేశంలో వారు ఉన్నారో గుర్తించడం సులువవుతుందని ముఖ్యంగా ప్రకృతి విపత్తుల సమయంలో మత్స్యకారులకు ఈ కేంద్రం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని వారు వివరించారు. నౌకాయాన రక్షణతోపాటు సముద్రతీరంలోని ప్రజలకు కూడా ఈ కేంద్రం వరంగా మారుతుందని తెలిపారు. రాడార్ కేంద్రం నిర్మాణ కోసం ఒకటిన్నర ఎకరం స్థలం అవసరమవుతుందని, ప్రస్తుతం ఉన్న రామాయపట్నం మెరైన్ పోలీసు స్టేషన్ పరిసరాల్లో అనువైన స్థలాన్ని ఎంపికచేయించాలని వారు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244

కోడిగుడ్ల ధర (100): 475

గ్రామ ముఖద్వారం ప్రారంభం


ముఖద్వారం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణలో పోలంపాడు గ్రామ ముఖద్వారం తొలగించవలసి వచ్చింది. అనంతరం గ్రామస్థులంతా కలిసికట్టుగా నూతనంగా నిర్మించుకున్న ముఖద్వారాన్ని గురువారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

2 నుంచి పాలిసెట్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్ర కోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 2వ తేదీ నుంచి 5వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురు వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్ అయినవారు, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటిఐ పాస్/ఫెయిల్ అయిన వారు, 2025కు అసలు పాలిసెట్‌కు అప్లయ్ చెయ్యనివారు కూడా స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, 4వ నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల స్టడీ సర్టిఫికేట్లు, పాలిసెట్‌కు దరఖాస్తు చేసి పరీక్ష రాసినవారు హాల్‌టికెట్, అర్హత సాధించినా, లేకున్నా ర్యాంక్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తదితర సర్టిఫికెట్లతో పాటు రూ.5800 అడ్మిషన్లకు ప్రవేశ రుసుంతో రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం లేదన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), సివిల్ ఇంజనీరింగ్ శాఖలు అందుబాటులో ఉన్నాయన్నారు. తదుపరి సమాచారం కోసం సుబ్బన్న హెచ్‌వోడి (ఈఈ ఈ)7981307400, ఎస్ శ్రీనివాస రెడ్డి (సివిల్ ఇంజనీరింగ్) 9440394524 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం 9 గంటలకు లింగసముద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని కందుకూరులోని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈకార్యక్రమానికి అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

అధ్యాపకురాలి మృతికి సంతాపం

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న షేక్ షహనాజ్‌బేగం గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆమె మృతిపట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, సహచర అధ్యాపకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కొండాపురం తహసీల్దార్‌గా సురేష్‌బాబు


తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నేతలు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు బదిలీపై లింగసముద్రం మండలానికి వెళ్లడంతో బోగోలు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎమ్ సురేష్ బాబు బదిలీపై వచ్చారు. దీంతో కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఆయనను ప్రత్యేకంగా కలసి అభినందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు నాయుడు, పోలినేని రమేష్, దాసరి అశోక్, పి చైతన్య, నరేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎంఈఓగా ఎంఎన్‌కే శర్మ



కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మండల విద్యాశాఖాధికారిగా ఎం. నాగకుమారశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని, ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓను ఎంఈఓ2 కె. సుబ్బారెడ్డి, కార్యాలయ సిబ్బంది, సీఆర్ ఎంటీలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్కరించారు.

అధ్వానంగా ముసునూరు ట్రంకు రోడ్డు

● గుంతలమయమైన రహదారిపై వాహనదారుల అవస్థలు


గుంతలమయంగా మారిన ముసునూరు ట్రంకు రోడ్డు

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరు దక్షిణ శివారులో ఉన్న ట్రంకు రోడ్డు కొంత భాగం దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ముసునూరులో ట్రంకు రోడ్డు బాగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఇంటి ముందు, ముసునూరు ప్రధాన ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డుకు తారు కోటింగ్ వేయించారు. దీంతో కావలి నుంచి ముసునూరు బైపాస్ వరకు ఒకచోట తప్ప రోడ్డంతా బాగానే ఉంది. అయితే ముసునూరు దక్షిణ ప్రాంతంలో శివారెడ్డి రైస్‌మిల్ సమీపంలో 20 మీటర్ల మేర రోడ్డు దెబ్బతిని ఉంది. ఈవిషయం తెలియని వాహన చోదకులు వేగంగా వస్తూ దెబ్బతిన్న ప్రాంతంలో సడన్‌గా బ్రేక్ వేస్తున్నారు. దీంతో వాటి వెనుక వస్తున్న వాహనాలు ముందు వెళ్లే వాహనాలను ఢీకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా, గురువారం ఉదయం ముందు వేగంగా వెళుతున్న ఒక కారు దెబ్బతిన్న రోడ్డు వద్ద బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటారుసైకిల్ కారును ఢీకొనటంతో మోటారుసైకిల్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నందున దెబ్బతిన్న రోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేసి గుంతలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్యాచ్‌వర్క్ ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే అక్కడ సూచిక బోర్డు అయినా ఏర్పాటుచేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి


అల్లూరు : గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ


కలిగిరి: పౌరహక్కులను తెలియజేస్తున్న తహసీల్దారు గిరీష్

అల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతీనెలా చివరి రోజు పౌర హక్కుల దినోత్సవంగా మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని అన్ని శాఖల అధికారులు హాజరై పౌరహక్కుల గురించి వివరించేలా కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశానుసారం అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంట గిరిజన కాలనీలో గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులకు పౌర హక్కుల గురించి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ప్రసాదరావు, ఆర్ఐ ప్రభు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కలిగిరి : పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం గ్రామంలో గురువారం తహసీల్దారు గిరీష్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తనకున్న హక్కులను విధిగా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఆర్ మురళిమోహన్, పి చినరాజ్యం, నర్రావుల రామకృష్ణ గ్రామరెవెన్యూ సహాయకులు టి సత్యనారాయణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అన్నారు. బోగోలు మండలం ఎస్సీపాలెం పంచాయతీలోని గిరిజన కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. హక్కుల గురించి గిరిజనులకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగితెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాకి తిరుపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం


ఆలయ నిర్మాణానికి సాయం అందిస్తున్న బొల్లినేని

కలిగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు గురువారం మండలంలో పర్యటించారు. కావలి ముస్తాపురం పంచాయతీ దంటుపాలెం గ్రామంలో సీతా రామస్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.10వేల నగదును గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పెద్దకొండూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు నోటి రమణారెడ్డి అనారోగ్యానికి గురై ఇంటివద్ద చికిత్స పొందుతుండగా బొల్లినేని ఆయన్ను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20వేల ఆర్థిక సహాయం అందజేశారు.

● కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజపురం గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల మాలకొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ చెరుకూరు వెంకటాద్రి, సీనియర్ నాయకులు వల్లూరు వెంకటేశ్వర్లు, చిట్టాబత్తిన బాలయ్య, నర్రావుల వెంకటేశ్వర్లు, నర్రా చెంచునాయుడు, పదర్ల తిమోతి, ఆకుల మహేష్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపెంట సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పునరుద్ధరణ


కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసిన విద్యుత్ శాఖ అధికారులు

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం తుమ్మలపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది బిగించి గురువారం విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగా, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించటానికి జిల్లా ఎస్ఈ విజయన్, కావలి ఈఈ బెనర్జీ, డిప్యూటీ ఈఈ రవికుమార్, రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డి తోపాటు సుమారు 60 మంది ఆపరేషన్ సిబ్బంది శ్రమించి 36 గంటలలో విద్యుత్‌ను పునరుద్ధరించటంతో ఆయా గ్రామాల ప్రజలతోపాటు ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చశారు.

మృతుడి కుటుంబానికి మంద కృష్ణమాదిగ పరామర్శ


సూరపోగు శ్యామ్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్‌లో క్రియాశీలంగా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సూరపోగు శ్యామ్ కుటుంబ సభ్యులను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ గురువారం పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆది ఆంధ్ర కాలనీలో శ్యామ్ నివాసానికి వెళ్లి శ్యామ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు సత్కారం

కాగా, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని ఓగూరులో మందకృష్ణమాదిగను కలిసిన వారు ఆయనను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

సందేహాలు నివృత్తి చేశాకే భూసేకరణ జరపాలి : దివి

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకి బలవంతంగా భూసేకరణ చేయాలన్న ఆలోచనను అధికారులు మార్చుకుని రైతులు, గ్రామస్థుల సందేహాలు నివృత్తి చేయటం ద్వారా రైతుల సహకారంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం ఒక ప్రకటనలో కోరారు. ఇండోసోల్ ప్రతినిధులతో కలిసి జిల్లా అధికారులు కరేడులో సమావేశం ఏర్పాటుచేయటం ద్వారా అన్ని వేల ఎకరాలు సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమకు ఎందుకు అవసరమవుతుందో వివరించాలని కోరారు. అలాగే కరేడులో ఈ పరిశ్రమ ఏర్పాటువలన భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులు పైనా రైతులకు, గ్రామస్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు.

ఆధార్ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థుల ఇక్కట్లు

● అప్‌డేట్ కోసం పట్టణాలకు పరుగులు ● వృద్ధులు, చిన్నారుల అవస్థలు

కొండాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇతర మండలాలకు, పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో విద్యార్థులు సుమారు 8000 మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులకు ఆధార్‌లో వివరాలలో కొద్దిపాటి తేడాలున్నాయి. పేర్లు, పుట్టిన తేదీ, జండర్ తదితర విషయాలలో తేడాలుండటం వలన ఆన్‌లైన్లో నమోదు కావడంలో ఇటు విద్యార్థులు అటు పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు నూతనంగా ఆధార్ కార్డు తీయించుకునేవారు, పెద్దలు, రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందేందుకు తమ ఆధార్‌లో కొంత సమాచారాన్ని అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. వీరందరూ 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి, కందుకూరు పట్టణాలకు వెళ్లి గంటలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి సర్వర్లు పనిచేయక మరుసటిరోజు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, మండలంలో గతంలో గుడవల్లూరు, తూర్పు ఎర్రబల్లి, చింతలదీవి గ్రామాలలోని సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు ఉండేవి. వీటిలో ఒక్క ఆధార్ కేంద్రం కూడా ప్రస్తుతం పనిచేయడంలేదు. ఇదిలా ఉండగా సాయిపేట, చింతలదీవి సచివాలయాలలో నూతనంగా ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసేందుకు సుమారు 3 నెలల క్రితం మెటీరియల్ సచివాలయాలకు చేరింది. అప్పటి నుంచి వాటిని మూలన పడేశారు. అలాగే ఆధార్ కేంద్దరం నిర్వహణకు సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రాలను ప్రారంభించి సమస్యలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు తెలియచేశాం: ఇన్‌చార్జి ఎంపీడీవో

మండలంలో ఆధార్ సమస్యలపై ఉన్నతాధికారులకు తెలియచేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో శేషసాయి తెలిపారు. గతంలో ఆధార్ తీయడంలో అర్హత ఉన్న ఉన్న డిజిటల్ అసిసెంట్లు బదిలీ కావడంతో జాప్యం నెలకొంది. బదిలీపై వచ్చిన డిజిటల్ అసిస్టెంట్లు ప్రత్యేకంగా నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వెంటనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఈవిషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తామన్నారు.

పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గ్రామసభలో ఆమోదం


గ్రామసభనిర్వహిస్తున్న తహసీల్దారు, రెవెన్యూసిబ్బంది

కలిగిరి, జూలై 31: మండలంలోని పెదకొండూరు గ్రామ సర్వే నెంబరు 739లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గురువారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్థులు ఆమోదం తెలిపినట్లు తహసీల్దారు గిరీష్ తెలిపారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సభలో స్థానికులు కోరారన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితోపాటు సర్పంచ్ మొక్కా సుజాత, స్థానిక టీడీపీ నాయకులు బీవీ రామారావు, మొక్క హజరత్‌రావు, పాల్గొన్నారు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న మన్నవ, మలిశెట్టి

కావలి (టౌన్) జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వెంగళరావు నగర్‌లోని మన్నవ స్వగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా విజయకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జ్ఞాపకార్థం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కమ్మవారి సేవా సంఘం నాయకులు గడ్డం శ్రీనివాసులు నాయుడు, ప్రొఫెసర్ ఏవీ నాయుడు, మన్నవ యశ్వంత్ చౌదరి తదితరుల చేతుల మీదుగా 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున స్కాలర్‌షిప్‌ల రూపంలో అందించారు. అతిథులు మాట్లాడుతూ మన్నవ తన సతీమణి జ్ఞాపకార్థం పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం


అల్లి బుజ్జమ్మ (ఫైల్)

కావలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పుల్లారెడ్డినగర్‌కు చెందిన అల్లి బుజ్జమ్మ (82) గురువారం మరణించారు. కావలి రెడ్‌క్రాస్ మరణానంతర సేవల విభాగం కన్వీనర్ కలికి శ్రీహరిరెడ్డి ప్రేరణతో ఆమె కుమారుడు అల్లి ప్రసాద్ తన తల్లి నేత్ర దానానికి అంగీకరించారు. కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం పర్యవేక్షకురాలు ఇలింద్ర శ్రీవాణి నెల్లూరు మోడరన్ ఐ బ్యాంకుకు బుజ్జమ్మ నేత్రాలను దానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆమె కార్నియాలను మోడరన్ ఐ బ్యాంకు టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించారు. కుటుంబ సభ్యులకు కలికి శ్రీహరిరెడ్డి నేత్రదాన ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 141వ నేత్రదానమని రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ తెలిపారు.

పగిలిన మంచినీటి పైపులైన్

● నిలిచిన నీటి సరఫరా

లింగసముద్రం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీసేవా కేంద్రం సమీపంలో అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 రోజుల క్రితం మంచినీటి పైపులైన్ పగిలిందని, ఈ విషయం అధికారులకు కూడా తెలియజేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని మంచినీరు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

ఎన్నికల ప్రచారానికే క్రీడాభివృద్ధి పరిమితం

● వైసీపీ ప్రభుత్వంలో క్రీడా వికాసానికి గ్రహణం


బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన క్రీడా వికాస కేంద్రం

కావలి(టౌన్) జూలై 31 (ఆంధ్రజ్యోతి)ప్రభుత్వాలు మారుతున్నాయే గాని క్రీడాకారుల తలరాత మటుకు మారటం లేదు. విద్యార్థికి విద్యతో పాటు క్రీడలు రెండు కళ్ళు లాంటివని క్రీడాభ్యున్నతికి పాటుపడతామని క్రీడా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పాలకులు అధికారులు తమ ప్రసంగాల్లో ఊదర గొట్టడమేకాక ఎన్నికల ప్రచారంలో క్రీడాభివృద్ధి ప్రచార అస్త్రంగా వాడుకోవడం అనంతరం గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కావలి విట్స్ కళాశాల పక్కన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిలో మినీ స్టేడియం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అప్పటి హోమ్ మంత్రి దేవేందర్ గౌడ్ శంకుస్థాపన చేసారు. ఇప్పటికీ స్టేడియం నిర్మాణం అతీగతీ లేక ఎటువంటి సౌకర్యాలు లేని గులకరాళ్ళ మైదానంలోనే పిల్లలు యువకులు ఆడుకుంటు కాలం వెళ్ళదీస్తున్నారు. క్రీడాభివృద్ధి ఏమాత్రం జరుగుతుందో కావలి స్టేడియం మంచి ఉదాహరణగా కనిపిస్తుంది.

పునాదిలోనే శిథిలమౌతున్న క్రీడా వికాస కేంద్రాలు

2014-15 సంవత్సరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు(కెవికె) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలతో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 కెవికె కేంద్రాలు మంజూరు చేసి ఒక్కో కేంద్రానికి రూ.2కోట్లు మంజూరు చేసింది. (శాప్) స్పోర్ట్స్ అధారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణలో (ఏపీఇడబ్ల్యుఐడీసీ) ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిర్మాణ పనులు అప్పజెప్పారు. ప్రస్తుత నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కావలి కెవికె కేంద్రం బేస్‌మెంట్ దశలో అర్థాంతరంగా ఆగిపోయింది. కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు జెడ్పీ పాఠశాల మైదానం ప్రాంగణంలో, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో క్రీడా వికాస కేంద్రాలు వివిధ దశలో పనులు జరిగాయి.

వైసీపీ ప్రభుత్వంలో క్రీడా వికాసానికి గ్రహణం

క్రీడాకారుల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన క్రీడా వికాస కేంద్రాలకు వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన కెవికె కేంద్రాలు వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనేక రకాల కొర్రీలు పెట్టి పనులు అడ్డుకోవడంతో నిర్మాణ పనులు ఒక్క అంగుళం కదలక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. కావలి కెవికె నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ముందుకు రాగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి కెవికె ప్లాన్ బాగా లేదని అవసరాలకు తగ్గట్లుగా లేదని పనులను అడ్డుకున్నారు. రూ,7.50కోట్ల ప్రతిపాదనలతో నూతన ప్లాన్ రూపొందించి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తెస్తామన్న హామీలు నెరవేరకపోవడం అంకిచెడె మంకి చెడె అన్న సామెతగా కెవికె పనులు బేస్‌మెంట్ దశలో ఆగిపోవడమేకాక శిధిలమైపోయే ప్రమాదముంది.

ఆధిపత్య పోరు

(5వ పేజీ తరువాయి)

మంచిదని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

● అసమానతలు తొలగించాలి...

గ్రేడ్-2 హెచ్‌ఎంలను కన్వర్షన్ ద్వారా ఎంఈవోలుగా నియమించగా, గత వైసీపీ ప్రభుత్వం వివక్ష కారణంగా ఎంఈవో-1ను డీడీవోగా, ఎంఈవో-2ను నాన్ డీడీవోలుగా విభజించి, సమానహోదాను దూరం చేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఇద్దరు ఎంఈవోల వ్యవస్థ మధ్య అసమానతలు సృష్టించిందని, దీంతో ప్రజల్లో ఎంఈవో-2 అంటే చులకనభావం నెలకొందని మండల స్థాయి అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థలో కూడా ఇద్దరు అధికారుల పర్యవేక్షణ లేదని, ఆయన పేర్కొన్నారు. అధిక శాతం మంది ఎంఈవోలు దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో తిష్టవేయడంతోపాటు విద్యాశాఖలో ఎంతో కీలకమైన ఎంఈవో-1 పోస్టులకు సంబంధించి అందరూ కూడా అన్నీ వసతులు కలిగి, నగరానికి సమీపంలో ఉన్న మండలాలు, రోడ్డు సర్వీస్ ఉన్న మండలాల్లో మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతాలు, వసతులు లేనిచోట మాత్రం ఎవరూ సుముఖత చూపకపోవడంతో 20 మండలాల్లో ఇన్‌ఛార్జి ఎంఈవో-1లతో నెట్టుకురావాల్సి వస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం శాఖాపరమైన సమీక్ష, మరోరోజు ఉన్నతాధికారుల సమీక్ష, వీటికితోడు ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్రొటోకాల్ హాజరు తదితర కార్యక్రమాలతోనే తమకు సమయం సరిపోతున్నదని ఎంఈవో ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై సమీక్ష చేసి ఏకీకృత విధానంతో సమస్యను పరిష్కరించాలని అత్యధికశాతం మంది ఎంఈవోలు కోరుతున్నారు.



కృష్ణారెడ్డిపాల్లిలో ఆందోళన చేస్తున్న మహిళలు

బెల్టుషాపులు నివారించాలని ఆందోళన

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టుషాపులను నివారించాలని గురువారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. తొలుత గ్రామంలో ఉదయగిరి ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివమ్మ, మస్తాన్‌బీ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వీధికో అనధికారిక మద్యం షాపు ఏర్పాటు చేయడంతో వివాదాలు చెలరేగుతున్నాయన్నారు. మద్యం బెల్టు దుకాణాలను నివారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడడంలేదని మండి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు మద్యం బెల్టు దుకాణాలను నివారించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.కామాక్షమ్మ, కాకు విజయమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఈ.సుజాత, సహాయ కార్యదర్శిగా షేక్ నయూంతో పాటు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. గురువారం గొల్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 5లోని 102 ఎకరాలను సుమారు 40 మంది రైతులకు 2001లో పంపిణీ చేశారు. కాని హద్దులు చూపక పోవడంతో గ్రామంతో పాటు సమీప యర్రంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎవరికి వారు భూములు సాగు చేసుకుంటున్నారు. దీంతో తమ అసలైన భూములు ఎక్కడో తెలియక ఇరు గ్రామాల నడుమ వివాదాలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది రైతుల అభ్యర్థన మేరకు సబ్ కలెక్టర్ భూములను పరిశీలించి రైతులతో చర్చించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులు సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్ కుమార్, ఆర్‌ఐ హర్షద్ అహమ్మద్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ



చేతిపంపు బాగుచేయండి సారూ..

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం ఆత్మారామస్వామి ఆలయం గేటు వెలుపల భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చేతిపంపు మరమ్మతులకు గురైంది. గత మూడు నెలల కిందట చేతిపంపు మరమ్మతులకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చేతిపంపును బాగు చేయాలని భక్తులు కోరుతున్నారు.

విశిష్టమైనవి తల్లిపాలు!

నేటి నుంచి ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

- బిడ్డకు అవే ప్రాణాధారం
- గుండె, క్యాన్సర్ జబ్బుల నివారణకు దోహదం
- అవగాహన కల్పించడంలో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల నిర్లక్ష్యం



నెల్లూరు(వైద్యం), జూలై 31(ఆంధ్రజ్యోతి) : నవ మాసాలు మోసి కన్న బిడ్డను పెంచడంలో తల్లిపాత్ర కీలకమైనది. అంతే విశిష్టత కలిగినవి తల్లిపాలు. బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే మహత్తర శక్తి వచ్చి ప్రాణాధారంగా మారుతాయి. గుండె, కేన్సర్ వంటి జబ్బుల నివారణకు దోహదపడుతాయి. అయితే దీనిపై అవగాహన కల్పించేందుకు అటు వైద్య ఆరోగ్యశాఖ, ఇటు ఐసీడీఎస్ తగిన ప్రచారం చెయ్యడం లేదన్నది వాస్తవం. మాతృత్వానికి చిరునామాగా తల్లీబిడ్డలనే ఆదర్శంగా తీసుకుంటారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు ఎంతో ముఖ్యం. ఈ పాలు పలు వ్యాధుల నివారణకు పనిచేస్తాయని నిపుణులు అంటున్నారు. అయితే నేటి తల్లులు ఎంత వరకు ఆ పాలను బిడ్డకు పట్టిస్తున్నారో అన్న సందేహం లేకపోలేదు. అందం చెడిపోతుందని ఎందరో తల్లులు పాలు ఇవ్వడం లేదు. ఇందులో వాస్తవం లేదని అందానికి ఎలాంటి డోకా లేదని వైద్య నిపుణులు చెబుతున్నా డబ్బా పాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల పిల్లల ఎదుగుదలతో పాటు వారి మానసిక పరివర్తనలోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చిన్నారుల్లో రోగ నిరోధకశక్తితో పాటు ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు, విటమిన్లు అన్ని తల్లిపాలలో ఉన్నాయి. పుట్టిన చిన్నారికి అమృతంగా భావించే ముర్రిపాలు మానసిక ఎదుగుదలకు, మెదడు చురుగ్గా పని చేసేందుకు తోడ్పడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల పాల ఉత్పత్తులు వచ్చినప్పటికీ తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తల్లిపాల ప్రాధాన్యత గురించి చెబుతూ ఎన్నో మార్గదర్శకాలను విడుదల చేసింది. తప్పనిసరిగా పుట్టిన బిడ్డకు ముర్రిపాలతో పాటు 6 నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇదే ప్రచారం చేస్తోంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇది అమలు కావటం లేదు. భారతీయ సంప్రదాయం లోనూ తల్లి పాలు ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని ఐక్య రాజ్య సమితి సైతం వెల్లడించింది.

పాలిచ్చే తల్లులకు ఎంతో మేలు

- బిడ్డలకు పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాదస్థాయిని తగ్గిస్తుంది.
- గర్భాశయం, అండాశయంలో క్యాన్సర్ నిరోధిస్తుంది. కణజాలంలో ఈస్ట్రోజన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.
- ముర్రుపాలు బిడ్డ తాపించడం వల్ల తల్లి, బిడ్డకు ఎముకల వ్యాధి నియంత్రణకు దోహదపడతాయి.
- భావోద్వేగాలు అరికడుతోంది.

● జిల్లాలో ప్రచారం ఏది?

జిల్లాలో తల్లిపాలపై తగిన ప్రచారం సన్నగిల్లుతోంది. జిల్లా వ్యాప్తంగా తల్లిపాల విశిష్టతను తెలిపే అవగాహన సదస్సులను వైద్య ఆరోగ్యశాఖతో పాటు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించాలి. జిల్లా వ్యాప్తంగా 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిద్వారా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. పీహెచ్‌సీలలోనూ గర్భిణులకు తల్లిపాలు ప్రాధాన్యత తెలియచేయాలి. అయితే ఆ మేరకు కార్యక్రమాలు నిర్వహించడంలో చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తల్లిపాల విశిష్టతపై ప్రభుత్వం కరపత్రాల రూపంలో వైద్యశాఖకు వచ్చేవి. అయితే వాటి ఊసే లేదు. అలాగే తల్లిపాల వారోత్సవాలపై మార్గదర్శకాలను వారంలోపే ఐసీడీఎస్‌కు చేరాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీనివల్ల తల్లిపాల వారోత్సవాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం కూడా ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు మిగిలిన ప్రాంతాల్లో కూడా విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తే చిన్నారుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినట్లే.

చిన్నారులకు ఉపయోగాలు..

- నవజాత శిశువు జన్మించిన తరువాత తల్లికి వచ్చే ముర్రుపాలు బిడ్డకు తాగించాలి.
- ఇందులో ఎన్నో పోషకాలు, విటమిన్లు ఉంటాయి.
- పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్ఠమైనవి.
- చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచే గుణం ఉంది.
- ఊబకాయం కూడా నిరోధించడమే కాకుండా మెదడు చురుకుగా పని చేసేలా ఆరోగ్య ప్రధాయినిలా నిలుసాయి.

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు



పుట్టిన బిడ్డకు ఎన్నో పోషకాలు ఉన్న తల్లి ముర్రుపాలు ఇవ్వడం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. తల్లిదండ్రులతోపాటు ప్రతి ఒక్కరు తల్లిపాల విశిష్టతను గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలకు వచ్చే తల్లులకు తల్లిపాల విశిష్టతను ముందుగానే తెలియచేస్తున్నారు. తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేసేలా కృషి చేస్తాం. పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కల్పిస్తారు.

\- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

● ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్

నెల్లూరు(హరనాథపురం), జూలై 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ చెప్పారు. నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వారోత్సవాల ప్రారంభం రోజున వైద్యశాలలు, మాల్స్, దేవాలయాలు, బస్‌స్టాండ్‌లు తదితర చోట్ల బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏపీడీ అనురాధ, అర్బన్ సీడీపీవో టీ.అరుణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఉద్యోగులకు పదోన్నతి

● కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



నియామకపు ఉత్తర్వులను అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు

నెల్లూరు(జడ్పీ), జూలై 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పలువురు ఉద్యోగులకు పదోన్నతి, కారుణ్య నియామకపు ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో జే.మోహన్‌రావు అందజేశారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలో ఒక సీనియర్ సహాయకురాలికి పరిపాలనాధికారిగా, ఆరుగురు జూనియర్ సహాయకులు, టైపిస్టులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు మరో ఇద్దరికి కారుణ్య నియామకపు ఉత్తర్వులు అందజేశారు. పొదలకూరు మండల ప్రజాపరిషత్ పరిపాలనాధికారిగా బీ.విజయశ్రీ, వెంకటరమణయ్యకు తోటపల్లి గూడూరు, రామకృష్ణకు కొండాపురం, ఇలియాజ్‌కు సీతారామపురం, లీలా మోహనరావుకు నెల్లూరు జడ్పీ, సుదర్శన హారతికి కొడవలూరు, దేవప్రసన్నకుమార్‌కు చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. అలాగే కారుణ్య నియామకాల కింద అనగాని కవితకు కోవూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆఫీస్ సబార్డినేటుగా, గుర్రం రజితకు వరికుంటపాడు మండల ప్రజా పరిషత్ కార్యాల ఆఫీస్ సబార్డినేటుగా నియామకపు ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాలలో 120 మందికి పదోన్నతులు కల్పించామన్నారు. 81 మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేశామన్నారు. జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో ఎప్పటికప్పుడు పదోన్నతులు, కారుణ్య నియామకాలు త్వరితగతిన ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు అధిగమించకపోతే చర్యలు

- జిల్లాకు రెండు వేల గోకులం షెడ్ల మంజూరు
- డ్వామా పీడీ గంగాభవాని వెల్లడి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

ఉదయగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని హెచ్చరించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ స్థాయిలో ఏపీవోలు, ఈసీలు, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను ఇప్పటివరకు 70 శాతం పూర్తి చేశారని, ఆగస్టు చివరి నాటికి 90 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీలో 100 కంపోస్టు పిట్‌లు ఏర్పాటు చేయాలని, ఈ నిర్మాణాలను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండలంలో మూడు పంచాయతీల్లో నూరు శాతం ఇంకుడుగుంతల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పండ్లతోటల పెంపకంలో భాగంగా జిల్లాలో 3,500 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,700 ఎకరాల్లో రైతులను గుర్తించామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 2,000 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మృదుల, ఎంపీడీవో అప్పాజీ, ఏపీవోలు, సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

జగన్ నీతులు చెప్పడం సిగ్గుచేటు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విలువలకు అర్థం తెలియని జగన్మోహన్‌రెడ్డి నీతులు మాట్లాడటం సిగ్గుచేటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. నెల్లూరు పర్యటనలో జగన్మోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని దుయ్యబట్టారు. తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో విచ్చలవిడిగా క్వార్ట్జ్ దోపిడీ జరుగుతుంటే తాము రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అక్కడ ఏమీ జరగలేదు అన్నట్లుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంచి బాలుడు అన్నట్లుగా జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబును కొట్టే ధైర్యం పెద్దిరెడ్డికి ఉందా అని సోమిరెడ్డి ప్రశ్నించారు. మిథున్‌రెడ్డి జైలుకు వెళ్లడానికి కారణం కక్ష సాధింపులు కావని, జగన్ ధన దాహమేనని విమర్శించారు. జగన్‌రెడ్డి కనుసైగల్లో జరిగిన లిక్కర్ స్కామ్‌లో 40 మంది నిందితులుగా చేర్చారని, వారిలో ఇప్పటికే 12 మంది జైలుకెళ్లారని గుర్తు చేశారు. ఉచిత ఇసుక గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేసినందుకే అప్పటి మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి జైలుకు వెళ్లిన విషయాన్ని జగన్ గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. నాడు జగన్ బయటకు వస్తుంటే పరదాలు కట్టేవారని, ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్య పాలన జరుగుతోందని, గత పరిస్థితి ఇప్పుడు లేదని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. అధికారుల గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని, ఆయన కారణంగా అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలుకెళ్లారని గుర్తు చేశారు.

దొంగే.. దొంగ అన్నట్టుంది : కోటంరెడ్డి

దొంగే.. దొంగ అన్నట్లుగా ప్రజాస్వామ్యం గురించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజాపోరాటాలు చేసిన వారిపై అక్రమ కేసులు, అరెస్టులు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన సాగిస్తున్నారు కాబట్టే వైసీపీ నాయకులు చేసిన ప్రతీ అవినీతి, అక్రమ వ్యవహారంలో న్యాయబద్ధంగా ముందుకెళుతున్నామని స్పష్టం చేశారు. 'చంద్రబాబు బావిలో దూకాలంటూ జగన్ మాట్లాడుతున్నారు. బావిలో దూకాల్సింది చంద్రబాబు కాదు.. జగన్మోహన్‌రెడ్డే. ఎందుకుంటే తన పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించి భ్రష్టు పట్టించారు. అందుకే ప్రజలు 11 సీట్లతో బుద్ధి చెప్పారు' అని శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో తామం తా చివర వరకూ జగన్ వెంటే ఉంటామని చెప్పామని, కానీ ఆ తర్వాత ఎందుకు దూరమయ్యామో జగన్ గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. జగన్‌కు ఇంగిత జ్ఞానం ఉంటే చంద్రబాబుకు, నెల్లూరు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రేపు ఆట్యా పాట్యా జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆట్యాపాట్యా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీనగర్ ఎంఎస్ఎం స్కూల్‌లో ఈనెల 2వ తేదీ సాయంత్రం 3 గంటలకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కే.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2008 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన టోల్‌బూత్

లారీ ఢీకొని టోల్ బూత్ ధ్వంసం

మర్రిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో డీసీపల్లి టోల్‌గేట్ బూత్ ధ్వంసం అయిన సంఘటన గురువారం జరిగింది. నెల్లూరు నుంచి కడప వైపు లారీ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బూత్‌లో ఎవరూ లేనందున ప్రమాదం తప్పింది. టోల్ ప్లాజా వద్ద వాహనాలు వెళ్లేందుకు దారి ఇరుకుగా ఉండటంతో తరచుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, నిర్వహణ సక్రమంగా లేదంటూ వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు

విడవలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికలకు 3 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు బుధవారం తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహ కారంతో టీడీపీ బలపరిచిన చలంచర్ల కామేశ్వ రమ్మ రెండు నామినేషన్లను దాఖలు చేసింది. డమ్మీ అభ్యర్థిగా కానూరు ప్రవల్లిక ఒక సెట్ నామినేషన్‌ని దాఖలు చేసింది. ఈ సంద ర్భంగా ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీటీసీ అభ్యర్థిగా చలంచర్ల కామేశ్వ రమ్మను ఎన్నికల్లో నిలబెడుతున్నామన్నారు. ఎన్నికలు అనివార్యమైతే స్థానిక నాయకు లం దరూ కలసికట్టుగా ఎంపీటీసీ అభ్యర్థి గెలుపున కు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, టీడీపీ నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సత్యవోలు సత్యం రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, సమాది శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 20 లక్షలు... ఇంటికో ఉద్యోగం

- అభివృద్ధికి కరేడు రైతులు సహకరించాలి
- ఎమ్మెల్యే ఇంటూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో కొత్త పరిశ్రమల రాకతో అభివృద్ధి వేగం పుంజుకుంటోందని, ప్రజలందరికీ మేలుచేసే ఇలాంటి అభివృద్ధిని అందరూ స్వాగతించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం కరేడు రైతులకు ఎకరానికి రూ. 20 లక్షలు పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇప్పించటం జరుగుతుందని, పరిశ్రమ కోసం మొదట్లో 8500 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినా రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కేవలం 4800 ఎకరాలు మా త్రమే తీసుకునేందుకు సీఎం చంద్రబాబు అంగీకరిం చారని, ఈనేపథ్యంలో పరిశ్రమ కోసం రైతులంతా సహకరించాలని కోరారు. భూమి ఇచ్చిన ప్రతిరైతు ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు కలెక్టరు అంగీకరించారన్నారు. ఆగస్టు నాటికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెల్లూరు ఎందుకు వచ్చారో ప్రజలకు సమాధా నం చెప్పాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కందుకూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 36మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 21 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో ఎంత్రపాటి వెంకటేశ్వర్లు సేవలు అభినందనీ యమని ఎక్సైజ్ డీసీ ఎం.శంక రయ్య కొనియాడారు. ఎక్సైజ్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఇన్ స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఆయన సన్మాన కార్యక్రమం గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ దయాసాగర్ రావు, ఈఎస్ శ్రీనివాసులు నాయుడు, అధికారులు రమేష్, జగదీష్‌కుమార్, అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మూత పడ్డ పాఠశాల

మధ్యాహ్నానికే పాఠశాల మూత

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పం చాయతీ పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల గురువారం మధ్యాహ్నానికే మూతపడింది. పాఠ శాల ఉపాధ్యాయుడు సెలవులో ఉండడంతో సీఆర్‌ఎంటీ ప్రసాద్‌కు పాఠశాల బాధ్యతలు అప్పగించారు. ఆయన మధ్యాహ్నం వరకు పాఠశా లలో ఉండి మధ్యాహ్నం నుంచి సమావేశం ఉందని విద్యార్థులకు చెప్పి వెళ్లిపోయారు. దీంతో పాఠశాల మూతపడింది. ఈ విషయంపై ఎంఈవో-1 పద్మనాభరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.